ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం 05.06.2026 | సంపుటి : 12 సంచిక : 316 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్






## కేరళం తీరాన్ని తాకిన నైరుతి

- సాధారణ తేదీ కంటే నాలుగు రోజుల ఆలస్యంగా రాక
- నాలుగైదు రోజుల్లో తెలంగాణను తాకనున్న రుతుపవనాలు
- కేరళ, తమిళనాడులో భారీ వర్షాలు
- ఎల్‌నినో ప్రభావంతో ఈసారి సాధారణం కంటే తక్కువ వర్షపాతం అంచనా

**తిరువనంతపురం(జనంసాక్షి):**మండుటెండలతో అల్లాడిపోతున్న దేశ ప్రజలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) చల్లని కబురు చెప్పింది. దేశంలో వర్షాకాలానికి నాంది పలికే నైరుతి రుతుపవనాలు గురువారం (జూన్ 4) అధికారికంగా కేరళలోకి ప్రవేశించాయి. దీంతో భారత్‌లో

మిగతా 9లో..

## ఉమ్మడి మహబూబ్‌నగర్ ప్రాజెక్టులు
# త్వరగా పూర్తిచేయాలి

### కొడంగల్ ఎత్తిపోతల ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు



- మక్తల్- నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- పనుల పురోగతిపై అధికారులతో సీఎం ఉన్నతస్థాయి సమీక్ష



**నారాయణపేట/మక్తల్(జనంసాక్షి):** మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా లక్ష ఎక రాలకు సాగునీరు అందుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలిపారు. బీమా కృష్ణా నదులపై నిర్మించనున్న ప్రాజెక్టు పనుల పురోగతిపై గురు వారం ముఖ్యమంత్రి బెంగుళూరు నుంచి నేరుగా మక్తల్ చేరుకోగా ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరిలకు జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పా టు చేసిన ఇరిగేషన్ ప్రాజెక్టులపై ఫోటో గ్యాలరీని ముఖ్యమంత్రి వీక్షించారు. మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం భీమా కృష్ణా నదులపై ప్రతిపాద బ్యారేజీ పనులు పురోగతికి సంబంధించిన ఫోటో ఎగ్జిబిషన్ ప్లాన్ మ్యాప్స్ ద్వారా ముఖ్యమంత్రికి వివరించిన ఇరిగేషన్ అధికారులు. ‹రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి మక్తల్ మండలం కాట్రేవు పల్లి గ్రామ సమీపంలో కొనసాగుతున్న మక్తల్ నారాయణ పేట కొడంగల్ ఎత్తిపోతల ప్యాకేజ్ -1 పనులను గురువారం పరిశీలించారు. ప్యాకేజ్ -1 లో భాగంగా జరుగు తున్న పంప్ హౌస్ పనులు ఎంత శాతం పూర్తయ్యాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాంక్రీటు పనులను ప్రారంభించి వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కర్ణాటక రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి బోసు రాజు, జిల్లా మంత్రులు జూపల్లి కృష్ణారావు, డాక్టర్ వాకిటి శ్రీహరి, కలెక్టర్ సీహెచ్ ప్రియాంక, ఇరిగేషన్ కార్యదర్శి శ్రీదర్, చీఫ్ ఇంజనీరు.

మిగతా 2లో..



## ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు ఓకే

### కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

**ఆదిలాబాద్(జనంసాక్షి):** ఆదిలాబాద్ ఎయిర్ పోర్టుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది . ఎయిర్ పోర్టుకు 1580 ఎకరాలు ఇవ్వడానికి సిద్ధమైన రాష్ట్ర సర్కార్ ప్రతిపాదన లేఖను రక్షణ శాఖ జాయింట్ సెక్రెటరీ మహంతికి ఎమ్మెల్యే పాయల్ శంకర్ అందించారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన లేఖ పట్ల సానుకూలత తెలిపింది కేంద్రం. రక్షణ శాఖ చెందిన 400 ఎకరాలు, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే1580 ఎకరాలు కలిపి1980 ఎకరాల్లో ఎయిర్

మిగతా 9లో..

## విదేశీ మదుపర్లకు దన్ను

- ఎల్‌టీసీజీ పన్ను నుంచి మినహాయింపు..!
- పశ్చిమాసియా యుద్ధ ప్రభావాన్ని తగ్గించేందుకు, రూపాయి బలోపేతానికి కేంద్రం కీలక నిర్ణయం



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**మన ఆర్థిక వ్యవస్థపై పశ్చిమాసియా యుద్ధ ప్రభావాన్ని తగ్గించి రూపాయి విలువను బలోపేతం చేయడంతో పాటు దేశంలోకి విదేశీ పెట్టుబడుల ప్రవాహాన్ని పెంచే దిశగా కేంద్రం కీలక ముందడుగు వేసింది. విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్ల పెట్టుబడులపై

మిగతా 9లో..



## సబ్ రిజిస్ట్రార్ల అధికారాలకు కత్తెర

### మార్కెట్ విలువ ప్రకారమే భూముల ధరల పెంపు: మంత్రి పొంగులేటి

- ప్రాంతాన్ని బట్టి 50 నుంచి 100 % వరకు పెంపు
- నేటి నుంచే అమల్లోకి పెంచిన రేట్లు
- రూ.1200 నుంచి రూ.1400 కోట్ల మేర ఆదాయం

**హైదరాబాద్(జనంసాక్షి):** మార్కెట్ వ్యాల్యూ ప్రకారం భూ ముల ధరలు శుక్రవారం నుంచి పెరుగుతాయని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. భూముల ధరలు ఏరియాను బట్టి 50 నుంచి100 శాతం పెరుగుతాయని తెలిపారు. ప్రైమ్ ఏరియాలో 100 శాతం పెరుగుతాయన్నారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విలేకర్లతో మాట్లాడారు. భూముల వ్యాల్యూ పెరగటంతో రాష్ట్ర ప్రభుత్వానికి

మిగతా 2లో..




## భారత్‌లో ఎబోలా కలవరం



- ముగ్గురు వైరస్ అనుమానితుల గుర్తింపు
- కేంద్ర ఆరోగ్య శాఖ అప్రమత్తం
- ముందు జాగ్రత్త చర్యగా ఆ ముగ్గురు వ్యక్తులు గృహ నిర్బంధంలోనే..

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ప్రపంచవ్యాప్తంగా ఎబోలా ఆందోళనల నేపథ్యంలో భారత్‌లోనూ వైరస్ కలకలం రేపింది. ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ జిల్లాలో ఎబోలా వైరస్ అనుమానితులను గుర్తించడంతో ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. కాంగో, ఇథియోపియా, ఉగాండా దేశాల నుంచి ముగ్గురు వ్యక్తులు వచ్చినట్లు జిల్లా కలెక్టర్ అభిజిత్ సింగ్ తెలిపారు. ప్రస్తుతం ఈ ముగ్గురు వ్యక్తుల ఆచూకీని గుర్తింపు, వారి పర్యవేక్షించే ప్రక్రియ కొనసాగుతోంది. కేంద్ర సంస్థల నుంచి అందిన హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. అయితే, ఇప్పటివరకు వారిలో ఎవరికీ ఎబోలా సోకినట్లు నిర్ధారణ కాలేదని తెలిపింది. ముందు జాగ్రత్త చర్యగా ఆ ముగ్గురు వ్యక్తులను గృహ నిర్బంధంలోనే వైద్య పర్యవేక్షణలో ఉంచినట్లు పేర్కొంది.ఇదిలా ఉండగా కాంగో, ఉగాండా వంటి ఆఫ్రికా దేశాల్లో ఎబోలా వేగంగా వ్యాపిస్తోంది. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం

మిగతా 2లో..



### శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఎబోలా కలకలం

- సూడాన్ నుంచి వచ్చిన వ్యక్తికి వైరస్ లక్షణాలు..
- తక్షణమే గాంధీ ఆసుపత్రికి తరలింపు

**హైదరాబాద్(జనంసాక్షి):**శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చిన ఓ ప్రయాణికుడి ఎబోలా వైరస్ హిస్టరీ ఉన్నట్టు గుర్తించారు. గురువారం సూడాన్ నుంచి నుంచి శంషాబాద్ ఎయిర్

మిగతా 2లో..

## తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేస్తాం

- ఉద్యమకారుల సంఘాలను కలిసి వివరాలు సేకరిస్తాం
- అఖిలపక్ష భేటీలో కమిటీ ఛైర్మన్ కేశవరావు



**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో ప్రత్యక్షంగా.. పరోక్షంగా పాల్గొన్న ఉద్యమకారులందరికి న్యాయం చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని కె. కేశవరావు స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం కె. కేశవరావు అధ్యక్షతన ఏర్పాటైన కమిటీతో గురువారం హైదరాబాద్ సచివాలయంలో అఖిల పక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం కేకే మాట్లాడుతూ.. విద్యార్థులు, ఉద్యమకారుల సంఘాలను మళ్లీ కలుస్తామని అన్నారు. అందుకోసం ఉద్యమకారులందరినీ పిలిచి మాట్లాడతామని పేర్కొన్నారు. ఉద్యమకారులకు న్యాయం చేయాలన్నదే తమ ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. ఉద్యమకారుల సంక్షేమం కోసం కమిటీ సమావేశం ఈరోజు జరిగిందని వివరించారు. ఈ అఖిల పక్షం సమావేశంలో అన్ని పార్టీల నేతలు పాల్గొన్నారని చెప్పారు. విద్యార్థులతో, ఉద్యమకారుల సంఘాలతో అనుబంధం ఉన్న వారిని మళ్లీ కలుస్తామని కె.కేశవరావు తెలిపారు. ఉద్యమకారులందరిని పిలిచి మాట్లాడుతామన్నారు. తెలంగాణ తొలి దశతోపాటు మలి దశ ఉద్యమకారులందరికీ న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తుందని పేర్కొన్నారు.

మిగతా 2లో..

## మోదీ హయాంలో విద్యావ్యవస్థ సర్వనాశనం

- నీట్ విద్యార్థిని మరణం కేవలం బలవన్మరణం కాదు.. అవినీతి, కుప్పకూలిన విద్యావ్యవస్థ చేసిన ఘోరం
- పేపర్ లీక్ వివాదాల వల్ల విద్యార్థుల కలలు చెదిరిపోతున్నాయి
- తీవ్రంగా స్పందించిన రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**నీట్ విద్యార్థిని బలవన్మరణంపై లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. పదేపదే జరుగుతున్న పేపర్ లీక్ వివాదాల వల్ల విద్యార్థుల కలలు చెదిరిపోతున్నాయని మండిపడ్డారు. మోదీ హయాంలో నాశనమైన విద్యా వ్యవస్థకు భారతదేశ యువతరం మూల్యం చెల్లిస్తోందని పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లోని మౌగంజ్ జిల్లాకు చెందిన ఆకాంక్ష అనే నీట్ అభ్యర్థిని నీట్ అక్రమాలపై మానసికంగా ఒత్తిడికి గురై నాగపూర్‌లో బలవన్మరణానికి పాల్పడినట్లు మీడియాలో వచ్చిన కథనాలపై రాహుల్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు.ఆకాంక్ష డాక్టర్ అయ్యి సమాజానికి సేవ చేయాలని ఆశపడింది.

మిగతా 2లో..

### మళ్లీ నీట్ పరీక్ష రాసే ఓపిక లేదు


రాలిన మరో విద్యా కుసుమం

సూసైడ్ లేఖ రాసి విద్యార్థిని ఆత్మహత్య

మధ్యప్రదేశ్ మావ్‌గంజ్ జిల్లాలో ఘటన



2 లో..



## అమీర్‌పేటలో భారీ అగ్నిప్రమాదం

కేపస్సార్ ఫ్యాషన్స్ దుకాణంలో మంటలు

రంగంలోకి దిగిన ఫైర్ ఇంజన్లు, పోలీసులు

**హైదరాబాద్(జనంసాక్షి):** హైదరాబాద్ అమీర్‌పేటలో గు రువారం భారీ అగ్నిప్రమాదం జరిగింది.

మిగతా 3లో..

### ఎక్కువ విద్యార్థులున్నా వారిని అనుమతించడం వల్ల
## అర్హులైన అభ్యర్థులకు నష్టమే
### సుప్రీం కోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఉద్యోగాలకు నిర్దేశించిన విద్యార్హతల కన్నా ఎక్కువ క్వాలిఫికేషన్ ఉన్నవారిని అనుమతించడం.. అర్హులైన అభ్యర్థులకు నష్టం కలిగిస్తుందని సుప్రీం కోర్టు పేర్కొంది. ఓ బ్యాంకు అటెండెంట్‌ను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆదేశిస్తూ మద్రాస్ హైకోర్టు గతంలో జారీ చేసిన ఉత్తర్వును రద్దు చేస్తూ.. జస్టిస్ అహసానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది.ఆ ఉద్యోగి తాను గ్రాడ్యుయేట్ అనే విషయాన్ని దాచిపెట్టి.. ప్రత్యేకించి 10వ తరగతి వరకు అర్హత ఉన్న అభ్యర్థులకు కేటాయించిన ఉద్యోగంలో చేరారనే విషయాన్ని హైకోర్టు విస్మరించిందని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. ఆ ఉద్యోగిని తొలగిస్తూ బ్యాంకు తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించింది. నిర్దేశించిన విద్యార్హతలకు అనుగుణంగానే అర్హులైన అభ్యర్థులకు ప్రభుత్వ ఉద్యోగాలు దక్కాలని తెలిపింది.“ఉద్యోగ అవకాశాలకు సంబంధించి విద్యార్హతలకు నిర్దిష్ట పరిమితి పెట్టడం వెనుక సహేతుక, న్యాయమైన కారణాలు ఉన్నాయి. ఆయా పరిస్థితుల కారణంగా ఉన్నత విద్య చదవలేని వ్యక్తులకు ఉపాధి కల్పించడం కోసం ఇలా చేశారు. అటువంటి వ్యక్తుల కోసం ప్రభుత్వం కొన్ని కేటగిరీల పోస్టులను రిజర్వ్ చేయడం సమర్థనీయమే. తద్వారా వారు.. ఎక్కువ విద్యార్హత ఉన్నవారితో పోటీ పడాల్సిన అవసరం ఉండదు. ఇటువంటి విధానాన్ని న్యాయస్థానాలు గతంలోనూ సమర్థించాయి” అని పేర్కొంది.

### మానవ అక్రమ రవాణాను నిరోధించేలా చర్యలు చేపట్టాలి

సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల నియంత్రణపై దృష్టిసారించాలి : సుప్రీంకోర్టు

### కువైట్ ఎయిర్‌పోర్టుపై దాడి
## అమెరికా పనే
### ఆ దేశం ప్రయోగించిన పేట్రియాట్ క్షిపణి వల్లే పేలుడు: ఇరాన్



**టెహ్రాన్(జనంసాక్షి):**కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని తాము లక్ష్యంగా చేసుకోలేదని ఇరాన్ పేర్కొంది. ఎయిర్‌పోర్టుపై దాడికి అమెరికా తయారుచేసిన పేట్రియాట్ క్షిపణే కారణమని ఆరోపించింది. ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ ప్రతినిధి హుస్సేన్ మొహబ్బీ మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే ఈ వ్యాఖ్యలను అమెరికా ఖండించింది. కువైట్ ఎయిర్‌పోర్టులోని టెర్మినల్‌పై జరిగిన దాడితో ఇరాన్ వైమానిక దళానికి సంబంధం లేదని తమ అంతర్గత విచారణలో తేలిందని హుస్సేన్ పేర్కొన్నారు. దాని లక్ష్యంగా తమ దళాలు దాడులు చేయలేదన్నారు. ఇరాన్ డ్రోన్‌లను అడ్డుకోవడంలో అమెరికా పేట్రియాట్‌లు విఫలమయ్యాయన్నారు. వాటి వ్యవ స్థలో లోపం వల్లే ప్రయాణికుల టెర్మినల్ ధ్వంసమైందని ఆరోపించారు. అయితే, ఈ ఆరోపణలను అమెరికా సెంట్రల్ కమాండ్ తోసిపుచ్చింది. ఇది పూర్తిగా అబద్ధమని ఎక్స్‌లో పోస్టు చేసింది. కువైట్ పౌర విమానాశ్రయంపై ఇరాన్ ఉద్దేశపూర్వకంగానే డ్రోన్‌లతో దాడి చేసిందని పేర్కొంది. ఈ చర్యను అన్యాయమైనదని

మిగతా 9లో..



### అంతర్రాష్ట్ర డ్రగ్స్ తయారీ కేంద్రాలపై
## ముప్పేట దాడులు

తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్ డ్రగ్ నెట్‌వర్క్‌ల గుట్టు రట్టు

రూ. 100 కోట్ల విలువైన మత్తుపదార్థాలు, డ్రగ్స్ తయారీ సామాగ్రి స్వాధీనం

**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల్లో అక్రమంగా నడుపుతున్న డ్రగ్స్ తయారీ కేంద్రాల గుట్టును ముంబయి పోలీసులు రట్టు చేశారు. మూడు వేర్వేరు ప్రాంతాల నుంచి సుమారు రూ.100 కోట్ల విలువైన మత్తు పదార్థాలు, తయారీకి వాడే పరికరాలు, రసాయనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల ముంబయి పోలీసులు చేపట్టిన డ్రగ్స్ దందా ఆపరేషన్‌లో తీగ తాగితే తెలంగాణ, గుజరాత్ రాష్ట్రాల్లో డొంక కదిలింది. మే 21న ముంబయి శివారు ప్రాంతాల్లో క్యాబ్ డ్రైవర్‌గా

మిగతా 2లో..

# అంతర్రాష్ట్ర డ్రగ్స్ తయారీ కేంద్రాలపై ముప్పేట దాడులు

చలామనీ అవుతూ మాదకద్రవ్యాలను విక్రయిస్తున్న ముస్కాన్ సమీర్ ఖాన్ (26)ను శాకినాక పోలీసులు పక్కా సమాచారంతో పట్టేశారు. ఆమె వద్ద నుంచి 101 గ్రాముల మెఫెడ్రోన్ అనే రకం డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆమెతోపాటు డ్రగ్ సరఫరాదారు పప్పును అరెస్టు చేసి విచారించగా గుజరాత్ నర్మదా జిల్లాలోని డ్రగ్స్ అక్రమ దందా బయటపడింది. నర్మద జిల్లా నందోద్ తాలూకాలో ఉన్న వర్ఖద్ గ్రామంలో కొందరు వ్యక్తులు మెఫెడ్రోన్ అనే మాదకద్రవ్యాన్ని ఉత్పత్తి చేసే కేంద్రాన్ని నడిపిస్తున్నట్లు వెల్లడైంది. ఈ కేంద్రంపై పోలీసులు దాడులు నిర్వహించి రూ.75 కోట్ల విలువైన నిషేధిత వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. అందులో 20 గ్రాముల ఓఆ డ్రగ్స్ ఉంది. ఈ కేసుకు సంబంధించి పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. మే 29న మహారాష్ట్ర మీరా రోడ్- భయందర్, వసాయి-విరార్?కు చెందిన క్రైమ్ డిటెక్షన్ యూనిట్ పోలీసులు సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం పీచేర్యాగడి తండాలో నడుపుతున్న డ్రగ్స్ ముఠాను ఛేదించారు. ఈ కేంద్రంపై దాడిచేసి రూ.21 కోట్ల విలువైన మత్తుపదార్థాలు, రసాయనాలు, ల్యాబ్ పరికరాలను స్వాధీనం చేసుకొని వాటిని సీజ్ చేశారు. అలాగే ఇక్కడ్నుంచి రోజుకు రూ.21 కోట్ల విలువవైన ఓఆ డ్రగ్స్ ఉత్పత్తి అవుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఆపరేషన్ సుమారు రెండు నెలలుగా కొనసాగింది. దీనికి సంబంధించిన వివరాలను తాజాగా థాణేలోని ప్రధాన కార్యాలయంలో డ్రగ్స్ ముఠా వివరాలను పోలీసులు వెల్లడించారు. ఏప్రిల్ 4న మహారాష్ట్ర నయనగర్‌లో నివసించే ఫిర్దౌస్ అర్బాజ్ ఖురేషి నివాసంపై పోలీసులు దాడి చేశారు. ఈ ఆపరేషన్?లో రూ. 2.66 కోట్ల విలువైన 1.324 కిలోగ్రాముల మాదకద్రవ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకొని ఫిర్దోస్ అర్బాజ్ ఖురేషి, ఆమె భర్త అర్బాజ్ వకీల్ ఖురేషీపై కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తులో మీరా రోడ్, ఆజాద్ మైదాన్, మాల్వాని, మనోర్, ఖలాపూర్ ప్రాంతాలకు చెందిన 15 మందిని అరెస్టు చేసి వారి బ్యాంకు లావాదేవీలపై ఆరా తీస్తున్నారు. అలాగే వీరి నుంచి రూ.13.66 కోట్ల విలువైన మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. అయితే ముంబయిలో పలు ప్రాంతాల్లో అరెస్టైన వారిని విచారించగా, అంతర్రాష్ట్ర డ్రగ్స్ నెట్‌వర్క్ గుట్టు బయటపడింది. అనంతరం ఛత్తీస్‌గఢ్‌లోని ఖలాపూర్‌లో వీరస్వామి నాయుడు, హైదరాబాద్?లో నాసిర్, మొహమూద్ మెహబూబ్ ఖాన్ అదుపులోకి తీసుకున్నారు. నాసిర్‌ను పోలీసులు విచారించగా జహీరాబాద్ ప్రాంతంలోని కోహీర్ మండలం పీచేర్యాగడి తండాలో డ్రగ్స్ తయారీ కేంద్రం గురించి బయటపడింది. ఈ సమాచారం మేరకు మహారాష్ట్ర పోలీసులు గతనెల 29న తెలంగాణలో దాడులు నిర్వహించి డ్రగ్ తయారీ కేంద్రాన్ని సీజ్ చేశారు.




# ఉమ్మడి మహబూబ్‌నగర్ ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తిచేయాలి

సత్య నారాయణ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ హెచ్.టి శ్రీధర్, ఉన్నారు. కాగా పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల స్థితిగతుల పరిశీలనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. ఉమ్మడి జిల్లాలోని నారాయణపేట- కొడంగల్, పాలమూరు-రంగారెడ్డితో పాటు పెండింగ్ ప్రాజెక్టుల పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇవాళ, రేపు మొత్తం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా పర్యటిస్తూ ఎత్తిపోతల పథకాలు, రిజర్వాయర్లు, పంప్ హౌస్‌లను పరిశీలిస్తున్నారు. మధ్యాహ్నం నారాయణ పేట జిల్లా మక్తల్ కు హెలికాప్టర్ ద్వారా చేరుకున్న సీఎం కొడంగల్ - నారాయణపేట ప్రాజెక్టుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం కోయిల్ సాగర్ ప్రాజెక్టు, కృష్ణా, భీమా నదులపై ప్రతిపాదిత బ్రిడ్జి కమ్ బ్యారేజీలు ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టును ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. పాలమూరు ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా ముఖ్యమంత్రి, మంత్రులు కార్వాపుపల్లిలో ఎత్తిపోతల పథకం, ప్రతిపాదిత బ్యారేజీలపై ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీ వీక్షించారు. సీఎంతో పాటు కర్ణాటక మాజీ మంత్రి బోసురాజు కూడా మక్తల్ చేరుకున్నారు.

సాయంత్రం జోగులాంబ గద్వాల జిల్లాకు చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధరూర్ మండలం గుడ్డందొడ్డి హెలిప్యాడ్ చేరుకున్నారు. గుడ్డందొడ్డి రిజర్వాయర్, జవహర్ లాల్ నెహ్రూ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం ఫేజ్-1 ను పరిశీలించారు. గుడ్డందొడ్డి రిజర్వాయర్ ప్రస్తుత సామర్థ్యం 1.5 టీఎంసీలు కాగా 15 టీఎంసీలకు పెంచాలని ప్రతిపాదన సాధ్యాసాధ్యాలపై పరిశీలించారు. నెట్టెంపాడు ఫేజ్-1 పంప్ హౌస్ పరిశీలన, ఫొటో ఎగ్జిబిషన్ వీక్షించారు. పాలమూరు ప్రాజెక్టుల పరిస్థితి, నీటి నిల్వ సామర్థ్యంపై వీడియో ఆ తర్వాత హెలికాప్టర్ ద్వారా బయలుదేరి సాయంత్రం 6 గంటలకు నాగర్ కర్నూలు జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలోని సోమశిలకు చేరుకున్నారు. అక్కడి మృగవాణి రిసార్ట్ రివర్ ఫ్రంట్ లో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని అన్ని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. కొల్లాపూర్‌లోని సోమశిలలోనే సీఎం బస చేయనున్నారు.

**నేటి పర్యటన వివరాలు :**

రేపు కొల్లాపూర్ మండలం లోని ఎల్లూరు పంప్ హౌస్‌కు సీఎం చేరుకుంటారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని ప్యాకేజీ-3 హెడ్ రెగ్యులేటర్ ప్యాకేజీ-2 నార్లాపూర్ రిజర్వాయర్ ప్యాకేజీ-1 డెలివరీ సిస్టర్న్, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం లిఫ్ట్-1 పంప్ హౌస్?లను పరిశీలిస్తారు. నాగర్ కర్నూల్ జిల్లా వట్టెం రిజర్వాయర్ పరిశీలన అనంతరం మహబూబ్ నగర్ జిల్లా భూత్పూర్ మండలంలోని కొత్తూరు హెలిప్యాడ్ కు చేరుకుంటారు. అనంతరం పీఆర్ఎల్ఐలోని కరివెన రిజర్వాయర్ ప్యాకేజీ-14, 15 పనులను పరిశీలిస్తారు. జడ్చర్ల మండలం ఉద్దండాపూర్ హెలిప్యాడ్ కు చేరుకుంటారు. అక్కడ ప్యాకేజీ 17, 18 పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకుంటారు. అనంతరం జడ్చర్లలో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు.

# తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేస్తాం

ఉద్యమకారులకు న్యాయం చేసేందుకు రాజకీయాలకు అతీతంగా సలహాలు, సూచనలు స్వీకరిస్తామని తెలంగాణ రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అందుకోసం ఉద్యమకారులందరితోనూ మాట్లాడతామన్నారు. నష్టపోయిన అందరికీ న్యాయం చేస్తామని చెప్పారు. ఈ ప్రజా పాలన ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించడానికి ఏర్పాటు చేసిన కమిటీ.. అఖిలపక్ష పార్టీల నుంచి ఇద్దరి చొప్పున పిలిచామని పేర్కొన్నారు. పార్టీలు మాత్రమే కాకుండా ఉద్యోగ, విద్యార్థి, జర్నలిస్ట్, న్యాయవాదులు అందరినీ పిలిచి మాట్లాడతామని వివరించారు. కవులు, కళాకారులు తెలంగాణ సాధన కోసం పని చేసిన అందరిని గుర్తిస్తామన్నారు. ఈ ప్రక్రియ అమరవీరుల ద్వీపంలో ప్రారంభమవుతుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులకు గౌరవం ఇవ్వాలని, వారిని గుర్తించాలని, అలాగే అందరి నుంచి సూచనలు స్వీకరించాలని నిర్ణయించామన్నారు. రాజకీయాలకు అతీతంగా సలహాలు, సూచనలు స్వీకరిస్తామని.. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో విజ్ఞప్తులు స్వీకరిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. ఉద్యమ సమయంలో తన జీవితంలో యవ్వనం పోయిందని.. మమ్మల్ని ఆదుకోవాలని ఉద్యమకారులు కోరుతున్నారని ఎమ్మెల్సీ కోదండరాం తెలిపారు. అందుకోసం ఉద్యమకారుల జేఏసీలు ఉన్నాయని.. వారిందరినీ కలుస్తామన్నారు. అలాగే అన్ని యూనివర్సిటీల జేఏసీలు ఉన్నాయని.. వారితో కూడా సమావేశమవుతామని ఎమ్మెల్సీ కోదండరాం స్పష్టం చేశారు. ప్రజా సంఘాలు, కుల సంఘాలు, విద్యార్థి జేఏసీ, యూనివర్సిటీ జేఏసీలను సంప్రదిస్తామని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ వెల్లడించారు. అందరి సలహాలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన అని చెప్పారు. స్టేక్ హోల్డర్స్‌ను పిలిచి మాట్లాడతామన్నారు. అందరి అభిప్రాయాలు తీసుకొని ఉద్యమకారులను గుర్తిస్తామని పేర్కొన్నారు.

# మానవ అక్రమ రవాణాను నిరోధించేలా చర్యలు చేపట్టాలి

### సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల నియంత్రణపై దృష్టి సారించాలి

### సుప్రీంకోర్టు పలు కీలక ఆదేశాలు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**పిల్లల అక్రమ రవాణా నిరోధానికి సంబంధించిన కేసులో విచారణ చేపడుతున్న సుప్రీంకోర్టు.. సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల నియంత్రణపై దృష్టి సారించింది. ఈ కేసులో అమికస్ క్యూరీగా వ్యవహరిస్తున్న సీనియర్ అడ్వకేట్ అపర్ణా భట్ చేసిన సూచనలను పరిశీలించింది. మానవ అక్రమ రవాణాను నిరోధించేలా సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల కోసం ప్రత్యేక మార్గదర్శకాలు (ఎస్ఓపీ) లేవని ఆమె ఈ సందర్భంగా కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. సరోగసీ, ఐవీఎఫ్ క్లినిక్స్ నియంత్రణ కోసం తీసుకొచ్చిన ఏఆర్టీ చట్టంలో అనేక నిబంధనలు ఉన్నప్పటికీ, చిన్నారుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక ప్రోటోకాల్ లేదని అపర్ణా భట్ పేర్కొన్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనలు ప్రధానంగా వైద్య ప్రమాణాలు, మౌలిక వసతులకే పరిమితమయ్యాయని వివరించారు. ఈ నేపథ్యంలో నిబంధనలను మరింత కట్టుదిట్టం చేసేందుకు రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. కమిటీ సూచనలతో సమగ్ర విధానాన్ని రూపొందించాలని ప్రతిపాదించారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం తన అభిప్రాయాన్ని తెలియజేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఆగస్టు 19కి వాయిదా వేసింది.

# ఒంగోలులో విషాదం..

### నీటికుంటలో ఈతకు దిగి నలుగురు చిన్నారుల మృతి

ఒంగోలు(జనంసాక్షి):ఒంగోలు నగర పరిధిలోని చెరువుకొమ్ముపాలెం వద్ద విషాదం చోటుచేసుకుంది. నీటికుంటలో మునిగి నలుగురు చిన్నారులు మృతిచెందారు. చెరువుకొమ్ముపాలెం వద్ద నీటి కుంటలో ఈతకు దిగి చిన్నారులు కరేటి అభిరామ్ (14), కరేటి సుశాంత్ (12), పొదిలి చిన్ను (11), ఇల్లా దినేష్ (10) గల్లంతయ్యారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని స్థానికుల సాయంతో గాలింపు చేపట్టారు. అనంతరం అన్నదమ్ములు అభిరామ్, సుశాంత్‌తో పాటు దినేష్, చిన్ను మృతదేహాలు లభ్యమయ్యాయి. చిన్నారుల మృతితో వారి తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

# సబ్ రిజిస్ట్రార్ల అధికారాలకు కత్తెర

రూ.1200 నుంచి రూ.1400 కోట్ల మేర ఆదాయం వస్తుందని చెప్పారు. హయ్యర్ సైడ్ ఏరియాలు శేరిలింగంపల్లి, రాజేందర్ నగర్, ఖాజాగూడ తదితర ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరగవన్నారు. ఆయా ప్రాంతాల్లో ఛార్జీలు పెంచే ఆలోచన ప్రభుత్వానికి లేదని తెలిపారు. ఇక నుంచి సబ్ రిజిస్ట్రార్లకు ఫుల్ పవర్స్ కట్ చేశామని.. వారికి మినిమమ్ పవర్స్ మాత్రమే ఉంటాయని మంత్రి పొంగులేటి వివరించారు. భూ సేకరణ సమయంలో ప్రభుత్వానికి కొంత నష్టం జరిగిందన్నారు. కానీ రైతులకు మాత్రం లాభం జరుగుతుందన్నారు. ఇన్నర్ సైడ్ ఎకరం కనీసం రూ.15 లక్షలు ఉందని చెప్పారు. లోయర్ సైడ్ ఏమైనా పొరపాటు జరిగితే మార్పులు చేర్పులు ఉంటాయని చెప్పారు. హయ్యర్ సైడ్ మాత్రం మార్పులు ఉండవన్నారు. సమస్యలు ఉంటే.. హెల్ప్ డెస్క్ ఫోన్ నెంబర్ ఏర్పాటు చేస్తామని పబ్లిక్‌కు ఆయన సూచించారు. త్వరలో తహసీల్దార్ల బదిలీలు ఉంటాయని చెప్పారు. ఫ్యూచర్ సిటీని రద్దు చేసి అవకాశమే లేదని స్పష్టం చేశారు. రెవెన్యూ విషయంలో.. తెలంగాణను మిగతా రాష్ట్రాలు మోడల్‌గా తీసుకుంటున్నాయని గుర్తు చేశారు. ఏడాదిన్నరలో 90 శాతం గ్రామాల సర్వే పూర్తవుతుందని ధీమా వ్యక్తం చేశారు. రెవెన్యూలో అవినీతి లేకుండా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఆ క్రమంలోనే అవినీతి నిరోధక శాఖ ట్రాప్‌లు అధికంగా జరుగుతున్నాయని స్పష్టం చేశారు. తాను వచ్చాక ఏసీబీ ట్రాప్ ఆయిన ఫైల్స్ అన్ని క్లియర్ చేశానని తెలిపారు. గత ప్రభుత్వంలో మూడేళ్లు రెవెన్యూ ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. కానీ తాను వచ్చిన మూడు నెలల్లోనే 3,500 రెవెన్యూ ఫైల్స్ క్లియర్ చేశానని వివరించారు. అసెంబ్లీలో పెండింగ్‌లో ఉన్న 10 ఏళ్ల ఫైల్స్ ఆరు నెలల్లోనే క్లియర్ చేసినట్లు చెప్పారు. తనకు ఏ శాఖ కేటాయించినా.. కళ్లు మూసుకొని పని చేస్తానని పేర్కొన్నారు. రజకులకు ప్రభుత్వానికి మంచి జరిగే ఏ పని చేయడానికైనా తాను భయపడనని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుండబద్దలు కొట్టారు. ఇప్పటి వరకు ఇందిరమ్మ ఇండ్లకు రూ. 7 వేల కోట్లు చెల్లించామని చెప్పారు. రాష్ట్రంలో పాడి ప్రొక్యూర్‌మెంట్ 90 శాతం పూర్తయిందన్నారు. అసైన్డ్ భూములకు పాలసీ తీసుక వస్తామని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అసైన్డ్ భూములకు రిజిస్ట్రేషన్లు జరిగినవని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం వాటిని నిషేధిత జాబితా లో చేర్చిందని మంత్రి పొంగులేటి వివరించారు.

# మళ్లీ నీట్ పరీక్ష రాసే ఓపిక లేదు..

బోపాల్(జనంసాక్షి):నీట్ పేపర్ లీక్ ఎందరో విద్యార్థుల జీవితాల్ని చిదిమేస్తోంది. పేపర్ లీకేజీతో లక్షలాది మంది విద్యార్థులు ఆవేదనకు, ఒత్తిడికి లోనవుతున్నారు. మళ్లీ పరీక్ష రాయాలనే విషయం వారిపై ఒత్తిడి పెంచుతోంది. మధ్యప్రదేశ్‌కు చెందిన ఒక యువతి మళ్లీ నీట్ పరీక్ష రాసే ఓపిక లేక ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన గత నెల 20న జరిగింది. తాజాగా ఈ విషయం మధ్యప్రదేశ్‌లో రాజకీయ దుమారం రేపుతోంది. మధ్యప్రదేశ్, మావ్‌గంజ్ జిల్లాలోని, మగానియా గ్రామానికి చెందిన ఆకాంక్ష చతుర్వేది (18) అనే యువతి కొంతకాలంగా నీట్ కోసం ప్రిపేరైంది. ఆమెకు అండగా ఉండటం కోసం తను కోచింగ్ తీసుకుంటున్న నాగ్‌పూర్‌లోనే ఆమె తల్లిదండ్రులు కూడా ఉంటున్నారు. తండ్రి వ్యవసాయం చేస్తూ, వంటలు కూడా చేసేవాడు. ఆ సంపాదనతోనే కూతుల్ని డాక్టర్ చేయాలని కలగన్నారు. ఆమె చదువు కోసం రూ.3 లక్షల అప్పు చేశారు. తండ్రి రైతు కాబట్టి కిసాన్ క్రెడిట్ కార్డ్ ఉపయోగించి ఈ డబ్బు తీసుకున్నారు. అలాగే, బంధువుల నుంచి కూడా కొంత అప్పు చేశారు. ఈ క్రమంలో బాగా చదువుకున్న ఆకాంక్ష తాను నీట్ పరీక్ష బాగా రాసినట్లు అందరికీ చెప్పింది. నీట్ పరీక్ష గత నెల 3న జరిగిన సంగతి తెలిసిందే. ఈ పరీక్ష బాగా రాశానని, తనకు మంచి ఫలితం వస్తుందని పరీక్ష అనంతరం తన బంధువులు, సన్నిహితులకు చెప్పింది. అయితే, వారం రోజులకే నీట్ పేపర్ లీకైన విషయం బయటపడింది. దీంతో పరీక్షను ఎన్‌టీయే రద్దు చేసింది. ఈ నేపథ్యంలో ఆమె మళ్లీ పరీక్ష రాయాలా అనే ఒత్తిడికి గురైంది. దీంతో మే 20న తన గదిలో ఆత్మహత్య చేసుకుంది. ఈ సందర్భంగా ఒక సూసైడ్ నోట్ కూడా రాసింది. తనకు మళ్లీ నీట్ పరీక్ష రాసేంత శక్తి లేదని ఆ లేఖలో పేర్కొంది. తన తల్లిదండ్రుల ఆకాంక్షలకు నెరవేర్చలేకపోతున్నానని, వారికి క్షమాపణలు అంటూ లేఖలో పేర్కొంది. అయితే, ఇప్పుడీ అంశం మధ్యప్రదేశ్‌లో రాజకీయాలకు వేదికగా మారింది. అక్కడ ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై మండిపడుతోంది. మరోవైపు కాంగ్రెస్ విద్యార్థి విభాగం ఎన్ఎస్‌యూఐ నేతలు ఆ కుటుంబానికి రూ.2.5 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు.

# మోదీ హయాంలో విద్యావ్యవస్థ సర్వనాశనం

ఓ సాధారణ రైతు అయిన ఆమె తండ్రి, కుమార్తె కలను నిజం చేయడానికి కిసాన్ క్రెడిట్ కార్డ్ ద్వారా 3లక్షల అప్పు తీసుకున్నారు. నాగపూర్‌లో ఆమె శిక్షణ తరగతులకు వెళ్లేందుకు వీలుగా తండ్రి వంటవాడిగా ఉద్యోగం చేశారు. ఓ తండ్రిగా ఆయన చేయగలిగినదంతా చేశారు, కానీ నీట్ పేపర్ లీక్ కారణంగా పరీక్ష రద్దయింది. పరీక్ష రద్దు కావటాన్ని తట్టుకోలేక ఆకాంక్ష బలవన్మరణానికి పాల్పడింది. ఆకాంక్ష మరణం కేవలం బలవన్మరణం కాదు, అది ప్రధాని మోదీ హయాంలో అవినీతి, కుప్పకూలిన విద్యావ్యవస్థ చేసిన ఘోర పాపం. ఇక ధర్మేంద్ర ప్రధాన్ విషయానికొస్తే? ఆయన ఈనాటికీ తన పదవిలో గట్టిగా పాతుకుపోయి ఉన్నారు. అవే పాత కమిటీలు, బదిలీలు, విచారణలు. సంస్కరణలు లేవు న్యాయం లేదని అన్నారు. ఇదిలా ఉండగా, పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో మే 3న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించాల్సిన నీట్ (యూజీ) 2026 పరీక్షను మే 12న రద్దు చేశారు. దీంతో దేశంలోని పలు ప్రాంతాల్లో విద్యార్థి సంఘాల తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. ఈ ఆరోపణలపై స్పందించిన ప్రతిపక్షాలు కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశాయి. అయితే, నీట్? పరీక్షను తిరిగి జూన్ 21న మరోసారి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. మరోవైపు, ఈ వ్యవహారంలో సీబీఐ అధికారులు ఇప్పటివరకు 13 మందిని అరెస్టు చేశారు. తాజాగా ఈ కేసుకు సంబంధించి ఐదుగురి నిందితులకు జూన్ 2 వరకు ఉన్న కస్టడీని 15 వరకు పొడిగిస్తూ మంగళవారం దిల్లీ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న మంగీలాల్ ఖటిక్, వికాస్ బివాల్, దినేశ్ బివాల్, యశ్ యాదవ్, ధనుంజయ్ లోఖండేల జ్యుడిషియల్ కస్టడీని పొడిగించాలని కోరుతూ సీబీఐ అభ్యర్థనను ప్రత్యేక న్యాయమూర్తి జస్టిస్ అజయ్ గుప్తా అంగీకరిస్తూ తీర్పును వెలువరించారు. మరోవైపు, నీట్ యూజీ పునఃపరీక్షకు చదువుకోవడానికి పుస్తకాలు కావాలని కోరుతూ, పేపర్ లీక్ నిందితుడు యశ్ యాదవ్ దాఖలు చేసిన దరఖాస్తును మంగళవారం రౌస్ అవెన్యూ కోర్టు అనుమతించింది. ఈ మేరకు నిందితుడి తరపు న్యాయవాది పేర్కొన్నారు.

# కేరళం తీరాన్ని తాకిన నైరుతి

గతఏడాది వర్షాకాలం ప్రారంభమైనట్లు ఐఎండీ ప్రకటించింది. కేరళలోకి రుతుపవనాలు ప్రవేశించడంతో అక్కడ విస్తృతంగా వర్షాలు కురుస్తుండగా, రానున్న రోజుల్లో ఇవి దేశంలోని ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించనున్నాయి. సాధారణంగా ప్రతి ఏడాది జూన్ 1న నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకుతాయి. అయితే ఈసారి అవి నాలుగు రోజుల ఆలస్యంగా జూన్ 4న రాష్ట్రంలోకి ప్రవేశించాయి. అంతకుముందు మే 26నే కేరళలోకి రుతుపవనాలు వస్తాయని ఐఎండీ అంచనా వేసింది. కానీ సముద్ర, వాతావరణ పరిస్థితుల్లో వచ్చిన మార్పుల కారణంగా వాటి పురోగతి మందగించింది. అనంతరం జూన్ 4 ప్రాంతంలో కేరళకు చేరుకునే అవకాశముందని సవరించిన అంచనాను వెల్లడించగా, అదే నిజమైంది. రుతుపవనాల రాకకు ముందు నుంచే కేరళలో అనేక ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. గత కొన్ని రోజులుగా వర్షపాతం, గాలుల వేగం, మేఘావరణ పరిస్థితులను ఐఎండీ నిశితంగా పరిశీలించింది. రుతుపవనాల అధికారిక ప్రకటనకు అవసరమైన అన్ని ప్రమాణాలు నెరవేరడంతో గురువారం వాటి ప్రవేశాన్ని ప్రకటించింది. కేరళలో ప్రస్తుతం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. పరిస్థితుల దృష్ట్యా అలప్పుళ, కొట్టాయం, ఎర్నాకుళం జిల్లాలకు ఐఎండీ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. పిడుగులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశముందని హెచ్చరించింది. కొన్ని ప్రాంతాల్లో గంటకు 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది.

**వారం రోజుల్లో తెలంగాణకు..**

అటు తమిళనాడుపై కూడా రుతుపవనాల ప్రభావం కనిపిస్తోంది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఇప్పటికే వర్షాలు ప్రారంభమయ్యాయి. రానున్న గంటల్లో 15 జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. కేరళలోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు ఇప్పుడు క్రమంగా దేశంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించనున్నాయి. సాధారణ పరిస్థితులు కొనసాగితే వచ్చే వారం రోజుల్లో తెలుగు రాష్ట్రాల్లోకి రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. దీంతో ప్రస్తుతం తీవ్ర ఎండలతో ఇబ్బందులు పడుతున్న తెలుగు రాష్ట్రాలకు ఉపశమనం లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. రుతుపవనాల సాధారణ ప్రయాణాన్ని పరిశీలిస్తే, జూన్ నెలలో ఇవి వేగంగా పశ్చిమ తీర ప్రాంతాలతో పాటు ఈశాన్య రాష్ట్రాలకు విస్తరిస్తాయి. అనంతరం మధ్య భారతదేశంలోని మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాలకు జూన్ మధ్య నాటికి చేరుకుంటాయి. అక్కడి నుంచి తూర్పు, ఉత్తర భారత రాష్ట్రాల వైపు కదులుతాయి. దేశ రాజధాని దిల్లీలో సాధారణంగా జూన్ 27 ప్రాంతంలో నైరుతి రుతుపవనాలు ప్రవేశిస్తాయి. అలాగే పంజాబ్, హరియానా, రాజస్థాన్, పశ్చిమ ఉత్తరప్రదేశ్ వంటి వాయవ్య భారత రాష్ట్రాలకు జూన్ చివరి నాటికి లేదా జూలై మొదటి వారంలో విస్తరించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనుకూలంగా కొనసాగితే ఉత్తర భారతదేశంలోని చాలా ప్రాంతాలు జూలై ఆరంభంలోనే వర్షాల ప్రభావంలోకి వచ్చే అవకాశముందని ఐఎండీ పేర్కొంది. అయితే ఈ ఏడాది వర్షాకాలంపై ఎల్‌నినో ప్రభావం ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. పసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలో ఎల్‌నినో పరిస్థితులు అభివృద్ధి చెందుతున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. జూన్ నెలలో ఈ ప్రభావం బలహీనంగా ఉన్నప్పటికీ, సెప్టెంబరు నాటికి మరింత బలపడే అవకాశం ఉందని వివరించింది. దీంతో జూన్ నుంచి సెప్టెంబరు వరకు కొనసాగే నైరుతి రుతుపవనాల సీజన్‌లో దేశవ్యాప్తంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశముందని ఐఎండీ అంచనా వేస్తోంది. దీర్ఘకాల సగటు వర్షపాతంతో పోలిస్తే ఈసారి సుమారు 90 శాతం మేర మాత్రమే వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని పేర్కొంది. వ్యవసాయం, జలాశయాల నీటి నిల్వలు, తాగునీటి అవసరాలపై ఈ పరిస్థితుల ప్రభావం ఉండొచ్చని నిపుణులు భావిస్తున్నారు. అయినప్పటికీ, కేరళలోకి నైరుతి రుతుపవనాల ప్రవేశంతో దేశవ్యాప్తంగా రైతుల్లో ఆశలు చిగురించాయి. ఎండల తీవ్రత తగ్గి వాతావరణం చల్లగా మారడంతో సాగు పనులు ప్రారంభమయ్యే అవకాశాలు ఏర్పడ్డాయి.

# భారత్‌లో ఎబోలా కలవరం



పౌరులకు కీలక అడ్వైజరీ జారీ చేసింది. ఎబోలా ప్రభావిత దేశాల్లో ప్రయాణించినా లేదా ఆ దేశాల మీదుగా వచ్చిన ప్రయాణికులు స్వీయ నిర్బంధంలోకి వెళ్లాలని సూచించింది. ఈ మేరకు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ మంగళవారం ఓ ప్రకటన చేసింది. భారత్‌లో ఇప్పటివరకు ఎబోలా కేసులు ఏవీ నిర్ధరణ కాలేదని క్లారిటీ ఇచ్చింది. ఎవరైనా గత 21 రోజుల్లో ఎబోలా ప్రభావిత దేశం నుంచి వచ్చినా, లేదా ఆ దేశం మీదుగా ప్రయాణించినా జ్వరం, కండరాల నొప్పి, తలనొప్పి, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తే స్వీయ నిర్బంధంలోకి వెళ్లాలని చెప్పింది. వెంటనే ఆరోగ్య అధికారులకు సమాచారం అందించాలని పేర్కొంది. ముందస్తు సమాచారంతో మీ ప్రాణాలను కాపాడటంతో పాటు వ్యాధి వ్యాప్తిని కూడా నిరోధించవచ్చని వివరించింది. ఈ సందర్భంగా అధికారుల సాయం కోసం 1075 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలని వివరించింది. అంతేకాకుండా, భద్రత, ముందు జాగ్రత్త చర్యగా ఎబోలా ప్రభావిత ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికుల కోసం అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాల్లో కఠినమైన తనిఖీలు చేస్తున్నారు. ముఖ్యంగా దిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో కఠిన తనిఖీలు చేపట్టారు. అలాగే సముద్ర ఓడరేవుల వద్ద కఠినమైన నిఘాను కొనసాగిస్తున్నారు. కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ దేశాలను అధిక ప్రమాదం ఉన్న దేశాలుగా గుర్తించారు. ఈ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులకు థర్మల్ స్క్రీనింగ్, వైద్య పరీక్షలను తప్పనిసరి చేశారు. అంతేకాకుండా, ఎబోలా అనుమానిత కేసులను ఎదుర్కోవడానికి ప్రత్యేక ఐసోలేషన్ వార్డులు, ఆసుపత్రులను సిద్ధం చేశాయి. మరోవైపు కాంగో జాతీయ ప్రజారోగ్య సంస్థ నివేదిక ప్రకారం దేశంలో ఇప్పటివరకు 363 ఎబోలా కేసులు నమోదయ్యాయి. బుండిబుగ్యో వైరస్ కారణంగా 62 మంది మరణించినట్లు వెల్లడించింది. వ్యాధి సోకిన వారిని కనుగొనడంలో కొంత మెరుగుదల కన్పించినట్లు అధికారులు చెప్పారు. ఉగాండాలో కూడా 15 కేసులు నిర్ధరణ కాగా, ఒకరు మరణించారు. ఆఫ్రికా దేశాల్లో ఎబోలా కేసులు పెరుగుతుండటంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలు అప్రమత్తమయ్యాయి. అటు ప్రపంచ ఆరోగ్య సంస్థ దీనిని 'అంతర్జాతీయ ప్రజారోగ్య అత్యవసర పరిస్థితి'గా ప్రకటించింది. ఇదిలా ఉండగా, హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చిన ఓ ప్రయాణికుడికి ఎబోలా వైరస్ హిస్టరీ ఉన్నట్టు గుర్తించారు. సూడాన్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న మహ్మద్ అనే ప్రయాణికుడికి స్క్రీనింగ్ కేంద్రంలో పరీక్షలు నిర్వహించగా అతడికి ఎబోలో వైరస్ హిస్టరీ ఉన్నట్టు గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన వైద్యసిబ్బంది, అతన్ని గాంధీ ఆసుపత్రిలోని ఐసోలేషన్ సెంటర్‌కు తరలించారు. శాంపిల్స్ సేకరించి సీసీఎంబీకి పంపించినట్టు గాంధీ ఆసుపత్రి వైద్యులు తెలిపారు.

# శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఎబోలా కలకలం

పోర్టుకు చేరుకున్న మహ్మద్ అనే ప్రయాణికుడికి.. ఎయిర్‌పోర్టులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్క్రీనింగ్ కేంద్రంలో పరీక్షలు నిర్వహించారు. ఎబోలో వైరస్ హిస్టరీ ఉన్నట్టు గుర్తించిన వైద్య సిబ్బంది వెంటనే అప్రమత్తయ్యారు. వెంటనే అతన్ని గాంధీ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఐసోలేషన్ సెంటర్‌కు తరలించారు. శాంపిల్స్ సేకరించి సీసీఎంబీకి పంపించినట్టు గాంధీ ఆసుపత్రి వైద్యులు తెలిపారు.

# ఇండియా కూటమికి సమావేశానికి హాజరుకాబోం

### 8వ తేదీన సమావేశాన్ని బహిష్కరించిన డిఎంకె

న్యూఢిల్లీ(జనంసాక్షి):అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం తమిళనాడులో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఇండియా కూటమికి బీటలు వారాయి. ఇందులో భాగస్వామి అయిన డీఎంకే కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ 8వ తేదీన దేశ రాజధాని న్యూఢిల్లీలో జరిగే ఇండియా కూటమి సమావేశాన్ని బహిష్కరించాలని డీఎంకే నిర్ణయించింది. కాంగ్రెస్ పార్టీ పాల్గొనే ఈ భేటీకి వెళ్లే ప్రసక్తే లేదంటూ చెన్నైలోని డీఎంకే ప్రధాన కార్యాలయం గురువారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ తమకు తీవ్ర ద్రోహం చేసిందంటూ డీఎంకే సంచలన ఆరోపణలు చేసింది. కాంగ్రెస్ పార్టీ వైఖరితో డీఎంకే శ్రేణులు తీవ్ర మనస్తాపం చెందాయని వివరించింది. అందులో భాగంగా కేడర్ భావాలను గౌరవిస్తూనే ఇండియా కూటమి భేటీకి దూరంగా ఉండాలని ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం ఎం.కె. స్టాలిన్ నిర్ణయం తీసుకున్నట్లు ఆ ప్రకటనలో వివరించింది. జూన్ 8వ తేదీన ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్ వేదికగా ఇండియా కూటమి అత్యవసర సమావేశం జరగనుంది. ఈ కూటమి సమావేశానికి హాజరు కావాలని ఆ పార్టీ భాగస్వామ్య కూటమిల నుంచి డీఎంకేకు ఆహ్వానం అందింది. అయినప్పటికీ.. హాజరు కాకూడదని డీఎంకే అధిష్ఠానం నిర్ణయించింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీ ప్రవర్తించిన తీరుపై డీఎంకే శ్రేణుల్లో తీవ్ర ఆగ్రహం వచ్చింది. తమ పార్టీ కార్యకర్తలను కాంగ్రెస్ పార్టీ చేసిన ద్రోహాన్ని క్షమించేది లేదంటూ డీఎంకే ఒక ప్రకటన విడుదల చేసిన విషయం విదితమే. ఇండియా కూటమి ఏర్పడినప్పటి నుంచి డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్ కీలక పాత్ర పోషించారని ఈ సందర్భంగా డీఎంకే గుర్తు చేసింది. నీట్, ఒకే దేశం-ఒకే సారి ఎన్నికలు, వక్ఫ్ చట్టాలకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో తమ పోరాటం కొనసాగుతుందని డీఎంకే వెల్లడించింది. కూటమితో భేటీకి దూరంగా ఉన్నప్పటికీ, ప్రజా వ్యతిరేక విధానాలపై ఇతర పార్టీల పోరాటాలకు మద్దతు ఇస్తామని డీఎంకే ప్రకటించింది. దీంతో డీఎంకే - కాంగ్రెస్ బంధంలో వివాదం ముదిరినట్లు అయింది. అంతేకాకుండా జాతీయ స్థాయిలో ప్రతిపక్ష కూటమికి డీఎంకే భారీ షాక్ ఇచ్చినట్లు అయింది.

# షాపింగ్ కాంప్లెక్స్‌లో భారీ అగ్నిప్రమాదం




అమీర్‌పేట (జనంసాక్షి) : అమీర్‌పేట్‌లోని ఓ షాపింగ్ కాంప్లెక్స్‌లో గురువారం మధ్యాహ్నం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. మెట్రో పిల్లర్ నంబరు 1043 సమీపంలోని షాపింగ్ కాంప్లెక్స్ రెండో అంతస్తులో ఉన్న క్రెసెంట్ ఫ్యాషన్స్ దుకాణంలో మంటలు చెలరేగాయి. క్రమంగా ఇతర దుకాణాలకు వ్యాపించాయి. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది 3 ఫైరింజన్లు, 8 వాటర్ ట్యాంకర్లతో మంటలు అదుపు చేశారు. ఇతర దుకాణాల్లోని వారిని ఖాళీ చేయించారు. అమీర్‌పేట్‌లోని భవన రహదారికి సమీపంలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో ప్రమాదం జరగడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. దట్టమైన పొగ అలుముకోవడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో దుకాణాల్లో సిబ్బంది ఉండటంతో పరుగు తీశారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. భారీ అగ్ని ప్రమాదం జరిగిందని అధికారులు అంచనా వేస్తున్నారు. షాపింగ్ కాంప్లెక్స్‌లో వైరింగ్ షాపు ఉండటంతో ప్లాస్టిక్ సామగ్రి, ఇతర మంటలు తీవ్రత ఎక్కువగా ఉందని అగ్నిమాపకశాఖ అధికారులు చెబుతున్నారు.

# మొహర్రం ఏర్పాట్ల విషయంలో నిర్లక్ష్యమా?

- పండుగకు 12 రోజులే ఉన్న కనీసం సమీక్ష సమావేశం నిర్వహించరా?
- వెంటనే ఏర్పాట్ల పనులు వేగవంతం చేయాలి
- టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత



హైదరాబాద్ (జనంసాక్షి) : మొహర్రం పండుగ ఏర్పాట్ల విషయంలో ప్రభుత్వం అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. మొహర్రం మాసానికి ఇంకా 12 రోజులు మాత్రమే ఉన్నప్పటికీ ఇప్పటికీ కూడా ఏర్పాట్ల ప్రక్రియ ప్రారంభించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పండుగ నిర్వహణ ఏర్పాట్ల కోసం సమీక్షా సమావేశం కూడా నిర్వహించకపోవటం శోచనీయన్నారు. ప్రతిష్టాత్మకమైన 'బీబీ కా ఆలమ్' ఊరేగింపులో పాల్గొనే ఏనుగును తెప్పించే ప్రక్రియ కూడా ప్రారంభించలేదన్నారు. అటు తెలంగాణవ్యాప్తంగా ఉన్న 11,836 ఆషూర్ ఖానాలకు ఇవ్వాల్సిన నిధులకు సంబంధించి ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని గుర్తు చేశారు. ముహర్రమ్ పర్వదినాన్ని ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు. యుద్ధప్రాతిపదికన సమీక్షా సమావేశాలు నిర్వహించి, ఏర్పాట్లు వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

# ఖరీఫ్ పంటకైనా రైతు భరోసా కల్పించాలి

**బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి డిమాండ్**



జగిత్యాల, జూన్4 (జనంసాక్షి) : రాష్ట్ర ప్రజానికంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందుచూపు లేదని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి ఆరోపించారు. వానకాలం పంట సీజన్ మరికొద్ది రోజుల్లో ప్రారంభమవుతున్నా గాని ప్రభుత్వానికి ముందస్తు కార్యచరణ ప్రణాళికను ఇంకా తయారు చేసుకోలేదని వెల్లడించారు. జగిత్యాల జిల్లా రాయికల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పంట రుణాలకు సంబంధించి కార్యచరణను ఇంకా రూపొందించ లేదని ఆరోపించారు. కనీసం ఖరీఫ్ పంటకైనా రైతు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా మూడు సంవత్సరాల కాలంలో ఆరు పంటలు పండాయని, ఇందులో ఎన్ని పంటలకు రైతు భరోసా కల్పించారో ఆయన ఆత్మకే తెలుసని విమర్శించారు. ధాన్యం సేకరణపై కాంగ్రెస్ , బీజేపీలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ రైతు గురించి ఆలోచించడం లేదని విమర్శించారు. పప్పు దినుసులు, నూనె గింజలు పండించాలని సలహా ఇస్తున్న ప్రభుత్వం వాటికి ఏ విధమైన ప్రోత్సాహం కల్పిస్తుందో చెప్పడం లేదని పేర్కొన్నారు. కోతుల బెడద నుంచి పంటలను కాపాడేందుకు కోతుల పునరుత్పత్తి నిలుపుదల కేంద్రాన్ని జిల్లాకు ఒకటి ఏర్పాటు చేయాలని, తక్షణమే రైతుకు సోలార్ ఫెన్సింగ్ 50 శాతం రాయితీతో ఇవ్వాలని డిమాండ్ చేశారు. మార్కెట్లో యూరియా అందుబాటులో లేదని, యూరియా యాప్‌ను తొలగించి నేరుగా రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# రైతులు ఇబ్బందులను పట్టించుకోని సీఎం

- పర్యటనలతో ఒరిగేదేమీ లేదు: నిరంజన్ రెడ్డి



వనపర్తి, జూన్4 (జనంసాక్షి) : రాష్ట్ర రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడ్డ సమయంలో కాకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాజెక్టుల సందర్శన పేరుతో హడావుడి చేస్తున్నారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆరోపించారు. సీఎం గురువారం పాలమూరు పర్యటన సందర్భంగా పలు ప్రశ్నలు సంధించారు. విపత్తుల సమయంలో రాకుండా , రైతుల సమస్యలను పరిగణనలోకి తీసుకోకుండా చేస్తున్న ఈ పర్యటనలు ఎవరికి ఉపయోగమని నిలదీశారు. సీఎం పర్యటనే వేళ తెలంగాణ వాదులు, బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులను ముందస్తు అరెస్టులు చేయడం సబబు కాదని, వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ వడ్లు కల్లాల్లోనే ఉన్నాయని,రైతు భరోసా అడుగుతారనే హెలికాప్టర్‌లో పర్యటిస్తున్నారని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం మీద ప్రజలు ఆశలు కోల్పోయారని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని, భవిష్యత్తులో వారికి పరాభవం తప్పదని హెచ్చరించారు.

# ట్రెక్కింగ్‌కు వెళ్లిన యువతి అదృశ్యం


- స్నేహితులను అరెస్ట్ చేసి విచారణ



డెహ్రాడూన్, జూన్ 4 (జనంసాక్షి) : స్నేహితులతో కలిసి ట్రెక్కింగ్‌కు వెళ్లిన ఓ యువతి కనిపించకుండా పోయింది. 6 రోజులు గడుస్తున్నా ఆమె ఆచూకీ దొరకలేదు. పోలీసులు ఆమె స్నేహితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఉత్తరాఖండ్‌లోని నైనితాల్‌కు చెందిన బబితా పాండే అనే యువతి ఎంబీఏ చేస్తోంది. వారం రోజుల క్రితం ఆమె తన స్నేహితులు హర్మన్‌పాల్ సింగ్, హర్మన్ ప్రీత్ సింగ్‌లతో కలిసి టూర్‌కు వెళ్లింది. మే 25వ తేదీన వారు హర్సిల్, గంగోత్రితో పాటు చుట్టుపక్కల ఉన్న పర్యాటక ప్రదేశాల్లో తిరిగారు. ముగ్గురూ మే 28వ తేదీన రైతాల్ గ్రామానికి వెళ్లారు. ఆ రోజు అక్కడే ఉన్నారు. మరుసటి రోజు రైతాల్ నుంచి దయారా బుగ్యాల్‌కు ట్రెక్కింగ్ మొదలెట్టారు. ఆ రాత్రి గోయ్ బేస్ క్యాంప్‌లో బస చేశారు. అర్ధరాత్రి నుంచి బబిత కనిపించకుండా పోయింది. బబిత స్నేహితులు ఆమె కోసం వెతికారు. ఆమె ఎక్కడా కనిపించకపోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆర్మీ, ఇండో - టిబెటన్ బోర్డర్ పోలీస్, స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, పోలీస్, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌కు చెందిన 150 మంది ఆమె కోసం వెతుకుతున్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాలకు 14 వరకు సెలవులు

- 15న తిరిగి ప్రారంభించాలని ఆదేశాలు




హైదరాబాద్, జూన్4 (జనంసాక్షి) : రాష్ట్రంలో భానుడి భగభగలకు జనం అల్లాడిపోతున్నారు. మునుపెన్నడూ లేని విధంగా మే నెల ముగిసినా ఎండల తీవ్రత, వడగాల్పుల ప్రభావం ఏమాత్రం తగ్గడం లేదు. ఈ నేపథ్యంలో చిన్న పిల్లలు, విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులను పొడిగించింది. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ శృతి ఓఝ వేసవి సెలవులను జూన్ 13 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జూన్ 14వ తేదీన ఆదివారం కావునా.. జూన్ 15 నుండి ఈ కేంద్రాలు యథావిధిగా తిరిగి పనిచేయడం ప్రారంభిస్తాయి. నిజానికి ముందస్తు ప్రణాళిక ప్రకారం జూన్ 2వ తేదీ నుంచే అంగన్‌వాడీ కేంద్రాలను, పాఠశాలలను పునఃప్రారంభించాలని ప్రభుత్వం భావించింది. అయితే, జూన్ మొదటి వారంలో కూడా ఉష్ణోగ్రతలు 40 నుండి 45 డిగ్రీల సెల్సియస్ దాటుతుండటం, మధ్యాహ్నం వేళల్లో తీవ్రమైన ఉష్ణగాలులు వీస్తుండటంతో తల్లిదండ్రుల నుంచి ఆందోళన వ్యక్తమైంది. చిన్న పిల్లలు ఎండ దెబ్బకు గురయ్యే ప్రమాదం ఉండటంతో ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుంది. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు సైతం ఎండల తీవ్రత కారణంగా వేసవి సెలవులను పొడిగించిన సంగతి తెలిసిందే. పాఠశాలల మాదిరిగానే అంగన్‌వాడీ కేంద్రాలను కూడా జూన్ 14 వరకు మూసి ఉంచాలని, విద్యాసంస్థలతో పాటే జూన్ 15న ఒకేసారి తెరవాలని ప్రభుత్వం భావిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే వారు 3 నుండి 6 సంవత్సరాల లోపు పిల్లలు కావడంతో వారికి రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. ఇలాంటి వాతావరణంలో వారు బయటకు వస్తే వడదెబ్బ తగిలి డీహైడ్రేషన్, జ్వరం బారిన పడే అవకాశం ఉంది. అందుకే వైద్య ఆరోగ్య శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో ప్రభుత్వం ఈ పొడిగింపు నిర్ణయం తీసుకుంది. సెలవుల పొడిగింపు కేవలం చిన్న పిల్లల రాకకు మాత్రమే వర్తిస్తుంది. అయితే అంగన్‌వాడీల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందే పౌష్టికాహారం పంపిణీకి ఎలాంటి ఆటంకం కలగకుండా అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టనున్నారు. సెలవుల కాలంలోనూ లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారాన్ని "టేక్ హోమ్ రేషన్" విధానంలో లబ్ధిదారుల ఇళ్లకే అందజేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందాల్సిన పోషకాహారం నిరంతరంగా అందుబాటులో ఉంటుంది. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు, ముఖ్యంగా చిన్నారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల అంగన్‌వాడీ సిబ్బందితో పాటు, చిన్నారుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీనికి సంబంధించిన అధికారిక మార్గదర్శకాలు, జీవో త్వరలోనే విడుదల కానున్నాయి.

# నగరంలో వరుసగా అగ్నిప్రమాదాలు

- ప్రభుత్వం నిర్లక్ష్యమే కారణం: తలసాని



హైదరాబాద్, జూన్4 (జనంసాక్షి) : అగ్నిప్రమాదాలను నివారించడంలో ప్రభుత్వం విఫలమైందని మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం అమీర్ పేటలోని మైత్రివనం వద్ద అగ్నిప్రమాదం జరిగిన ప్రాంతాన్ని సందర్శించారు. ప్రమాదం వివరాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంతో నష్టపోయిన బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో వరుసగా అగ్నిప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రమాదాల నివారణకు తీసుకోవా ల్సిన చర్యలపై ప్రజలకు, కమర్షియల్ కాంప్లెక్స్ ల నిర్వాహకులకు అవగాహన కల్పించాలని సూచించారు. అగ్నిమాపక శాఖకు అవసరమైన ఆధునిక పరికరాలు అందుబాటులో కి తేవాలని చెప్పారు. ప్రమాదం జరిగిన వెంటనే సకాలంలో స్పందించిన అధికారులను ఆయన అభినందించారు. ప్రమాదంలో నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, నాయకులు అశోక్ యాదవ్, నామన సంతోష్, ప్రవీణ్ రెడ్డి, సుమిత్ సింగ్, కట్టా బలరాం, సాయి, ప్రదీప్ గౌడ్, తదితరులు ఉన్నారు.

# ఉద్యమకారుల గుర్తింపును ప్రహసనంగా మార్చొద్దు

- ఎమ్మెల్సీ డా. శ్రవణ్ దాసోజు, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్




హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను, దశాబ్ద కాలం పాటు లాఠీదెబ్బలకు ఎదురొడ్డి నిలిచిన ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక ప్రహసనంగా మార్చాలని చూస్తే సహించేది లేదని బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధులు, ఎమ్మెల్సీ డాక్టర్ శ్రవణ్ దాసోజు, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ తీవ్రంగా హెచ్చరించారు. సచివాలయంలో కే. కేశవరావు నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి సర్వపక్ష సమావేశానికి బిఆర్ఎస్ పార్టీ తరపున అధికారిక ప్రతినిధులుగా హాజరైన డా. శ్రవణ్ దాసోజు, కర్నె ప్రభాకర్.. అనంతరం తెలంగాణ భవన్ లో సంయుక్త మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి బలమైన పొలిటికల్ పంచ్ ఇస్తూనే, ఉద్యమకారుల సంక్షేమం కోసం విప్లవాత్మక, నిర్మాణాత్మక సూచనలను ప్రభుత్వం ముందు ఉంచారు. మీడియా సమావేశంలో డా. శ్రవణ్ దాసోజు, కర్నె ప్రభాకర్ మాట్లాడుతూ 'తెలంగాణ ఉద్య మం, ఉద్యమకారులు, అమర వీరులు-ఈ పేర్లు వినగానే గుండెల్లో ఒక భావోద్వేగం, ఒక చైతన్యం ఉప్పొంగుతాయి. కేసీఆర్ సైనికులుగా వారి హక్కుల కోసం మరింత బలంగా పనిచేయాలనే ప్రేరణ మాకు కలుగుతుంది. రెండున్నర సంవత్సరాల కాలయాపన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం 'జీఓ నెంబర్ 679' ని తీసుకువచ్చింది. ఈ జీఓలోని టర్మ్స్ ఆఫ్ రెఫరెన్స్‌లో 'మేము సంప్రదింపుల ద్వారా ఏం చేయాలో రికమండ్ చేస్తాం' అని లొసుగులు పెట్టడం హాస్యాస్పదం. ఎన్నికల సమయంలో 106వ వాగ్దానం కింద ప్రతి అమరవీరుడి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం, 25,000 నెలవారీ పెన్షన్, కేసులు ఎత్తివేత, మరియు 250 గజాల ఇంటి స్థలం ఇస్తామని స్పష్టంగా చెప్పి మీరు ఓట్లు దండుకున్నారు. ఇప్పుడు మళ్లీ కమిటీల పేరుతో ఇచ్చిన మాటను తప్పాలని చూస్తే తెలంగాణ సమాజం క్షమించదు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన మొట్టమొదటి బడ్జెట్ లోనే ?100 కోట్లు కేటాయించి, 610 మంది అమరవీరులను, 582 మంది కళాకారులను ప్రభుత్వ రంగంలోకి తీసుకొని ఆదుకున్నారు. మరి ఈ ప్రభుత్వ నిర్దిష్ట ప్రణాళిక ఏంటి? ఎంత బడ్జెట్ కేటాయించారు అని ప్రశ్నిస్తే అధికారుల దగ్గర సమాధానం లేదు. కేవలం ఓట్ల కోసం నాటకాలు ఆడితే ఊరుకోం!" అన్నారు.

# తెలంగాణలో విద్వేషాలు సృష్టించవద్దు

- ఆంధ్రా నాయకులకు గుత్తా కౌంటర్



హైదరాబాద్, జూన్4 (జనంసాక్షి) : తెలంగాణలో విద్వేషాలు సృష్టించవద్దని తెలంగాణ మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ నాయకులకు గట్టి కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకలు జరుగుతుంటే ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సభను నిర్వహిస్తామనడం సరైనది కాదని మీడియా చిట్‌చాట్‌లో పేర్కొన్నారు. మీడియా సమావేశంలో పవన్ కల్యాణ్ వాడిన భాష తీరు సరిగా లేదని వెల్లడించారు. అమరావతి బ్రహ్మాండమైన రాజధాని అంటున్న సీఎం ,డిప్యూటీ సీఎం , మంత్రులు అమరావతిలోనే నివాసం ఉండాలని సూచించారు. తెలంగాణ కన్నా ఏపీలో ఎక్కువ సోర్స్ ఉన్నాయి. సముద్ర తీరం ఉంది. రకరకాల పోర్టులు ఉన్నాయి. ఆ నాయకులంతా ఏపీ అభివృద్ధి చూసుకోవాలి తప్ప తెలంగాణా వైపు చూడొద్దని హితవు పలికారు. తెలంగాణలో విద్వేషాలకు ప్రయత్నించవద్దని తెలిపారు. తెలంగాణ లో 75 శాతం ధాన్యం సేకరణ పూర్తి అయిందని, ధాన్యం కొనుగోళ్లకు కేంద్రం సహకరించడం లేదని ఆరోపించారు. రైతులు పంట మార్పిడి వైపు దృష్టి సారించాలని కోరారు. రైతులు వరి , పత్తి తప్ప ఏ పంటలు పండించడం లేదని వివరించారు.

# హైదరాబాద్ సహా పలుప్రాంతాల్లో చిరుజల్లులు

- చల్లబడ్డ నగర వాతావరణం



హైదరాబాద్, జూన్ 4 (జనంసాక్షి) : జూన్ నెల వచ్చినా ఎండలు మండిపోతున్నాయి... రుతుపవనాల రాక ఆలస్యమవ్వడంతో మరి కొన్ని రోజులు ఎండ తీవ్రత ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది. అయితే.. గురువారం ఉదయం నుండి ఎండ దంచికొట్టినప్పటికీ మధ్యాహ్నం అయ్యేసరికి ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఒక్కసారిగా మబ్బులు కమ్మేసి చిరుజల్లులు కురిశాయి. ఈ దెబ్బతో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా తగ్గిపోయి నగరం చల్లబడింది. వర్షం కురిసే సమయంలో రోడ్ల మీద ఉన్న వాహనదారులు చిరుజల్లులతో రిలీఫ్ అయ్యారు. అప్పటిదాకా ఎండలో ట్రాఫిక్ జామ్ లో విసిగిపోయిన జనం ఒక్కసారిగా కురిసిన చిరుజల్లులతో ఉపశమనం పొందారు. కరీంనగర్ జిల్లాలో కూడా వాతావరణం ఒక్కసారిగా మారిపోయి వర్షం కురిసింది. కరీంనగర్ జిల్లా కేంద్రంతో పాటు తిమ్మాపూర్, మనుకొండూరు, శంకరపట్నం, జమ్మికుంట, హుజురాబాద్ మండలాల్లో ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురవగా... మరికొన్ని చోట్ల ఉరుములతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుండి విపరీతమైన ఎండ వేడితో అల్లాడిన జనం వర్షంతో ఉపశమనం పొందామని అంటున్నారు. మెదక్ జిల్లా నిజాంపేట మండలంలోని పలు గ్రామాల్లో వర్షం కురిసింది. నిజాంపేట మండల కేంద్రంలోని ఓ ఇంటిపై పిడుగు పడింది. అయితే.. పిడుగు పడిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది.

# టూ వీలర్ స్కిడ్.. దూసుకెళ్లిన బస్సు

- ఇంజనీరింగ్ విద్యార్థి దుర్మరణం

హైదరాబాద్, జూన్4 (జనంసాక్షి) : నగరంలో కురిసిన కొద్దిపాటి వర్షానికి రోడ్డుపై బురద చేరింది. ఇదే ఓ విద్యార్థి ప్రాణాలు పోవడానికి కారణమైంది. సికింద్రాబాద్ పరిధిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందాడు. నగరంలో కురిసిన వర్షానికి రోడ్డుపై బురద చేరింది. ఈ క్రమంలో బైకుపై వస్తున్న ఓ యువకుడు స్కిడ్ అయి.. అదే సమయంలో పక్కనే వెళ్తున్న ఆర్టీసీ బస్సు కిందికి దూసుకుపోయాడు. బస్సు అతడి పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న మార్కెట్ స్టేషన్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడు గురునానక్ కాలేజీలో బీటెక్ చదువుతున్న మదన్ మోహన్‌గా గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. మదన్ మోహన్ అకాల మరణంతో అతని కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

# రేవంత్ పర్యటన సందర్భంగా ముందస్తు అరెస్టులు

జోగులాంబ గద్వాల, జూన్4 (జనంసాక్షి) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం గద్వాల జిల్లాలో పర్యటన సందర్భంగా పోలీసులు బీఆర్ఎస్ నాయకులను ముందస్తుగా హౌస్ అరెస్టు చేశారు. గద్వాల నియోజకవర్గ నాయకుడు బాసు హనుమంతు నాయుడును పోలీసులు అర్ధరాత్రి నుంచి హౌస్ అరెస్ట్ చేశారు. అదేవిధంగా పార్టీ సీనియర్ నాయకులు నాగర్ దొడ్డి వెంకట్ రాములు, కురువపల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్.కేశవ్‌ను అరెస్టు చేయడం పట్ల హనుమంతు నాయుడు మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలనలో పోలీస్‌ల పహారాలు, నిర్బంధాలు ఎందుకని ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. ప్రజా ప్రభుత్వం అంటూ బీరాలు పలుకుతూ ప్రతిపక్ష నాయకులపై ఆంక్షలు ఎందుకని నిలదీశారు. మూడు సంవత్సరాల పాలనకే ఇంత అభద్రతాభావమా.. ఇంతటి అరాచకమా? అని మండిపడ్డారు. పెండింగ్ ప్రాజెక్టులపై ప్రతిపక్ష పార్టీల సూచనలను, ప్రజల ఆలోచనలను పరిగణనలోకి తీసుకోకుండా హడావుడిగా ప్రాజెక్టుల సందర్శన చేపట్టడం విచారకరమని అన్నారు. బీఆర్ఎస్ నాయకుల అరెస్టును తీవ్రంగా ఖండించారు.

# ఆస్పత్రిలో మృతురాలి మెడలో పుస్తెల తాడు మాయం

యాదాద్రి భువనగిరి, జూన్ 4 (జనంసాక్షి) : భువనగిరిలో దారుణం జరిగింది. మృతదేహంపై ఉన్న మూడు తులాల బంగారు పుస్తెల తాడును దుండగులు మాయం చేశారు. భువనగిరి జిల్లా ఆసుపత్రిలో చనిపోయిన మహిళ మెడ నుంచి మూడు తులాల బంగారు పుస్తెల తాడు మాయమైన ఘటన కలకలం రేపింది. వలిగొండ మండలం వర్కట్ పల్లికి చెందిన సుస్మిత అనే గర్భవతికి దమ్ము ఎక్కువగా వస్తుండటంతో అర్ధరాత్రి రెండు గంటల సమయంలో ఆమె భర్త నాగరాజు ఆమెను జిల్లా ఆసుపత్రికి తీసుకొచ్చాడు. తెల్లవారుజామున నాలుగు గంటలకు సుస్మిత చికిత్స పొందుతూ చనిపోయింది. పోస్టుమార్టం సమయంలో సుస్మితపై ఉన్న బంగారు ఆభరణాలు తీసుకోండని చెప్పడంతో కుటుంబ సభ్యులు ఆమె ఒంటిపై ఉన్న బంగారం గురించి చూడగా.. అప్పటికే ఆమె మెడలోని మూడు తులాల పుస్తెలా తాడు కనిపించలేదు. ఈ ఘటనపై.. ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో పాటు పోలీసులకు సుస్మిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు.

సంపాదకీయం
జనంసాక్షి

# "కాక్రోచ్" పోరుబాట

దేశంలో మతోన్మాదం రోజురోజుకూ విజృంభిస్తున్న వేళ, రాజ్యాంగ విలువలను నిలబెట్టాలని, సమాజంలో సోదరభావాన్ని పునరుద్ధరించాలని పోరాడుతున్న యువశక్తి ఒకటి రంగంలోకి దిగింది. కాక్రోచ్ పార్టీ పేరుతో ముందుకొచ్చిన ఈ కొత్త రాజకీయ శక్తి, దేశ సమైక్యత, సమగ్రత తమ ప్రధాన ఎజెండాగా ప్రకటించింది. సాధారణంగా రాజకీయ పార్టీలు అధికారం చేజిక్కించుకోవడానికి మతాన్ని ఆయుధంగా వాడతాయి. కానీ కాక్రోచ్ పార్టీ పుట్టుకే మతోన్మాదానికి వ్యతిరేకంగా జరిగింది. ఇది యువతలో కొత్త ఆశలు రేకెత్తిస్తోంది.

స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా, ఈ దేశంలో మత విద్వేషం, కుల వివక్ష, ప్రాంతీయ అసమానతలు తగ్గలేదు. అల్పసంఖ్యాక వర్గాలపై దాడులు, మరోవైపు మెజారిటీ మతోన్మాద శక్తుల రెచ్చగొట్టే ప్రసంగాలు.. ఈ రెండూ కలిసి దేశ సమాజాన్ని ముక్కలు చేస్తున్నాయి. రాజ్యాంగం హామీ ఇచ్చిన సమానత్వం, లౌకికవాదం కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితమవుతున్నాయా అన్న సందేహం ప్రజల మనసులో బలంగా నాటుకుపోతోంది. ఇలాంటి సందిగ్ధ వాతావరణంలో కాక్రోచ్ పార్టీ ఆవిర్భావం అనేక అంచనాలకు, అవకాశాలకు తెరలేపింది.

కాక్రోచ్ పార్టీ అనే పేరు వింటేనే చాలా మంది ఆశ్చర్యపోతారు. ఆ పేరు వెనక ఒక తాత్విక దృష్టి దాగి ఉంది. కాక్రోచ్ ఏ పరిస్థితిలోనూ బతికి బట్టకడుతుంది. ఎంత కష్టమైన వాతావరణమైనా, ఎన్ని ప్రతికూలతలు ఎదురైనా నిలబడే తత్వం దానిలో ఉంది. అదే సందేశాన్ని తమ పార్టీకి ఇవ్వాలని నాయకత్వం నిర్ణయించింది. అధికార పార్టీల అణచివేత ఎంత తీవ్రంగా ఉన్నా, మీడియా నిరాదరణ ఎంత బాధించినా, ఆర్థిక వనరుల కొరత ఎంత వేధించినా మేము మనుగడ సాగిస్తాం, పోరాడుతాం అనే స్ఫూర్తి ఆ పేరులో ఉంది.

నీటి పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం దేశవ్యాప్తంగా ఆందోళన రేపుతున్న తరుణంలో కాక్రోచ్ పార్టీ మరింత చురుకుగా రంగంలోకి దిగింది. ప్రశ్నపత్రాలు బయటకు లీకైన ఈ ఘటన, వ్యవస్థలో పాతుకుపోయిన అవినీతిని మరోసారి బట్టబయలు చేసింది. ప్రభుత్వ ఉద్యోగాల కోసం రాత్రింబగళ్ళు చదివిన లక్షలాది విద్యార్థులు ఒక్కసారిగా నిరాశలో కూలిపోయారు. వారి కళ్ళల్లో కనిపించే నిస్సహాయత, నిరాశ, ఆగ్రహం.. ఇవే కాక్రోచ్ పార్టీ పోరాటానికి ఇంధనమయ్యాయి. ఒత్తిళ్ళకు గురవుతున్న రాజ్యాంగ వ్యవస్థలను, విలువలను పునరుద్ధరించాలని పిలుపిస్తున్న కాక్రోచ్ పార్టీ అనేక మంది మేధావులు, సామాజిక కార్యకర్తల దృష్టిని ఆకర్షించింది.

ప్రజల మధ్య సోదరభావం పెంపొందించడం కూడా కాక్రోచ్ పార్టీ ముఖ్యమైన లక్ష్యాలలో ఒకటి. హిందూ ముస్లిం, అగ్రవర్ణ దళిత, ఉత్తర దక్షిణ అని విభజించే రాజకీయాలు దేశాన్ని లోపలి నుండి పొడిచి పారేస్తున్నాయి. ఈ విద్వేష రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా సమైక్యత సందేశం ఇవ్వడానికి పార్టీ క్రియాశీలకంగా పనిచేస్తోంది. యువత ఈ పార్టీవైపు ఆకర్షితమవడానికి కారణాలు చాలా ఉన్నాయి. నిరుద్యోగం పెరుగుతోంది. చదువు ఖర్చు భరించలేకపోతున్నారు. నచ్చిన వ్యక్తిని పెళ్ళి చేసుకోవడానికి భయపడాల్సిన పరిస్థితి ఉంది. సోషల్ మీడియాలో అభిప్రాయం వ్యక్తం చేస్తే కేసులు పెడుతున్నారు. ఈ సమస్యలన్నిటికీ గళం వినిపిస్తున్న కాక్రోచ్ పార్టీ యువతకు ఒక నమ్మకమైన వేదికగా కనిపిస్తోంది. కళాశాల క్యాంపస్‌లలో, సోషల్ మీడియా వేదికలపై, పట్టణ వీధుల్లో ఎక్కడ చూసినా ఈ పార్టీకి మద్దతుదారులు కనిపిస్తున్నారు. ఈ పార్టీ భవిష్యత్తు ఎలా ఉంటుందో, ఎంత బలపడుతుందో కాలమే నిర్ణయిస్తుంది. కానీ ఒక విషయం మాత్రం స్పష్టం. దేశ ప్రజలు, ముఖ్యంగా యువత, మార్పు కోసం ఆత్రుతగా ఉన్నారు. ఆ ఆత్రుతకు కాక్రోచ్ పార్టీ సరైన వేదికగా మారగలిగితే, భారత రాజకీయాల ముఖచిత్రమే మారిపోయే అవకాశం ఉంది.

# ట్రంప్ తీరుతో అమెరికా ప్రతిష్ఠ పతనం



డోనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత ప్రపంచ రాజకీయాల్లో స్థిరత్వం కన్నా గందరగోళమే ఎక్కువగా కనిపిస్తున్నదన్న విమర్శలు పెరుగుతున్నాయి. ఒక అగ్రరాజ్యాధినేత మాట్లాడే ప్రతి మాటకు అంతర్జాతీయ ప్రాధాన్యత ఉంటుంది. కానీ ట్రంప్ విషయంలో మాత్రం ఈ ప్రామాణికత పూర్తిగా దెబ్బతిన్నదనే అభిప్రాయం ప్రపంచవ్యాప్తంగా బలపడుతోంది. ఉదయం చెప్పిన మాటను సాయంత్రం మార్చడం, ఒక రోజు తీసుకున్న నిర్ణయాన్ని మరుసటి రోజు తిరస్కరించడం, మిత్రదేశాలపై అవమానకర వ్యాఖ్యలు చేయడం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదిపేసేలా టారిఫ్ విధానాలు ప్రకటించడం...ఇవి అన్నీ కలిసి ట్రంప్ నాయకత్వంపై తీవ్ర అనుమానాలు రేకెత్తిస్తున్నాయి.

అమెరికా చరిత్రలో ఎందరో వివాదాస్పద అధ్యక్షులు ఉన్నప్పటికీ, వ్యక్తిగత ప్రవర్తన, అనూహ్య వ్యాఖ్యలు, అవమానకర భాష, రాజకీయ అస్థిరత పరంగా ట్రంప్ స్థాయి ప్రత్యేకంగా దిగాజారిన స్థితిగా నిలిచిపోయిందని అనేక అంతర్జాతీయ పత్రికలు వ్యాఖ్యానించాయి. బ్రిటన్‌కు చెందిన నిది గార్డియన్", అమెరికా నిన్యూయార్క్ టైమ్స్", నివాషింగ్టన్ పోస్ట్", ఫ్రాన్స్‌కు చెందిన నిలె మోండ్" వంటి పత్రికలు ట్రంప్ విదేశాంగ విధానాన్ని నిఅనిశ్చితి రాజకీయాలు"గా అభివర్ణించాయి. కొంతమంది విశ్లేషకులు నిఅమెరికా అధ్యక్ష పదవి ఒక రియాలిటీ షోగా మారిపోయింది" అని కూడా వ్యాఖ్యానించారు.

ప్రత్యేకంగా టారిఫ్ యుద్ధాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపాయి. చైనా, యూరోపియన్ యూనియన్, మెక్సికో, కెనడా వంటి దేశాలపై భారీ సుంకాలు విధిస్తూ ట్రంప్ తీసుకున్న నిర్ణయాలు అంతర్జాతీయ మార్కెట్లలో అస్థిరతను పెంచాయి. ప్రపంచ వ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు పలుమార్లు కుదేలయ్యాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలను కూడా అమెరికానే ఉల్లంఘిస్తోందన్న విమర్శలు వచ్చాయి. అమెరికాలోనే ధరలు పెరిగి, వినియోగదారులపై అదనపు భారం పడింది. అనేక అమెరికన్ వ్యాపారవేత్తలు కూడా ట్రంప్ విధానాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నివాల్ స్ట్రీట్ జర్నల్" ఒక సంపాదకీయంలో నిటారిఫ్‌లు అమెరికాను బలపరచడం కాదు, ఒంటరిచేస్తున్నాయి" అని వ్యాఖ్యానించడం గమనార్హం.

ట్రంప్ విదేశాంగ విధానం మరింత వివాదాస్పదంగా మారింది. నాటో దేశాలపై పదేపదే విమర్శలు చేయడం, కెనడా, జర్మనీ, ఫ్రాన్స్ వంటి చిరకాల మిత్రదేశాల నాయకులను బహిరంగంగా అవమానించడం వల్ల అమెరికా నాయకత్వంపై నమ్మకం దెబ్బతింది. ఒకప్పుడు అమెరికాను విశ్వసించిన దేశాలు ఇప్పుడు జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాయి. అవసరాల కోసం సంబంధాలు కొనసాగిస్తున్నా, వారికి ట్రంప్ మాటలపై నమ్మకం లేదని యూరోపియన్ దౌత్యవేత్తలు పరోక్షంగా వ్యాఖ్యానిస్తున్నారు.

ఇజ్రాయెల్-ఇరాన్ ఘర్షణలో ట్రంప్ వైఖరి అమెరికాకు మరో పెద్ద సమస్యగా మారింది. ఇజ్రాయెల్‌కు అంధ మద్దతు ఇవ్వడం వల్ల అమెరికా మధ్యప్రాచ్యంలో తటస్థత కోల్పోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇరాన్‌పై కఠిన వైఖరి తీసుకోవడం, యుద్ధోన్మాద ప్రకటనలు చేయడం వల్ల చమురు ధరలు పెరిగాయి. ప్రపంచ ఆర్థిక పరిస్థితులు మరింత గందరగోళానికి గురయ్యాయి. అమెరికా సైనిక వ్యయాలు కూడా పెరిగాయి. నిసీఎన్ఎన్", నిబీబీసీ" వంటి మీడియా సంస్థలు నిట్రంప్ విదేశాంగ విధానం ప్రపంచాన్ని మరింత ప్రమాదకర దిశలో నెడుతోంది" అని విశ్లేషించాయి.

ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో ట్రంప్ సంబంధాలు కూడా ఇటీవల ఉద్రిక్తంగా మారినట్లు పాశ్చాత్య మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. ఒకప్పుడు పరస్పరం పొగడ్తలు చేసుకున్న ఈ ఇద్దరు నేతల మధ్య ఇప్పుడు వ్యూహాత్మక విభేదాలు పెరిగాయని విశ్లేషకులు చెబుతున్నారు. ట్రంప్ మాటలను నెతన్యాహు పట్టించుకోవడం లేదన్న అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. దీనివల్ల అమెరికా అంతర్జాతీయ ప్రతిష్ఠ మరింత దెబ్బతిన్నదని విమర్శకులు అంటున్నారు.

ట్రంప్ వ్యక్తిగత ప్రవర్తన కూడా తీవ్ర విమర్శలకు గురవుతోంది. రాజకీయ ప్రత్యర్థులపై, మహిళలపై, వలసదారులపై, ముస్లింలపై, మీడియాపై ఆయన ఉపయోగించిన భాషను అనేక మానవ హక్కుల సంస్థలు ఖండించాయి. నిహేట్ పాలిటిక్స్", నిడివైడింగ్ అమెరికా", నిపొలిటికల్ బుల్లీ" వంటి పదజాలంతో అమెరికన్ మీడియా పలుమార్లు ట్రంప్‌ను విమర్శించింది. ప్రపంచవ్యాప్తంగా సోషల్ మీడియాలో ట్రంప్‌పై జోక్స్, మీమ్స్, కార్టూన్లు విస్తృతంగా వైరల్ అవుతున్నాయి. కొందరు ప్రముఖ కార్టూనిస్టులు ట్రంప్‌ను నిఅణ్వాయుధాలు పట్టుకున్న జోకర్"గా చిత్రీకరించడం అతని అంతర్జాతీయ ఇమేజ్ ఎంతగా దిగజారిందో సూచిస్తోంది.

అమెరికా లోపల కూడా ట్రంప్‌పై నిరసనలు ఆగడం లేదు. విద్యార్థులు, కార్మిక సంఘాలు, మహిళా సంఘాలు, వలస హక్కుల సంస్థలు, మేధావులు సైతం నిరంతరం ఆందోళనలు నిర్వహిస్తున్నాయి. అనేక సర్వేలలో ఆయన ప్రజాదరణ పతనం దిశగా పడిపోతున్నట్లు తేలుతోంది. అమెరికా ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరుస్తున్న నాయకుడిగా ట్రంప్‌ను పలువురు మాజీ అధికారులు అభివర్ణించారు. కొందరు మాజీ సైనికాధికారులు కూడా ఆయన నిర్ణయాలు అమెరికా భద్రతకు ముప్పు కావచ్చని హెచ్చరించారు.

అమెరికా అధ్యక్ష పదవి ప్రపంచానికి ఒక విలువ, ఒక నైతిక ఆధిపత్యం, ఒక రాజకీయ స్థిరత్వానికి ప్రతీకగా ఉండేది. కానీ ట్రంప్ కాలంలో అది వ్యక్తిగత అహంకారం, రాజకీయ ప్రతీకారం, అనూహ్య నిర్ణయాల వేదికగా మారిపోయిందన్న విమర్శలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ప్రపంచ దేశాలు ఇప్పుడు అమెరికా మాట కంటే అమెరికా చర్యలపై ఎక్కువ అనుమానంతో చూస్తున్నాయి. ఒకప్పుడు ప్రపంచానికి మార్గదర్శకత్వం వహించిన అమెరికా, ఇప్పుడు తన అధ్యక్షుడి ప్రవర్తన కారణంగా విమర్శల కేంద్రంగా మారడం ఆ దేశ ప్రజాస్వామ్య చరిత్రలో ఒక విషాదకర పరిణామంగా చెప్పుకోవాలి.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం

"ప్రకృతి నుంచి ప్రేరణ. వాతావరణం కోసం. మన భవిష్యత్తు కోసం." అనే శీర్షికతో ప్రపంచం ఆహ్వానం పలుకుతోంది.

అజర్బైజాన్ ఈ సంవత్సరం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఆతిథ్యం వహించబోతోంది, ఇది ఐక్యరాష్ట్రాల పర్యావరణ కార్యక్రమం ద్వారా నిర్వహించబడుతుంది. దేశాలు పర్యావరణ పరిరక్షణ చర్యలను వేగవంతం చేయడానికి పెరుగుతున్న ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఈ శీర్షిక ప్రకృతి కేవలం ఒక వనరు మాత్రమే కాకుండా, వాతావరణ సంక్షోభ పరిష్కారానికి మార్గదర్శకంగా వ్యవహరిస్తుంది.

ప్రకృతి మన మానవత్వానికి ప్రాథమిక ఆధారం, శుభ్రమైన గాలి, నీరు, మరియు పంటల కోసం భూమిని అందిస్తుంది. నేడు, ఇది వాతావరణ సంక్షోభానికి విలువైన పరిష్కారాలను కూడా అందిస్తుంది. ఈ శీర్షిక ప్రభుత్వాలు, వ్యాపారాలు, సమాజాలు మరియు వ్యక్తులు ప్రకృతిలోని సహనం మరియు జ్ఞానాన్ని నేర్చుకుని పర్యావరణ సమస్యలను ఎదుర్కోవాలని ప్రోత్సహిస్తుంది. పరిసరాల పునరుద్ధరణ, జైవ వైవిధ్యాన్ని రక్షించడం వంటి చర్యలు వాతావరణ మార్పును తగ్గించడంలో మరియు గ్లోబల్ పర్యావరణ



ఆరోగ్యాన్ని పెంపొందించడంలో కీలకమయ్యాయి.

ఈ సంవత్సరం ముఖ్యాంశం ఫాసిల్ ఇంధనాల నుండి పునరుత్పాదక శక్తుల వైపు మార్పు. గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారాలను తగ్గిస్తూ సుస్థిర ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడం ప్రధాన లక్ష్యం. అజర్బైజాన్ ను ఆతిథ్య దేశంగా ఎంచుకోవడం, ఆ దేశం శక్తి వనరుల విభిన్నతకు మరియు ప్రాంతీయ పర్యావరణ నాయకత్వానికి కట్టుబడి ఉందని సూచిస్తుంది.

- తెలంగాణలో కూడా ఈ గ్లోబల్ దృష్టితో అనేక కార్యక్రమాలు జరుగుతున్నాయి:
- పెద్ద స్థాయిలో చెట్లు నాటడం మరియు పర్యావరణ పునరుద్ధరణ
- శుభ్రమైన శక్తి ప్రోత్సాహం మరియు సుస్థిర నగర అభివృద్ధి
- నీటి సంరక్షణ కోసం ప్రకృతి ఆధారిత పరిష్కారాలు

**వ్యక్తిగత బాధ్యతపై దృష్టి**

ప్రభుత్వ చర్యలతో పాటు, వ్యర్థాలు తగ్గించడం, నీటిని సంరక్షించడం, పర్యావరణ అనుకూలమైన రవాణాను ఎంచుకోవడం వంటి సుస్థిర జీవనశైలులను పాటించడం సాధారణ పౌరులకూ సాధ్యమే అని నిర్వాహకులు తెలిపారు. ఈ దినోత్సవం దేశాలకు వాతావరణ సంక్షోభానికి సంబంధించిన వాగ్దానాలను పునరుద్ధరించుకునేందుకు, ఆవిష్కరణలు పంచుకునేందుకు, మరియు జాతీయ సరిహద్దులను దాటి పర్యావరణ సమస్యలకు సమన్వయం చేయడానికి వేదికగా నిలుస్తుంది. ఈ విభిన్న చర్యల ద్వారా మన గ్రహానికి మరియు దాని నివాసులకు మేము ఒక సహనశక్తితో కూడిన భవిష్యత్తును సృష్టించగలము.



Asst.prof.Ch. Sirisha Rani,
Malla Reddy College of
Engineering and Technology.,
Hyderabad.

# ఇంకొంత చేర్పుతో! ప్రజాస్వామ్య పునర్నిర్మాణం

## బ్యూరోక్రసీ విచక్షణ నుండి పౌర సార్వభౌమత్వానికి 'మూడో స్తంభం' రోడ్‌మ్యాప్

ఆధునిక ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న సంక్షోభం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశం మరియు అత్యంత పురాతన ప్రజాస్వామ్య దేశమైన అమెరికాల రాజ్యాంగ నిర్మాణాలు పౌరుడికి స్వేచ్ఛను, సమానత్వాన్ని ప్రాథమిక హక్కులుగా ప్రకటించాయి. 1950 జనవరి 26న అమలులోకి వచ్చిన భారత రాజ్యాంగం పౌరుడికి ఓటు హక్కును కల్పించడం ద్వారా పాలకులను ఎన్నుకునే సర్వాధికారాన్ని సామాన్యుడి చేతిలో పెట్టింది. అయితే, ఏడు దశాబ్దాల స్వతంత్ర భారత ప్రయాణం తర్వాత నేడు ఒక ప్రాథమిక ప్రశ్న ప్రజాస్వామ్యవాదులను వేధిస్తోంది: "భారత పౌరుడు నిజంగానే సార్వభౌముడా? లేక కేవలం పరిపాలనా అధికారుల (బ్యూరోక్రసీ) విచక్షణకు లొంగి బతికే ఒక యాచకుడా?"

చంద్రునిపైకి వెళ్లే అంతరిక్ష నౌకలను ఇక్కడి కంట్రోల్ రూమ్ నుండి కంప్యూటర్ల ద్వారా నియంత్రించగలుగుతున్న ఆధునిక క్వాంటం యుగంలో, మన ఓటింగ్ వ్యవస్థలు మరియు పౌరసత్వ ధృవీకరణ ప్రక్రియలు ఇంకా వలసరాజ్యాల కాలం నాటి ఐఏఎస్-కలెక్టరేట్ వ్యవస్థల చేతుల్లోనే బందీగా ఉండిపోవడం ఒక చారిత్రక విషాదం. ఎన్నికల నిర్వహణలో వస్తున్న డేటా వ్యత్యాసాలు, పౌరసత్వ సవరణ చట్టాల నేపథ్యంలో తలెత్తుతున్న భయాలు, మరియు జిల్లా స్థాయిలో సామాన్య పౌరుడు తన అస్తిత్వ పత్రాల కోసం బ్యూరోక్రసీ ముందు మోకరిల్లాల్సి వస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో... భారత ప్రజాస్వామ్యాన్ని పునర్నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందుకోసం జిల్లా స్థాయిలో కలెక్టర్, ఎస్పీల తరహాలోనే "పౌర హక్కుల సంరక్షణ" కోసం ఒక స్వతంత్ర మూడో స్తంభాన్ని (3తీస ౧ాఅశ్రీశ్రీఖతీ) ఏర్పాటు చేయడమే ఏకైక మార్గం.

**1. ఓటు హక్కు: ప్రాథమిక హక్కుగా మార్చాల్సిన చారిత్రక ఆవశ్యకత**

భారత రాజ్యాంగంలోని 3వ భాగంలో ఆర్టికల్ 12 నుండి 35 వరకు పౌరులకు ప్రాథమిక హక్కులను కల్పించారు. కానీ, ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు లాంటి ఓటు హక్కును మాత్రం 3వ భాగంలో చేర్చకుండా, 15వ భాగంలోని ఆర్టికల్ 326 కింద ఒక సాధారణ రాజ్యాంగబద్ధ/చట్టబద్ధ హక్కుగా (Statutory Right) మాత్రమే మిగిల్చారు.

తెలంగాణ రాష్ట్ర తొలి బీసీ కమిషన్ చైర్మన్ బి.ఎస్. రాములు వంటి సామాజిక మేధావులు దశాబ్దాలుగా వాదిస్తున్నట్లుగా, ఓటు హక్కును రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (భావప్రకటన స్వేచ్ఛ) పరిధిలోకి పూర్తిగా తీసుకువస్తూ దానిని "ప్రాథమిక హక్కు" (Fundamental Right) గా ప్రకటించాల్సిన సమయం ఆసన్నమైంది.

ప్రస్తుతం సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం... మనం పోలింగ్ బూత్‌లోకి వెళ్ళి అభ్యర్థిని ఎంచుకునే 'స్వేచ్ఛ' (Freedom of Voting) మాత్రమే ఆర్టికల్ 19(1)(a) కిందకు వస్తుంది, కానీ 'ఓటు వేసే హక్కు' (Right to Vote) కేవలం చట్టబద్ధమైనది మాత్రమే. దీనివల్ల జరుగుతున్న నష్టం ఏమిటంటే, ప్రజా ప్రాతినిధ్య చట్టం (RPA, 1951) లోని సెక్షన్ 62 కింద ప్రభుత్వం లేదా జైలు నిబంధనలు సామాన్యుడి ఓటు హక్కును హరించే అవకాశం కలుగుతోంది. ఒకవేళ ఓటు హక్కు అనేది పూర్తిస్థాయి ప్రాథమిక హక్కుగా మారితే, ఏ ప్రభుత్వ చట్టం కూడా పౌరుడి ఓటును తాకలేదు. ఒకవేళ ఓటును నిరాకరిస్తే, పౌరుడు నేరుగా ఆర్టికల్ 32 ప్రకారం



సుప్రీంకోర్టును ఆశ్రయించే హక్కు లభిస్తుంది. ఓటు హక్కును ఆర్టికల్ 19లో అంతర్భాగం చేయడం ద్వారానే పౌరుడికి చట్టబద్ధమైన రక్షణ లభిస్తుంది.

**2. ఈవీఎంల భద్రత - సాంకేతికత, అంతర్జాతీయ పాఠాలు**

భారతదేశంలో ఎన్నికల లెక్కింపుల సమయంలో నమోదైన ఓట్లకు (Voter Turnout), కౌంటింగ్ నాటి ఓట్లకు మధ్య వస్తున్న గణాంకాల తేడాలు సామాన్య ఓటరులో తీవ్రమైన అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా టెక్నాలజీ దిగ్గజం ఇలాన్ మస్క్ వంటి వారు సైతం ఈవీఎంల ట్యాంపరింగ్ సాధ్యమేనని, ఏ కంప్యూటర్ వ్యవస్థనైనా హ్యాక్ చేయవచ్చని హెచ్చరిస్తున్నారు.

భారత ఎన్నికల సంఘం (ECI) మన ఈవీఎంలు 'స్టాండ్-అలోన్' (ఇంటర్నెట్ లేనివి) అని, వన్-టైమ్ ప్రోగ్రామబుల్ (OTP) చిప్స్ కలిగి ఉన్నాయని వాదిస్తున్నప్పటికీ, తయారీ దశలోనే (Hardware Trojan) లేదా మైక్రోకంట్రోలర్ లెవెల్‌లో మార్పులు చేయడం అసాధ్యమేమీ కాదని సైబర్ నిపుణులు నిరూపిస్తున్నారు. గతంలో ఢిల్లీ అసెంబ్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రదర్శించిన డమ్మీ మిషన్ మోడల్... సాఫ్ట్‌వేర్ కోడింగ్ ద్వారా ఓట్ల తీరును మార్చవచ్చనే భయాన్ని ప్రజల్లో బలంగా నాటింది.

**మనం అంతర్జాతీయ ఎన్నికల విధానాలను పరిశీలించాలి:**

**అమెరికా విధానం:** అమెరికా వంటి సాంకేతిక అగ్రరాజ్యం కూడా డిజిటల్ ఓటింగ్ యంత్రాలపై నమ్మకం లేక, 70% కంటే ఎక్కువ స్థానాల్లో "హ్యాండ్-మార్క్డ్ పేపర్ బ్యాలెట్" (Hand-Marked Paper Ballot) విధానాన్ని వాడుతోంది అక్కడ పౌరుడు చేత్తో కాగితంపై మార్క్ చేస్తాడు, దానిని ఆప్టికల్ స్కానర్ ద్వారా లెక్కిస్తారు . వివాదం వస్తే సరిచూడటానికి అసలైన పేపర్ రికార్డు భద్రంగా ఉంటుంది . యూరప్ దేశాలు: జర్మనీ, నెదర్లాండ్స్ వంటి దేశాలు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలలో పారదర్శకత లేదని భావించి, వాటిని పూర్తిగా నిషేధించి తిరిగి సాంప్రదాయ పేపర్ బ్యాలెట్‌కు మారాయి.

భారతదేశంలో కూడా ఓటరు నమ్మకాన్ని పునరుద్ధరించాలంటే కేవలం 326 ఆర్టికల్ పరిధిలోని ఈవీఎం లెక్కింపులకే పరిమితం కాకుండా, ఎవూూ కాగితపు రశీదులను 100% లెక్కించేలా చట్టపరమైన మార్పులు రావాలి. సాంకేతికత ఎంత పెరిగినా, అది పౌరుడి నమ్మకం కన్నా పెద్దది కాకూడదు.

**3. పౌరసత్వం (ఆర్టికల్ 5-11):**
**బ్యూరోక్రసీ చేతిలో పౌరుడి అస్తిత్వం**

భారత రాజ్యాంగంలోని 2వ భాగంలో ఉన్న ఆర్టికల్ 5 నుండి 11 వరకు పౌరసత్వాన్ని నిర్వచిస్తాయి. ఇటీవలి కాలంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జూూ (పౌరసత్వ సవరణ చట్టం) వంటి పరిణామాలు దేశంలో పౌరసత్వ గుర్తింపును ఒక పెద్ద వివాదాస్పద అంశంగా మార్చాయి.

ప్రస్తుత వ్యవస్థలో ఒక వ్యక్తి భారత పౌరుడా కాదా అని నిర్ణయించే విచక్షణాధికారాలు ఎవరి చేతుల్లో ఉన్నాయి? క్షేత్రస్థాయిలో ఉన్న తహశీల్దార్, ఆర్డీఓ, లేదా జిల్లా కలెక్టర్ల చేతుల్లో ఉన్నాయి. ఒక సాధారణ రెవెన్యూ అధికారి తన విచక్షణతో లేదా రాజకీయ ఒత్తిళ్లతో ఒక సామాన్య పౌరుడి అస్తిత్వాన్ని, పౌరసత్వాన్ని ప్రశ్నార్థకం చేయగలడు. ఆధార్ కార్డు, పాస్‌పోర్టు, రేషన్ కార్డు వంటి పౌర గుర్తింపు పత్రాల జారీ ప్రక్రియ అంతా వేర్వేరు బ్యూరోక్రాటిక్ విభాగాల కింద ముక్కలు ముక్కలుగా విడిపోయింది. ఒక ఐఏఎస్ అధికారి లేదా పరిపాలనా యంత్రాంగం యొక్క విచక్షణకు 140 కోట్ల భారత పౌరులు లొంగిపోయి బతకవలసి రావడం ప్రజాస్వామ్య నిరంకుశత్వానికి పరాకాష్ఠ. పౌరసత్వం అనేది ఒక వ్యక్తి జీవించే హక్కుతో ముడిపడిన అంశం కాబట్టి, దానిని పర్యవేక్షించే అధికారం కేవలం కార్యనిర్వాహక వర్గానికి కాకుండా, న్యాయమూర్తి స్థాయి అధికారాలు ఉన్న ఒక స్వతంత్ర సంస్థకు అప్పగించాలి.

**4. కేంద్ర ఎన్నికల సంఘం :**
**జవాబుదారీతనం లేని స్వతంత్రత**

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 కింద ఎన్నికల సంఘానికి కల్పించిన స్వతంత్రత... కాలక్రమేణా దానికి జవాబుదారీతనం లేకుండా చేసిందా అనే అనుమానం కలుగుతోంది. ఒకప్పుడు టి.ఎన్. శేషన్ (౧చీ ౧ావంష్ఖుఅ) ఐఏఎస్ గారి హయాంలో జరిగిన సంస్కరణల తర్వాత, ఏకసభ్య కమిషన్ కాస్తా ముగ్గురు సభ్యుల (ముగ్గురు ఐఏఎస్ అధికారులు) కమిషన్‌గా మారింది. కానీ, కేవలం సంఖ్యను ముగ్గురికి పెంచినంత మాత్రాన వ్యవస్థలో పారదర్శకత రాదు. ప్రస్తుత ఎన్నికల సంఘం పార్లమెంటుకు నేరుగా జవాబుదారీగా లేదు. ఎన్నికల నిర్వహణలో లోపాలు జరిగినా, ఓట్ల లెక్కింపులో లక్షల తేడాలు వచ్చినా... ఈ ముగ్గురు ఐఏఎస్ అధికారులను ప్రశ్నించే ప్రత్యక్ష అధికారం సామాన్య పౌరుడికి కానీ, చట్టసభలకు కానీ లేకుండా పోయింది. వారిని పదవి నుండి తొలగించాలంటే పార్లమెంటులో అత్యంత కఠినమైన 'ఇంపీచ్‌మెంట్' (దోషారోపణ తీర్మానం) జరగాలి. దీనివల్ల ఎన్నికల సంఘం ఒక నియంతృత్వ సంస్థగా మారే ప్రమాదం ఉంది.

సుప్రీంకోర్టులో 30 మందికి పైగా న్యాయమూర్తులు ఉండి రకరకాల బెంచ్‌లుగా కేసులను విచారించినట్లుగా, అంతటి అత్యున్నత ఎన్నికల సంస్థలో కూడా సభ్యుల సంఖ్యను భారీగా పెంచాలి. అందులో కేవలం రిటైర్డ్ ఐఏఎస్ అధికారులను మాత్రమే కాకుండా, న్యాయ నిపుణులను, సామాజిక శాస్త్రవేత్తలను భాగస్వామ్యం చేయాలి. ఎన్నికల సంఘం పార్లమెంటుకు మరియు దేశ పౌరులకు నేరుగా జవాబుదారీగా ఉండేలా రాజ్యాంగ సవరణ జరగాలి.

**5. విప్లవాత్మక ప్రతిపాదన:** జిల్లా స్థాయిలో 'మూడో స్తంభం'

ప్రస్తుతం జిల్లా పరిపాలన అంతా రెండు స్తంభాలపై నడుస్తోంది:

**జిల్లా కలెక్టర్:** పరిపాలన, రెవెన్యూ, భూమి రికార్డులు, సంక్షేమ పథకాలు.

**జిల్లా ఎస్పీ : శాంతిభద్రతలు, నేరాల అదుపు.**

ఎన్నికల సమయంలో ఇదే జిల్లా కలెక్టర్ "జిల్లా ఎన్నికల అధికారి" గా వ్యవహరిస్తారు. కలెక్టర్‌కు వందలాది పరిపాలనా బాధ్యతలు ఉండటం వల్ల, వారు ఎన్నికల నిర్వహణను పూర్తిగా కిందిస్థాయి సిబ్బందికి వదిలేస్తారు, ఇది అనేక అక్రమాలకు, లీకేజీలకు దారితీస్తోంది.



# మన పర్యావరణం భద్రమేనా?

ప్రపంచ పర్యావరణ దినోత్సవం ప్రతి సంవత్సరం జూన్ 5న జరుపుకుంటారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, ప్రకృతి వనరులను సంరక్షించడం, భవిష్యత్ తరాలకు సురక్షితమైన భూమిని అందించడం ఈ దినోత్సవం ప్రధాన లక్ష్యం. అయితే నేడు మనం ఎదుర్కొంటున్న పరిస్థితులను పరిశీలిస్తే, "మన పర్యావరణం నిజంగా భద్రమేనా?" అనే ప్రశ్న ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేస్తోంది. పర్యావరణం అంటే మన చుట్టూ ఉన్న భూమి, నీరు, గాలి, మొక్కలు, జంతువులు మరియు ఇతర జీవ, నిర్జీవ అంశాల సమాహారం. ఈ సహజ వ్యవస్థల సమతుల్యతపై మానవ జీవితం పూర్తిగా ఆధారపడి ఉంది. కానీ ఆధునిక అభివృద్ధి పేరుతో జరుగుతున్న అనేక కార్యకలాపాలు ప్రకృతి సమతుల్యతను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న ప్రధాన పర్యావరణ సమస్యల్లో కాలుష్యం, వాతావరణ మార్పులు, అటవీ నిర్మూలన, జీవవైవిధ్య క్షీణత, ప్లాస్టిక్ వ్యర్థాల పెరుగుదల మరియు ఓజోన్ పొర నష్టం ముఖ్యమైనవి. పరిశ్రమలు, వాహనాల నుంచి వెలువడే పొగ కారణంగా వాయు కాలుష్యం పెరిగి ఆరోగ్య సమస్యలు ఉధృతమవుతున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు నదులు, చెరువులు, సముద్రాలను కలుషితం చేస్తూ జలచరాల మనుగడకు ముప్పుగా మారాయి. అధిక రసాయన ఎరువుల వినియోగం నేల సారాన్ని తగ్గిస్తోంది.

అదే సమయంలో శిలాజ ఇంధనాల వినియోగం పెరగడం వల్ల గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాలు అధికమై భూమి వేడెక్కుతోంది. దీని ప్రభావంగా అకాల వర్షాలు, తీవ్ర ఉష్ణోగ్రతలు, కరువులు, వరదలు, తుఫానులు తరచుగా సంభవిస్తున్నాయి. అడవుల నరికివేత వల్ల కార్బన్ డయాక్సైడ్ శాతం పెరిగి వాతావరణ మార్పులు మరింత వేగవంతమవుతున్నాయి. అనేక జాతుల మొక్కలు, జంతువులు తమ ఆవాసాలను కోల్పోయి అంతరించిపోతున్నాయి.

యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రామ్ విడుదల చేసిన గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్ అవుట్‌లుక్-7 నివేదిక కూడా భవిష్యత్తుపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో మార్పులు రాకపోతే 2050 నాటికి ప్రపంచం తీవ్రమైన పర్యావరణ సంక్షోభాన్ని ఎదుర్కొనే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఉష్ణోగ్రతల పెరుగుదల, జీవవైవిధ్య నష్టం, నీటి కొరత, కాలుష్య సమస్యలు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని నివేదిక స్పష్టం చేసింది.ఇంతటి ప్రమాదకర పరిస్థితుల్లో ఐక్యరాజ్య సమితి పర్యావరణ శాఖ ప్రపంచ పర్యావరణ దినోత్సవం 2026 కు ఒక థీమ్ నిర్ధారించింది అదే : "ప్రకృతి ప్రేరణ. వాతావరణం కోసం. మన భవిష్యత్తు కోసం."ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం నేతృత్వంలో ప్రతి సంవత్సరం జూన్ 5 న ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఈ సంవత్సరం (2026) దీనికి సంబంధించిన ప్రపంచ స్థాయి కార్యక్రమాలకు అజర్‌బైజాన్ ఆతిథ్యం ఇస్తోంది. పర్యావరణ మార్పులు, జీవవైవిధ్య నష్టం మరియు కాలుష్య నియంత్రణపై ఈ థీమ్ ప్రధానంగా దృష్టి పెడుతుంది. ఈ పరిస్థితుల్లో పర్యావరణ పరిరక్షణను కేవలం ప్రభుత్వాల బాధ్యతగా చూడలేం. ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలి. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, మొక్కలు నాటడం, నీరు మరియు విద్యుత్‌ను పొదుపుగా వినియోగించడం, ప్రజా రవాణాను ప్రోత్సహించడం, తడి-పొడి చెత్తను వేరు చేసి సరైన వ్యర్థ నిర్వహణ చేపట్టడం వంటి చర్యలు ప్రతి ఇంటి నుంచే ప్రారంభం కావాలి. పర్యావరణ సమతుల్యత దెబ్బతింటే మానవ మనుగడే ప్రశ్నార్థకమవుతుంది. అందుకే అభివృద్ధి మరియు ప్రకృతి పరిరక్షణ మధ్య సమతుల్యత సాధించడం నేటి అత్యవసర అవసరం. ప్రపంచ పర్యావరణ దినోత్సవం-2026 సందర్భంగా ప్రతి ఒక్కరూ ప్రకృతి సంరక్షణకు అంకితభావంతో ముందుకు రావాలి. మనం ఈ రోజు తీసుకునే నిర్ణయాలే రేపటి భూమి భవిష్యత్తును నిర్ణయిస్తాయి."పర్యావరణాన్ని రక్షిద్దాం - భవిష్యత్తును భద్రపరుద్దాం. ఈ రోజు ఒక మొక్క నాటుదాం - రేపటి తరాలకు జీవాన్ని అందిద్దాం."



వ్యాసకర్త బి.ప్రభాకర్ రెడ్డి,
టీ బీ ఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్షులు, జయశంకర్ భూపాలపల్లి
7569975383

## ధాన్యం కొనుగోలు చేయాలంటూ రోడ్డెక్కిన రైతులు

- రహదారిపై బైఠాయించి ధర్నా, రాస్తారోకో



**హత్నూర, జూన్ 4 (జనం సాక్షి) :** పదిమందికి అన్నం పెట్టే రైతన్న అన్నమో రామచంద్ర అంటూ గుండెలు బాదుకుంటున్నాడు.పుట్టెడు బాధను కడుపులో దాచుకుని బిక్కుబిక్కుమంటూ దిక్కులు చూస్తున్నారు.తాము పండించిన పంట ఇంకా కళ్ళాల్లోనే మూలుగుతుండటం చూసి ఆ రైతు కళ్ళల్లో కన్నీటి సుడులు తిరుగుతున్నాయి.పాలకులు చెప్పినా, అధికారులు వచ్చినా ధాన్యం కుప్పలు మాత్రం కల్లాల్లో నుంచి కదలక పోవడంతో రైతుల ఆగ్రహం కట్టలు తెంచుకుని కదం తొక్కింది.పాలకుల వైఫల్యం, అధికారుల నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ మూకుమ్మడిగా రోడ్డుపై బైఠాయించి ధర్నా రస్తారోకో నిర్వహించారు.ఈ సంఘటన హత్నూర మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం చోటుచేసుకుంది.జోగిపేట - హత్నూర ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళనకు దిగారు.వర్షాలకు ధాన్యం తడిసి మొలకెత్తినా అధికారుల్లో చలనం లేదని వారు మండిపడ్డారు.పాలకులు ఆదేశించడం అధికారులు సందర్శించడం తప్పా కొనుగోలు ప్రక్రియలో ఏ మాత్రం వేగం కనిపించడం లేదని వారు వాపోయారు.ఖరీఫ్ పంట సాగుకు దుక్కి దున్ని, నారు పోయాల్సిన రైతులు రోడ్లమీద బైఠాయించి రోదించే పరిస్థితి దాపురించిందని వారన్నారు.

# ఉప్పల్ అభివృద్ధే లక్ష్యం

**ఉప్పల్, జూన్ 4 (జనం సాక్షి) :** ఉప్పల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి మరోసారి ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుకొచ్చారు. ఉప్పల్, హబ్సిగూడ, రామంతాపూర్, చిలుకానగర్‌తో పాటు నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీల్లో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే చేపట్టి, అవసరమైన నిధులను మంజూరు చేయాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని కలిసి కోరారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు కమిషనర్‌ను కలిసిన పరమేశ్వర్ రెడ్డి, నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉప్పల్ నియోజకవర్గం వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతమైనప్పటికీ అనేక కాలనీల్లో ఇప్పటికీ కనీస మౌలిక వసతుల కొరత ఉందన్నారు. ముఖ్యంగా ఉప్పల్, హబ్సిగూడ, రామంతాపూర్, చిలుకానగర్ ప్రాంతాల్లో పలు రహదారులు దెబ్బతిన్నాయని, వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తాగునీటి సమస్యలు, వర్షపు నీటి నిల్వలు, డ్రైనేజీ వ్యవస్థ లోపాలు, కమ్యూనిటీ హాల్స్ లేకపోవడం వంటి సమస్యలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గంలోని అనేక కాలనీల్లో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, స్టార్మ్ వాటర్ డ్రైన్లు నిర్మించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వర్షాలు కురిసిన ప్రతిసారి రహదారులు దెబ్బతిని ప్రజలకు రాకపోకలు కష్టతరంగా మారుతున్నాయని వివరించారు. అనేక ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు ఉన్నప్పటికీ కమ్యూనిటీ హాల్స్ లేకపోవడం వల్ల సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ప్రత్యేకంగా కాప్రా సర్కిల్ పరిధిలోని పలు కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పార్కుల అభివృద్ధి, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం, నాలాలపై స్లాబ్‌లు ఏర్పాటు వంటి పనులను అత్యవసరంగా చేపట్టాలని కోరారు. ఈ పనులు పూర్తయితే వేలాది కుటుంబాలకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. ఉప్పల్, హబ్సిగూడ, రామంతాపూర్, చిలుకానగర్ ప్రాంతాలు హైదరాబాద్ నగర అభివృద్ధిలో కీలక ప్రాంతాలుగా మారుతున్నాయని, జనాభా పెరుగుతున్న నేపథ్యంలో మౌలిక వసతుల అభివృద్ధికి మరింత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రజల నుంచి వచ్చిన వినతులు, స్థానిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనుల జాబితాను సిద్ధం చేసి కమిషనర్‌కు



అందజేసినట్లు తెలిపారు. ముఖ్యంగా అంతర్గత రహదారులు, తాగునీటి పైపులైన్లు, వర్షపు నీటి కాలువలు, కమ్యూనిటీ హాల్స్, పార్కుల అభివృద్ధి, నాలాల మరమ్మతులు వంటి పనులకు తక్షణమే నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ప్రతిపాదనలను పరిశీలించి సంబంధిత శాఖలతో చర్చించి సాధ్యమైనంత త్వరగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో కాప్రా మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి, అంజి రెడ్డి, హెచ్.ఆర్. మోహన్, కాప్రా సాయి గౌడ్, విఠల్ నాయక్, ఉపేందర్ రెడ్డి, మహేష్ యాదవ్, నూతులకంటి రాజు తదితరులు పాల్గొన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలోని ఉప్పల్, హబ్సిగూడ, రామంతాపూర్, చిలుకానగర్ ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు త్వరలోనే నిధులు మంజూరై పనులు ప్రారంభమవుతాయని స్థానిక ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడితే నియోజకవర్గ రూపురేఖలు పూర్తిగా మారుతాయని అభిప్రాయపడుతున్నారు.

# అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

- రూ.82 లక్షల విలువైన బంగారం, వెండి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన మల్కాజిగిరి డీసీపీ శ్రీధర్

**సికింద్రాబాద్, జూన్ 4 (జనం సాక్షి) :** సికింద్రాబాద్ మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు అంతర్రాష్ట్ర దొంగను పట్టుకున్నారు. గోవాకు పారిపోయిన దొంగను అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుండి రూ. 82 లక్షల విలువైన బంగారు,వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు మల్కాజిగిరి డిసిపి శ్రీధర్ గురువారం మీడియా కు వివరాలు వెల్లడించారు. గత నెల27 రాత్రి సుమారు 9గంటల సమయంలో సికింద్రాబాద్ పాట్ మార్కెట్ లోని శ్రీ సాయి బులియన్ జ్యువెలరీ షాప్ ఉద్యోగి సందీప్ రఘునాథ్ చవాన్ (29) ఇంట్లో ఎవరూ లేనిసమయం చూసి ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లోని చెక్కపెట్టెలో దాచిన బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేశారు.బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మార్కెట్ పోలీసులు దర్యా ప్తు చేపట్టారు. దర్యాప్తులో సుమారు 576 గ్రాముల బంగారు ఆభరణాలు, స్వచ్ఛమైన బంగారం , 900 గ్రాముల వెండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించారు. వీటి మొత్తం విలువ సుమారు రూ.82 లక్షలు గా నిర్ధారించారు.

### గోవాలో పట్టుబడ్డ నిందితుడు



కేసు తీవ్రత దృష్ట్యా ఉన్నతాధికారుల అనుమతితో వెంటనే ఒక ప్రత్యేక పోలీస్ బృందాన్ని ఏర్పాటు చేశారు. సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుడు గోవాలో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు జూన్ 1వ తేదీ సాయంత్రం 5 గంటల సమయంలో నార్త్ గోవాలోని కలంగుట్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో నిందితుడు ఢిల్లీలోని బురారి, భగత్ కాలనీకి చెందిన మనోజ్ సింగ్ (28) గా గుర్తించారు. అతని వద్ద నుండి దొంగిలించబడిన రూ. 82 లక్షల విలువైన పూర్తి రికవరీని పోలీసులు స్వాధీనం చేసుకున్నా రు.

### పాత నేరస్థుడే..

నిందితుడు మనోజ్ సింగ్ ఇళ్లలో చోరీలకు పాల్పడే అంతర్రాష్ట్ర దొంగగా పోలీసులు తెలిపారు. జల్సాల కోసం ఇళ్లల్లో దొంగతనాలు చేసి చోరీ సొత్తును స్వీకరించి వచ్చిన డబ్బులతో దేశంలోని వివిధ రాష్ట్రాల్లో తిరగడం అవకాశం ఉంటే ఆయా ప్రాంతాల్లో చోరీలు చేయడం అలవాటుగా మార్చుకున్నాడు. ఇదే క్రమంలో గోవా,భూపాల్, ముంబై వంటి సిటీలలో పర్యటించిన సమయంలో చోరీలకు విఫల యత్నం చేశాడు. ఇదే క్రమంలో ఢిల్లీ నుంచి నేరుగా గత 26న నగరంలోని ఎస్సార్ నగర్ కు చేరుకున్నాడు. ఎస్సార్ నగర్ లోని పలు కాలనీలో పర్యటించి చోరీ చేసేందుకు రెక్కీ నిర్వహించిన మనోజ్ సింగ్ అక్కడ చోరీ చేసేందుకు పరిస్థితులు అనుకూలించక పోవడంతో అక్కడ నుంచి నేరుగా సికింద్రాబాద్ చేరుకున్నాడు. సికిందరాబాద్ మోండా పాట్ మార్కె ట్ ప్రాంతంలోని సందీప్ రఘునాథ్ చౌహన్ ఇంటికి వెళ్లి తాళంవేసి ఉండటాన్ని గుర్తించాడు. ఇంట్లోకి చొరబడి ఇంట్లోని చెక్క పెట్టెలో దాచిన బంగారు వెండి ఆభరణాలు దొంగిలించి ఇక్కడి నుంచి నేరుగా గోవాకు పారిపోయాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మనోహర్ సింగ్ గోవాలో ఉన్నట్లు గుర్తించి, పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గోవాకు వెళ్లి అదుపులోకి తీసుకొని నగరానికి తీసుకొచ్చారు. మనోజ్ సింగ్ చోరీ చేసిన సుమారు రూ.82 లక్షల విలువ చేసే బంగారు వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు అతన్ని రిమాండ్ కు తరలించారు .కాగా ఇతనిపై గతం లో ఢిల్లీలో 19 బంగారు, వెండి చోరీ కేసులు ఉన్నాయి. పలు కేసుల్లో ఇతనిపై నాన్-బైలబుల్ వారంట్లు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. గతంలో ఇతను ఏడు క్రిమినల్ కేసుల్లో ఢిల్లీలోని తీహార్ జైలులో శిక్ష అనుభవించాడు. నిందితుడి అరెస్ట్ సమాచారాన్ని తదుపరి చర్యల నిమిత్తం ఢిల్లీ పోలీసులకు కూడా చేరవేసినట్లు డీసీపి శ్రీధర్ తెలిపారు. ఈ సమావేశంలో మల్కాజ్గిరి ఏసిపి యాదగిరి రెడ్డి, మార్కెట్ ఇన్స్పెక్టర్ రామచందర్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.ఎమ్. బషీర్ అహ్మద్‌ఆ పాల్గొన్నారు.

## స్వచ్ఛ గ్రామాల నిర్మాణానికి సమష్టి కృషి అవసరం




**చేవెళ్ల, జూన్ 4 (జనంసాక్షి) :** గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని చేవెళ్ల తహసీల్దార్ బి. కృష్ణయ్య అన్నారు. స్వచ్ఛ గ్రామీణ్ 2.0 కార్యక్రమంలో భాగంగా చేవెళ్ల మండలంలోని అంతారం గ్రామపంచాయతీ ఆవరణలో ఘన వ్యర్థాల నిర్వహణపై నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు ప్రతి గ్రామంలో శాస్త్రీయ పద్ధతిలో వ్యర్థాల నిర్వహణ చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దడంతో పాటు మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించి పచ్చదనాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు. చెత్తరహిత-స్వచ్ఛ గ్రామంగా అంతారాన్ని అభివృద్ధి చేసేందుకు గ్రామసభలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జుట్టు రామస్వామి, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, ఉప సర్పంచ్ వెంకటేష్, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రాధాన్యం

**నారాయణపేట, జూన్ 4 (జనం సాక్షి) :** నారాయణపేట మున్సిపాలిటీ పరిధిలోని 14 వ వార్డు లో రేష్మాబేగం మహమ్మద్ జాఫర్ తాజ్ యొక్క నిర్మాణం పూర్తిచేసుకున్న ఇందిరమ్మ ఇంటిని గురువారం పేట మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి,వార్డు కౌన్సిలర్ యల్.అరుణ మనో హర్ గౌడ్, మున్సిపల్ కమిష నర్ శంకర్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, కౌన్సిలర్ అరుణ మనోహర్ గౌడ్‌లు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ముఖ్యమం త్రి.రేవంత్ రెడ్డి నాయక త్వంలో రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిరుపేద కుటుంబాల సొంతింటి కల సాకారమవుతోందని పేర్కొ న్నారు.స్థానిక ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణిక రెడ్డి, కుంభం.శివకుమార్ రెడ్డి ప్రత్యేక చొరవతో 14వ వార్డు కు మొత్తం 20 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని, అందులో ఇప్పటికే 16 ఇండ్ల నిర్మాణం పూర్తై లబ్ధిదారు లకు అందుబాటులోకి వచ్చా యని తెలిపారు. మిగిలిన ఇండ్లు కూడా వేగంగా నిర్మా ణం జరుగుతున్నాయని చెప్పారు.ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణిక రెడ్డి నారాయణపేట పట్టణ



అభివృద్ధి,మౌలిక సదుపాయాల కల్పన, పేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని కొనియా డారు.అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మనోహర్ గౌడ్,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుఎండి.సలీం,కాంగ్రెస్ జిల్లా మైనార్టీ సెల్ అధ్య క్షులు మహిమూద్ ఖురేషి, సీనియర్ నాయకులు భీంచందర్ గౌడ్,మాజీ కౌన్సిలర్ రమేష్,పళ్ళ అనిల్,యూసుఫ్ తాజ్,వెంకటేష్ గౌడ్, ఎరుకలి వెంకటయ్య, జబ్బార్,స్థానిక కాంగ్రెస్ నాయకులు, వార్డు ప్రజాప్రతినిధులు, లబ్ధి దారులు, ప్రజలు తది తరులు పాల్గొన్నారు.

## సూడాన్ దేశస్తుడికి ఎబోలా అనుమానం

### గాంధీ ఆసుపత్రిలో ఐసోలేషన్‌లో చికిత్స

సికింద్రాబాద్, జూన్ 4 (జనంసాక్షి) : సూడాన్ నుంచి హైదరాబాద్ శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న ఓ విదేశీయుడిలో ఎబోలా వైరస్‌కు సంబంధించిన లక్షణాలు కనిపించడంతో వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. సూడాన్‌కు చెందిన మహ్మద్ అనే వ్యక్తిని గాంధీ ఆసుపత్రికి తరలించి ప్రత్యేక ఐసోలేషన్ వార్డులో చికిత్స అందిస్తున్నారు. వైద్యులు అతడి రక్త నమూనాలను సేకరించి హైదరాబాద్‌లోని హబ్సిగూడలో ఉన్న సీసీఎంబీ (సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ) ప్రయోగశాలకు పరీక్షల నిమిత్తం పంపించారు.. ప్రాథమిక పరీక్షల ఫలితాల ఆధారంగా అవసరమైతే మరింత నిర్ధారణ కోసం నమూనాలను పుణెలోని జాతీయ స్థాయి వైరాలజీ ప్రయోగశాలకు పంపించే అవకాశమున్నట్లు సమాచారం. ప్రస్తుతం రోగి ఆరోగ్య పరిస్థితిని వైద్యులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఎబోలా అనుమానిత కేసుగా భావించి అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. కాగా, పరీక్షల ఫలితాలు వచ్చిన తర్వాతే వైరస్ సోకిందా లేదా అనే అంశంపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. ఆరోగ్య శాఖ అధికారులు పరిస్థితిని నిశితంగా గమనిస్తూ అవసరమైన నివారణ చర్యలు చేపడుతున్నారు.

## కోకట్‌వాగులో జరిగిన ప్రమాదం

### చాలా బాధాకరం



**తాండూరు, జూన్ 4 (జనంసాక్షి) :** కొకట్ వాగులో ప్రమాదవశాత్తు జరిగిన ప్రమాదంలో పాత తాండూరుకు చెందిన ఒకే కుటుంబంలో ముగ్గురు మరణించిన విషాద వార్త తెలుసుకొని ఆర్బిఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి చేరుకొని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఒకే కుటుంబంలో ప్రమాదంలో పాత తాండూరుకు చెందిన 28ఏళ్ల ఆటో డ్రైవర్ మొయిజుద్దీన్, వారి బంధువు కోహిర్ మండలం బసంత్ పూర్ చెందిన 26ఏళ్ల రహ్మత్ లు చనిపోవడం చాలా బాధాకరమని, అలాగే ఈ సంఘటన గురించి తెలిసి మనోవేదనకు గురై వారి బంధువు సాజిద్ గుండెపోటుతో చనిపోవడం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియచేసారు.

# రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జూన్ 4 (జనంసాక్షి) :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం ఇబ్రహీంపట్నం మండలం కర్ణంగూడ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని గ్రామస్థులతో నేరుగా మమేకమయ్యారు. గ్రామాభివృద్ధి, వ్యవసాయం, పారిశుద్ధ్యం, విద్య, మౌలిక సదుపాయాలు, ఓటరు జాబితా పునర్విమర్శ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. వర్షాలు ఆలస్యంగా ప్రారంభమయ్యే పరిస్థితులు ఉన్నందున రైతులు వ్యవసాయ శాఖ సూచనల మేరకు పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. అధిక నీటి అవసరమున్న వరి సాగుపై జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవాలని పేర్కొన్నారు. వర్షాకాలంలో నీటి కాలుష్యం, దోమల వ్యాప్తి, అంటువ్యాధుల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. చెత్తాచెదారం పేరుకుపోకుండా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, ప్రతి కుటుంబం ఆరోగ్య రక్షణకు సహకరించాలని కోరారు. వర్షాలు ప్రారంభమైన వెంటనే గ్రామంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని, ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను సంరక్షించే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని తెలిపారు.ప్రతి ఇంటిలో తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని సూచించిన కలెక్టర్, తడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారు చేయవచ్చని, పొడి చెత్తను రీసైక్లింగ్ ద్వారా తిరిగి వినియోగించవచ్చని తెలిపారు. గ్రామస్థుల అభ్యర్థన మేరకు చెత్త సేకరణ డబ్బాలను అందజేస్తామని, వాటిని సక్రమంగా



వినియోగించి జిల్లాకు ఆదర్శంగా నిలవాలని కోరారు. నెల రోజుల తర్వాత గ్రామంలోని ఘన వ్యర్థాల నిర్వహణ పరిస్థితిని పరిశీలిస్తామని స్పష్టం చేశారు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంపోస్ట్ యూనిట్‌ను పూర్తి స్థాయిలో వినియోగించి సేంద్రియ వ్యర్థాలను ఎరువుగా మార్చాలని సంబంధిత అధికారులకు సూచించారు రైతులకు ఎరువుల పంపిణీ ప్రక్రియను మరింత పారదర్శకంగా, సులభతరంగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం మునుగోడు నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టును అమలు చేస్తోందని అధికారులు వివరించారు. యూరియా, డీఏపీ తదితర ఎరువులను ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా మాత్రమే అందజేయనున్నట్లు తెలిపారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్‌కు యాప్‌ను అనుసంధానం చేసినందున రైతులు తప్పనిసరిగా నమోదు పూర్తి చేసుకోవాలని సూచించారు. భూమి విస్తీర్ణం, సాగు చేస్తున్న పంటల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని, తప్పుడు వివరాలు నమోదు చేస్తే ఎరువుల కేటాయింపులో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టనున్న ప్రత్యేక ఓటరు జాబితా పునర్విమర్శ కార్యక్రమంలో ప్రతి అర్హుడి పేరు నమోదు అయ్యేలా ప్రజలు సహకరించాలని కలెక్టర్ కోరారు. అవసరమైన ధ్రువపత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. కర్ణంగూడ ప్రభుత్వ పాఠశాల పునఃప్రారంభానికి గ్రామస్థులు ముందుకు రావాలి గ్రామంలో మూతపడిన ప్రాథమిక పాఠశాలను తిరిగి ప్రారంభించేందుకు గ్రామస్థులు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. చిన్నారులను దూర ప్రాంతాలకు పంపకుండా గ్రామంలోనే విద్య అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు, అల్పాహారం, మధ్యాహ్న భోజనం తదితర సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. డీసీపీ నారాయణ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో పెరుగుతున్న వాహనాల సంఖ్యకు అనుగుణంగా ప్రజలు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. తాగి వాహనం నడపడం, ట్రిపుల్ రైడింగ్ వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా కుటుంబ పోషకులు ప్రాణాలు కోల్పోతున్నారని, కుటుంబ సభ్యులు భద్రతా నిబంధనలు పాటించేలా చూసుకోవాలని కోరారు. యువతలో మాదకద్రవ్యాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల వినియోగం గమనిస్తే వెంటనే డయల్-100 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తిరుమలరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ మోహన్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సురేష్, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ పెద్దలు, మహిళలు, రైతులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## గ్రామీణ పట్టణాల పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి




**చేవెళ్ల, జూన్ 4 (జనంసాక్షి) :** గ్రామీణ, పట్టణాల అభివృద్ధి పర్యావరణ పరిక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణ రెడ్డి తెలిపారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని ఊరెళ్ల, మొండివాగు, దేవుని ఎర్రవల్లి వార్డుల్లో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాలు, పట్టణాలు అభివృద్ధిలో సహకరించాలన్నారు. అంతకు ముందు చేవెళ్ల మున్సిపల్ చైర్పర్సన్ సమతావెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో జల సరంక్షణ-మన సంరక్షణ, మొక్కల పెంపకం ద్వారా వన మహోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ప్రజల భద్రత వంటి అంశాలపై చర్చించడం జరిగిందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ ప్రత్యేకాధికారిణి జె.పద్మావతి, చేవెళ్ల మున్సిపల్ కమిషనర్ బి.యాదగిరి, చేవెళ్ల సొసైటీ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ రాము గౌడ్, కౌన్సిలర్లు దూత మల్లేష్, కరికే మీనాక్షి సత్యనారాయణ, డప్పు సువర్ణ, మాజీ ఎంపీటీసీ చంద్రయ్య, మాజీ సర్పంచ్ సామ మాణిక్యరెడ్డి, టేకులపల్లి శ్రీనివాస్, వార్డు ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, ఆయాశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
05 జూన్ 2026

# మంగంపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా

- ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి



**వనపర్తి బ్యూరో, జూన్ 4 (జనంసాక్షి) :** పెద్దమందడి మండలం మంగంపల్లి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి జిల్లాలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి పేర్కొన్నారు.గురువారం పెద్దమందడి మండలం మంగంపల్లి గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా ప్రత్యేక గ్రామ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తో పాటు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులు రోడ్డు భద్రత, బాల్యవివాహాల నిర్మూలన, వర్షాకాలం నేపథ్యంలో ఇంకుడు గుంతల ఏర్పాటు, పరిసరాల పరిశుభ్రత, వన మహోత్సవం, జల సంరక్షణ, పాఠశాలల్లో సౌకర్యాలు సహా తదితరాంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించి ప్రజల మెప్పు పొందుతుందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళలందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పైనే సీఎం తొలి సంతకం చేశారని గుర్తు చేశారు. కేవలం వనపర్తి నియోజకవర్గం లోని మహిళల ఉచిత బస్సు ప్రయాణం కోసం 30 కోట్ల రూపాయలు ప్రభుత్వం చెల్లించిందని తెలిపారు. ప్రజల ఆరోగ్య భద్రత కోసం ఐదు లక్షల రూపాయలు ఉన్న ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రజా ప్రభుత్వం 10 లక్షల రూపాయలకు పెంచిందన్నారు. పేద ప్రజలు విద్యుత్ భారం ఇబ్బందులు పడకుండా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తుందన్నారు. అదేవిధంగా రైతులకు రైతు భరోసాతో పాటు రెండు లక్షల రుణమాఫీని చేసి అండగా నిలుస్తుంది అని తెలిపారు. ప్రజా ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేసి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తుందని తెలిపారు. కాబట్టి ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలన్నారు. తన సొంత గ్రామమైన మంగంపల్లిని ఇందిరమ్మ ఇండ్ల పథకానికి పైలట్ గ్రామంగా ఎంపిక చేసి ఇండ్ల నిర్మాణం చేయడం జరుగుతుందని తెలిపారు. మంగంపల్లి గ్రామంలో ఒక్క పూరిగుడిస కూడా లేకుండా అన్ని పక్క ఇండ్లే ఉండే విధంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికే నూతన గ్రామపంచాయతీ, అంగన్వాడీ భవనాలతో పాటు సిసి రోడ్లు డ్రైనేజీలను కూడా పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. గ్రామాన్ని ఇంకా అభివృద్ధి చేయడం కోసం తన వంతుగా రూ. 10 లక్షలు కేటాయిస్తానని, జిల్లా కలెక్టర్ ద్వారా మరో రూ.10 లక్షలు తెప్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.మంగంపల్లి గ్రామంలోని ప్రతి ఇంటికి సి ఎస్ ఆర్ నిధులతో సోలార్ ఏర్పాటు చేయించేందుకు కృషి చేస్తానని తెలిపారు. గ్రామంలో ఇప్పటికే సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించడం జరిగిందని తెలిపారు. గ్రామంలోని ప్రతి ఒక్కరు ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. గ్రామంలో ఏ కార్యం జరిగిన ఐదు మొక్కలు నాటే పద్ధతిని ప్రారంభించాలని తద్వారా మన గ్రామాన్ని మోడల్ గా తీర్చిదిద్దేందుకు అడుగులు పడాలని సూచించారు. రైతులు కూడా కేవలం వరి మాత్రమే కాకుండా పంట మార్పిడి పద్ధతిని అవలంబించాలని సూచించారు. పామాయిల్ వంటి తోటలను పెట్టేందుకు మొగ్గు చూపాలన్నారు. మహిళలు కూడా ఏదైనా వ్యాపారం చేసేందుకు ముందుకు వస్తే రుణ సదుపాయాన్ని కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా నేడు నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో మంగంపల్లి గ్రామ సర్పంచ్ తో పాటు వార్డు సభ్యులందరూ ఉపాధి హామీ కింద ఇంకుడు గుంతలు తీసుకుంటామని తెలియజేయడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. మంచి నిర్ణయం తీసుకున్న గ్రామ పాలకవర్గాన్ని అభినందిస్తున్నానని తెలిపారు. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా గ్రామంలో భూగర్భ జలాలు పెరిగి మంచినీటి సదుపాయాలు కలుగుతాయి అన్నారు. అదేవిధంగా గ్రామంలో గత ఐదేళ్ల వ్యవధిలో 18 ఏళ్ల నుండి 50 ఏళ్లలోపు వ్యక్తులు ఎవరైనా మరణిస్తే జాతీయ కుటుంబ ప్రయోజన పథకం ద్వారా దరఖాస్తు చేసుకొని రూ. 20 వేల లబ్ధి పొందవచ్చని తెలిపారు.ప్రభుత్వం అర్హులైన ఓటర్లందరినీ జాబితాలో చేర్చేందుకు ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ కార్యక్రమం నిర్వహిస్తుందని ఇందులో ప్రతి ఒక్కరూ పాల్గొని అధికారులకు సహకరించాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు ఉన్నాయని కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి చదివించాలని సూచించారు. అమ్మాయిలకు బాల్యవివాహాలు చేయకుండా ఉన్నత చదువులు చదివించాలని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు మంచి ఫలితాలు వచ్చాయని కాబట్టి ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథుల చేతుల మీదుగా ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమేష్, ఎంపీడీవో పరిణత, ఎస్సై జలంధర్ రెడ్డి, వార్డు సభ్యులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, మండల అధ్యక్షులు, ప్రజలు, ఇతర అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రం నిధులతోనే అభివృద్ధి

- తెలంగాణలో బిజెపి గెలుపే లక్ష్యంగా పని చేయాలి
- ఎమ్మెల్సీ అంజిరెడ్డి




**నారాయణపేట, జూన్ 4 (జనం సాక్షి) :** రాబోయే ఎన్నికల్లో తెలంగాణ లో బిజెపి అధికారమే లక్ష్యంగా పని చేయాలని ఎమ్మెల్సీ అంజిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం నారాయణపేటలో రెండు రోజులపాటు జరిగే దీన దయాళ్ కార్యకర్తల ప్రశిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.జాతీయ నాయకులు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ,దీన దయాళ్ ,అటల్ బిహారీ వాజ్ పేయి,ఎల్ కే అద్వానీ నేటి ప్రధాని నరేంద్ర మోడీ,అమిత్ షా స్ఫూర్తితో కార్యకర్తలు పార్టీ కోసం ఓడినా గెలిచినా పని చేయాలన్నారు.ఒకప్పుడు బిజెపి ఎక్కడ అన్నవారు వారు ఇప్పుడు ఎక్కడో వారికి అర్థం అయిందని అన్నారు.కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకు అందేలా కృషి చేయాలని కోరారు.నరేంద్రమోడీ ప్రధాని అయ్యాక దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ విశ్వగురుగా ఎదుగుతున్నదని అన్నారు. దీనికంతటికీ కార్యకర్తల పట్టుదల కృషి కారణమన్నారు. నేడు దేశవ్యాప్తంగా ప్రజలు డబుల్ ఇంజన్ సర్కార్‌ను కోరుకుంటూ వివిధ రాష్ట్రాల్లో బిజెపినీ గెలిపిస్తున్నారని అన్నారు. అందుకు తాజా ఉదాహరణ పశ్చిమ బెంగాల్,అస్సాం,పుదుచ్చేరి ప్రజలు ఇచ్చిన తీర్పే నిద ర్శనం అన్నారు.రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కేంద్రం నిధులతోనే నని అన్నారు.కార్యకర్తలు క్రమశిక్షణతో పనిచేసి కేంద్రం చేస్తున్న అభివృద్ధిని వివరించి తెలంగాణలోనూ డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పాటుకు కట్టుబడి కృషి చేయాలని కోరారు.ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర నాయకులు నాగురావు నామాజీ ,కే.రతంగ్ పాండురెడ్డి,బి.కొండయ్య,ప్రదీప్ ,బిజెపి జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్,మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేత సత్యయాదవ్,వైఎస్ చైర్ పర్సన్ మంజుల జి ఆర్ రెడ్డి,కాన్సిలర్లు,మండల నాయకులు,ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# వైద్య సేవలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



**సంగారెడ్డి, జూన్ 4 (జనం సాక్షి) :** వైద్య సేవలో ప్రభుత్వ ఉద్యోగులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యాధికారి డాక్టర్ లలితాదేవి హెచ్చరించారు. గురువారం మునిపల్లి మరియు కంకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను డి ఎం హెచ్ ఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది విధులకు సమయానికి హాజరవుతున్నారా లేదా అనే అంశాన్ని అటెండెన్స్ రిజిస్టర్లను పరిశీలించి, సిబ్బందితో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని వివిధ విభాగాలను సందర్శించి పరిశీలించారు. ఆయా ఆరోగ్య కేంద్రాలను అందుబాటులో ఉన్న మందుల నిల్వలను తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో, గడువు ముగిసిన (ఎక్స్‌పైరీ) మందులు ఎట్టి పరిస్థితుల్లోనూ నిల్వ ఉంచరాదని ఆదేశించారు. రోగులకు అవసరమైన మందులను ఉచితంగా, సకాలంలో అందించాలని, వైద్య సేవల విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైద్యులు సిబ్బంది సమయం పాలనపాటించాలని స్పష్టం చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆమె పేర్కొన్నారు. అధికారులు అందరూ క్షేత్రస్థాయిలో ఉండి ప్రజలకు ఆరోగ్య సేవలు అందించి వైద్య ఆరోగ్య శాఖకు మంచి పేరు తేవాలని కోరారు.

## అణిచివేతతో ఉద్యమాలను ఆపలేరు



**అయిజ, జూన్ 4 (జనంసాక్షి) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గద్వాల జిల్లా పర్యటన సందర్భంగా, పార్టీ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. పట్టణ కేంద్రంలో విద్యార్థి నాయకుల అక్రమ అరెస్టులను ఏబీవీపీ తీవ్రంగా ఖండించింది. విద్యార్థి సమస్యలపై పోరాడుతున్న నేతలను అర్ధరాత్రి వేళ ఇళ్లలోకి చొరబడి అరెస్టు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని, విద్యాశాఖలోని సమస్యలను, నిరుద్యోగాన్ని పరిష్కరించలేక, ప్రశ్నించే గొంతులను పోలీసుల ద్వారా నొక్కేయాలని చూడటం ప్రజాస్వామ్య విరుద్ధమని నాయకులు అన్నారు. బిఆర్ఎస్ నాయకులు నాగర్ దొడ్డి వెంకట రాములు, తదితర పార్టీ నాయకులను అరెస్టు చేయడంపై బిఆర్ఎస్ పార్టీ ఖండించింది. ప్రభుత్వ నిర్బంధాలకు విద్యార్థి లోకం భయపడదని. విద్యార్థుల హక్కుల కోసం మా పోరాటం ఆగదు, అణిచివేసే కొద్దీ ఉద్యమం మరింత ఉధృతమవుతుందని ఏబీవీపీ విద్యార్థి నాయకులు అన్నారు. విద్యార్థు ల సమస్యలు పరిష్కరించేంతవరకు ఉద్యమాలు ఆపేదే లేదు. స్కాలర్షిప్ ఫీజు రీయంబర్స్మెంట్లను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యల కోసం ఎన్ని అక్రమ కేసులు పెట్టిన విద్యార్థి పరిషత్ కార్యకర్తలు భయపడే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

# ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడండి

- అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్



**వనపర్తి బ్యూరో, జూన్ 4 (జనంసాక్షి) :** మొక్కలు నాటడం, ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడాలని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్ పేర్కొన్నారు.గురువారం ఖిల్లా ఘనపూర్ మండలం పర్వతపురం రైతువేదికలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా ప్రత్యేక గ్రామ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులు రోడ్డు భద్రత, బాల్యవివాహాల నిర్మూలన, వర్షాకాలం నేపథ్యంలో ఇంకుడు గుంతల ఏర్పాటు, పరిసరాల పరిశుభ్రత, వన మహోత్సవం, జల సంరక్షణ, పాఠశాలల్లో సౌకర్యాలు సహా తదితరాంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు ఉన్నాయని కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి చదివించాలని సూచించారు. అమ్మాయిలకు బాల్యవివాహాలు చేయకుండా ఉన్నత చదువులు చదివించాలని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు మంచి ఫలితాలు వచ్చాయని కాబట్టి ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా గ్రామంలో భూగర్భ జలాలు పెరిగి మంచినీటి సదుపాయాలు కలుగుతాయి అన్నారు.ప్రభుత్వం అర్హులైన ఓటర్లందరినీ జాబితాలో చేర్చేందుకు ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ కార్యక్రమం నిర్వహిస్తుందని ఇందులో ప్రతి ఒక్కరూ పాల్గొని అధికారులకు సహకరించాలని సూచించారు. అదేవిధంగా గ్రామంలో గత ఐదేళ్ల వ్యవధిలో 18 ఏళ్ల నుండి 60 ఏళ్లలోపు వ్యక్తులు ఎవరైనా మరణిస్తే జాతీయ కుటుంబ ప్రయోజన పథకం ద్వారా దరఖాస్తు చేసుకొని రూ. 20 వేల లబ్ధి పొందవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి చేతుల మీదుగా ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్పీఓ రఘునాథ్, గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ స్థాయి సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనకు మొదటి ప్రాధాన్యత




**పెబ్బేరు, జూన్ 4 (జనం సాక్షి) :** ప్రజా పాలనా ప్రగతి ప్రణాళికలో భాగంగా వార్డుల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గురువారం పెబ్బేరు మున్సిపల్ పరిధిలోని 1,2,3 వార్డులలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలకు చైర్మన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వార్డు ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా పాలన ద్వారా ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందజేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తున్నామన్నారు. పట్టణ పరిధిలోని వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని, డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు తాగునీటి సమస్య తలెత్తకుండా శాశ్వతంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మున్సిపల్ సిబ్బందితో నిరంతరం పారిశుధ్య పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని, ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించేది లేదని స్పష్టం చేశారు. వార్డు ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి, కౌన్సిలర్లు కరుణశ్రీ సాయినాథ్,జములమ్మ, పర్వీన్ షకీల్, హరి శంకర్ నాయుడు, వైస్ చైర్మన్ విజయ వర్ధన్ రెడ్డి, స్థానిక ఎస్సై వెంకటేష్ గౌడ్, మున్సిపల్ మేనేజర్ గణేష్ బాబు, నాయకులు వెంకటరమణ, జగదీశ్వర్ రెడ్డి,రణధీర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, వినేయ్,సునీల్, ఉత్తమ్, జ్యోతి వార్డు అధికారులు మరియు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరూ పాటించాలి




**తూప్రాన్, జూన్ 4 (జనం సాక్షి) :** వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరు పాటించాలని చెత్తను చెత్త బార్లలోని వేయాలని తృప్తి మున్సిపల్ చైర్మన్ బొంది రజిని రవీందర్ గౌడ్ తెలిపారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం లో భాగంగా ఈ రోజు తూప్రాన్ మున్సిపాలిటీ 1వ వార్డు లో వార్డు సభలో పాల్గొన్న మన గౌరవ మున్సిపల్ చైర్ పర్సన్ బొంది రజిని రవీందర్ గౌడ్ మాట్లాడుతూ ఇల్లు శుభ్రంగా ఉంచుకుంటే దోమలు రావని ఎలాంటి వ్యాధులు రావని అన్నారు తడి పొడి చెత్తను వేరు చేసి చెత్త చెత్తను చెత్త బండి లోని వేయాలని కోరారు పరిసరాల పరిశుభ్రత మహిళలతో సాధ్యమని అన్నారు చిన్నపిల్లలకు చిన్నప్పటినుండే పరిశుభ్రతపై తల్లులు అవగాహన కల్పించాలని చిన్నప్పుడు నేర్పించినప్పుడే వారికి అర్థమవుతుందని అన్నారు. ఇల్లు పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే దోమలు రావని పరిశుభ్రతలో మహిళలే ముందు ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ,మున్సిపల్ కమిషనర్ రమేష్ మున్సిపల్ ఆఫీసర్ రవి శంకర్ పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత



**నాగలిగిద్ద, జూన్ 4 (జనం సాక్షి) :** ప్రస్తుత వేసవిలో ఉష్ణోగ్రతలు పెరిగి మనమందరం మానసికంగా శారీరకంగా చాలా ఇబ్బందులు పడ్డామని, ఇలాంటి ఇబ్బందులే వన్యప్రాణులకు కూడా ఉంటాయని, సమస్త ప్రాణికోటి పరిరక్షణనే ధ్యేయంగా పర్యావరణం కోసం మనమందరం చెట్లు నాటాలని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అనురాధ అన్నారు. గురువారం నాడు జడ్పిహెచ్ఎస్ నారాయణఖేడ్ లో ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా పర్యావరణ పరిరక్షణ పట్ల పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే ప్రతి ఒక్కరూ పర్యావరణం పట్ల అవగాహన కలిగి ఉండి చెట్ల పెంపకం కోసం కృషి చేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మన్మద్ కిషోర్, ఉపాధ్యాయులు యాదగిరి, చంద్రశేఖర్ ఆచార్య తదితరులు పాల్గొన్నారు.

# హత్నూర పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

**హత్నూర, జూన్ 4 (జనం సాక్షి) :** హత్నూర పోలీసు స్టేషన్‌ను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ పరిసరాలు, సిబ్బంది బ్యారెక్స్ పరిశుభ్రతను పరిశీలించారు. మన చుట్టూ ఉన్న పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ప్రశాంత వాతావరణంలో విధులు నిర్వహించగలమని, అందుకు సిబ్బంది ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలని సూచించారు. అనంతరం స్టేషన్ రికార్డులను పరిశీలిస్తూ అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి, బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక (ప్లాన్ ఆఫ్ యాక్షన్) ఉండాలని అన్నారు. తరచూ వాహనాల తనిఖీలు, నాకాబందీ వంటి ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి అనుమానిత వ్యక్తులు, వాహనాలపై నిఘా ఉంచాలని సూచించారు. పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లు, కేడీలు, అనుమానిత వ్యక్తుల వివరాలు ప్రతి సిబ్బందికి తెలుసుకొని ఉండాలని, పగలు–రాత్రి బీట్‌లలో క్రమం తప్పకుండా తనిఖీ చేస్తూ ఆన్‌లైన్ రికార్డుల్లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. మన చుట్టూ జరుగుతున్న వివిధ రకాల నేరాలు, సైబర్ మోసాలు, రోడ్డు ప్రమాదాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్‌హెచ్‌ఓకు సూచించారు. సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేయాలని, తమకు కేటాయించిన విధులను పూర్తి భాధ్యతగా నిర్వర్తించాలని సూచించారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే వారితో స్నేహపూర్వకంగా మాట్లాడాలని, వారి సమస్యలను ఓపికగా విని వారికి సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పోలీసు శాఖలో శారీరక దారుఢ్యం ఎంతో ముఖ్యమని, ప్రతిరోజూ వ్యాయామం చేస్తూ ఫిట్‌నెస్‌ను కాపాడుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో గానీ, వ్యక్తిగతంగా గానీ ఎలాంటి సమస్యలు ఉన్నా సంబంధిత




అధికారుల ద్వారా తన దృష్టికి తీసుకురావాలని, సిబ్బంది సంక్షేమానికి జిల్లా పోలీసు శాఖ కట్టుబడి ఉందని తెలిపారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. హత్నూర ఎస్‌హెచ్‌వో శ్రీధర్ రెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపడతాం

- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత




**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 04(జనంసాక్షి):** జిల్లాలో ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని అధికారుల సమన్వయంతో పకడ్బందీగా చేపడతామని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయం నుండి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం జిల్లా ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులకు ఈ నెల 15వ తేదీ నుండి 24వ తేదీ వరకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, బూత్ స్థాయి అధికారులు తమ పరిధిలోని ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారం అందించి ధ్రువపత్రాలు జతచేసిన ఫారాన్ని తిరిగి తీసుకొని బి.ఎల్.ఓ. యాప్ లో వివరాలు నమోదు చేయాలని తెలిపారు. ఇప్పటికే రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించడం జరిగిందని, రాజకీయ పార్టీల తరపున బూత్ స్థాయి ఏజెంట్ల జాబితాను తీసుకోవడం జరిగిందని తెలిపారు. సిర్పూర్ నియోజక వర్గంలో 320 పోలింగ్ కేంద్రాలు, ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 358 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఈ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. ప్రత్యేక ఓటర్ సమగ్ర సవరణ కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో చేపట్టి ఎలాంటి పొరపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు జమీల్, నాయబ్ తహసిల్దార్ శ్యాం లాల్, రామ్ లాల్, సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులు పంటమార్పిడిపై దృష్టి పెట్టాలి

- ఆదాయం వచ్చే పంటల వైపు మొగ్గు చూపాలి
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** రైతులకు పంట మార్పిడి చాలా అవసరమని, సాంప్రదాయ పంటలకు స్వస్తి పలికి, ఆదాయం వచ్చే పంటల సాగుకు రైతులు మొగ్గుచూపేలా అవగాహన కల్పించాలని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం గణపురం మండలం మైలారంలో నిర్వహించిన గ్రామ సభలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదంతో 60 ఎకరాలలో పంటలు కాలిపోయాయని, నలుగురు మనుషులు కూడా మరణించారని తెలిపారు. విద్యుత్ సమస్యలను గ్రామ సభలో తెలియజేస్తే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని తెలిపారు. చెరువు మట్టిని రైతులు పంట పొలాలకు తీసుకునేలా అవకాశం కల్పించాలని తెలిపారు. పంటలు వ్యర్థాలు కాల్చడం వల్ల భూమిలో రసాయనాలు చనిపోతున్నాయని, రసాయనాలు తగ్గిపోవడం వల్ల భూమికి నష్టం జరిగి, దిగుబడి తక్కువ వస్తుందని రైతులు వ్యర్థాలు కాల్చొద్దని తెలిపారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. పాఠశాలలు పున:ప్రారంభం విద్యార్థులకు యూనిఫామ్స్, పుస్తకాలు అందిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గానికి ఒక మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేసి విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. పాఠశాలలోనే విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్నం భోజన సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. పిల్లలను ప్రయోజకులను చేయాలని తల్లిదండ్రుల ఆశ ఉంటుందని ఉద్దేశంతో ప్రభుత్వం గురుకులాలను పటిష్టం చేసి నాణ్యమైన ఆహారం విద్య అందించేందుకు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ఎన్నో ఏండ్లుగా సాగు చేస్తున్న భూములకు పట్టాలు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని వాళ్ళందరికీ పట్టాలింపించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని సర్పంచులకు సూచించారు. పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఇంటిలో మొక్కలు నాటి బాధ్యతగా పెంచాలని సూచించారు. రోడ్లకు ఇరువైపులా ఖాళీగా ఉన్న ప్రదేశంలో మొక్కలు నాటి సంరక్షించాలని తెలిపారు. మహిళలు పరిశ్రమలు, గోదాముల నిర్మాణానికి ముందుకు రావాలని సూచించారు. 50 కోట్లతో 20 వేల సామర్థ్యం కలిగిన గోదాముల నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. 500 కోట్లతో బైపాస్ రోడ్డు, చెల్పూర్ నుండి గూడెప్పాడు వరకు 4 వరుసల రహదారిని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. గణపురం రిజర్వాయర్, పంట కాలువలు మరమ్మత్తులకు రూ.32 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు జిల్లాలో విజయ వంతంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈనెల 12 వరకు కార్యక్రమాలు ఉన్నాయని అందులో భాగంగా 4,6,8,10 తేదీలలో మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీలలో వార్డు, గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాలు, మున్సిపాలిటీలో జరిగే వార్డు, గ్రామసభలకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరుకావాలని తెలిపారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో ముందు కెళ్లేందుకు గ్రామస్థాయి నుంచి మున్సిపాలిటీ వరకు శాఖల వారీగా కార్యక్రమం రూపొందించి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిఈఓ రాజేందర్, సిఐ కరుణాకర్, సర్పంచ్ సమ్మయ్య నాయక్, పిఏసిఎస్ చైర్మన్ కుమార్ యాదవ్, వైద్య, విద్యుత్ ఇరిగేషన్, మిషన్ భగీరథ తదితర శాఖల అధికారులతో పాటు ఉప సర్పంచ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## దస్నాపూర్‌లో రెండిండ్లు దగ్ధం

- వారికి తక్షణ సహాయం అందించిన ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 04(జనంసాక్షి) :** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని దాస్నాపూర్ లో నిన్న రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో రెండు ఇళ్ళు దగ్ధం కావడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి వెంటనే తక్షణ సహాయం కింద వారికి సరుకులు, బట్టలు , ఆర్థిక సహాయం 20000 రూపాయలు అందించిన ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు కోవ లక్ష్మీ ఈ సందర్భంగా మాట్లాడుతూ వారి కుటుంబనికి భరోసాను అందించారు. ప్రభుత్వం తరుపున వచ్చే సాయహసహకారాల గురించి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాష్, వైస్ చైర్మన్ అహ్మద్, సింగిల్ విండో చైర్మన్ అలీ భాయ్, మున్సిపల్ కౌన్సిలర్ లు సలాం , బాలక్రిష్ణ, బి ఆర్ ఎస్ పార్టీ నాయకురాలు మార్సుకోల సరస్వతి , అధ్యక్షుడు జబోరే రవీందర్, టౌన్ అధ్యక్షుడు అహ్మద్ బిన్ అబ్దుల్లా, దూడల అశోక్, సాయి శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆయుర్వేద గుళికల పంపిణీకి కలెక్టర్‌కు ఆహ్వానం



**ఆదిలాబాద్ ప్రతినిధి, (జనంసాక్షి) :** ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరంలో కూడా జిల్లా కేంద్రంలో ఆయుర్వేద గుళికల పంపిణీ కార్యక్రమం నిర్వహింప బడుతుందని ఈ కార్యక్రమం కోసం జిల్లా కలెక్టర్ రాజర్షి షా ముఖ్య అతిథిగా ఆహ్వానించడం జరుగుతుందని ఆయుర్వేద గుళికల ప్రముఖ వైద్యుడు యువరాజు వైద్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి జిల్లా కలెక్టర్ రాజర్షి షాను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు కలెక్టర్ తో మాట్లాడుతూ మృగశిర కార్తె సందర్భంగా ఈనెల 8న నిర్వహించే ఆయుర్వేద శ్వాస కోస వ్యాధుల నివారణ కోసం ఉచితంగా అందించే ఆయుర్వేదిక గుళికల పంపిణీ కార్యక్రమాన్ని ఆదిలాబాద్ లోని సీసీఐ క్రాస్ రోడ్ ఎదుట గల వైద్య ఆయుర్వేదిక్ రిసెర్చ్ సెంటర్ లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

## కేంద్రం నుంచి తెలంగాణకు అభివృద్ధి నిధులేవీ?

- ఒక్క రూపాయి తీసుకురాలేని కేంద్ర మంత్రులు
- స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- సభ్యత సంస్కారం లేకుండా మాట్లాడుతున్న కేటీఆర్




**స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 04 (జనంసాక్షి) :** తెలంగాణ అభివృద్ధికి అదనంగా ఒక్క రూపాయి తీసుకురాలేని సిగ్గులేని దద్దమ్మ కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి,బండి సంజయ్ లని మాజీ ఉపముఖ్య మంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రం లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరయి మాట్లాడుతూ విశాఖపట్నం కేంద్రంగా సౌత్ కోస్టల్ రైల్వే జోన్ జూన్ 1నుండి ప్రారంభం అయిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి శుభాకాంక్షలు తెలిపా రు. నూతన రైల్వే ఏర్పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి దోహద పడుతుందని అభిప్రాయపడ్డా రు. తెలంగాణలో కూడా కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని ఎన్నో ఏళ్లుగా ఉమ్మడి వరం గల్ జిల్లా ప్రజలు,అన్ని రాజకీయపార్టీలు కోరుతు న్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు ద్వారా ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంతో పాటు యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు. కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటుకు అన్ని అర్హతలు ఉన్నాయని తెలిపారు. ఈ డివిజన్ పరిధిలో అపారమైన బొగ్గు నిల్వలు, అటవీ సంపద, జల వనరులు, సారవంతమైన భూములు ఉన్నాయని అన్నారు. బీజేపీప్రభుత్వానికి తెలంగాణ పట్ల నిజంగా వివక్ష లేకుంటే వెంటనే కాజీపేట రైల్వే డివిజన్ ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ బీజేపీ కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు సిగ్గు లేని దద్దమ్మలుగా వ్యవ హరిస్తున్నారని విమర్శించారు. ప్రధాని మోడీ వీళ్లకు తెల్లారిలేస్తే ప్రెస్ మీట్లుపెట్టి రాష్ట్ర ప్రభుత్వా న్ని తిట్టడానికే మంత్రిపదవులు ఇచ్చాడని ఏద్దేవా చేశారు. ఇప్పటి వరకు కేంద్రం నుండి రాష్ట్ర అభి వృద్ధికి ఒక్క ప్రాజెక్టు అయిన తీసుకువచ్చారా అని ప్రశ్నించారు. ఇంకా సిగ్గులేకుండా బండి సంజయ్ 13లక్షల కోట్లు తెచ్చామని చెప్పడం సిగ్గు చేటని అన్నారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సభ్యత సంస్కారం లేకుండా మాట్లాడుతున్నాడని ఆరోపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిని తెలంగాణ ద్రోహి అని సంభోదిం చడం కేటీఆర్ అహంకారానికి నిదర్శనం అని మండిపడ్డారు. అధికారం పోయిందనే అక్కసుతో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీ స్వంత చెల్లె నీకు నాయకత్వ లక్షణాలు లేవని వదిలి వెళ్ళిందనీ అన్నారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి పట్ల పరుష పదజాలం ఉప యోగించడం సరైంది కాదని వేల్లడించారు. కేటీఆర్ ఇప్పటికైనా బాష మార్చుకోవాలని లేదం టే నీకు అదే రీతిలో బుద్ది చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో జిల్లాగ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య రెడ్డి, చిల్పూర్ ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, జిల్లా స్థాయి, మండల స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకులు, నియో జకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్త లు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలి

- నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా




**నిర్మల్ బ్యూరో, జూన్4 (జనంసాక్షి) :** జిల్లాలో కొనుగోలు కేంద్రాల్లో మిగిలి ఉన్న వరి ధాన్యం సేకరణ ప్రక్రియను జాప్యం లేకుండా వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వరి ధాన్యం కొనుగోలు అంశంపై సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఇప్పటివరకు జరిగిన ధాన్యం కొనుగోలు పురోగతి, మిగిలి ఉన్న ధాన్యం నిల్వలు, కొనుగోళ్లు పూర్తయిన కేంద్రాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోలు ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. తక్కువ పరిమాణంలో ధాన్యం మిగిలి ఉన్న కొనుగోలు కేంద్రాల్లో సేకరణను వేగవంతం చేసి, కొనుగోలు ప్రక్రియను పూర్తికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ఇప్పటికే కొనుగోళ్లు పూర్తయిన కేంద్రాల్లో అందుబాటులో ఉన్న లారీలు, హమాలీలను ధాన్యం నిల్వలు అధికంగా ఉన్న ఇతర కేంద్రాలకు తరలించి వినియోగించుకోవాలని సూచించారు. ధాన్యం సేకరణ, లోడింగ్, అన్‌లోడింగ్ ప్రక్రియలో ఎటువంటి అంతరాయం కలగకుండా అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, పౌర సరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, డిఆర్డిఓ విజయలక్ష్మి, డీఎం మార్క్‌ఫెడ్ మహేష్, జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, ఉద్యాన వన శాఖ అధికారి రమణ, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




## అక్రమ ఇసుక రవాణాపై ఉక్కుపాదం

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 04(జనంసాక్షి) :** సరియైన అనుమతులు లేకుండా ఇసుక మట్టి తరలింపు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కె హరిత అన్నారు. గురువారం కాగజ్నగర్ మండలం గన్నారం మాండవ, ఆరెగూడ, అనుకొడ గ్రామాలలో గల చెరువులను సందర్శించి పరిశీలించారు. నజ్రుల్ నగర్ విలేజ్ నెం.12 గ్రామ పరిధిలో మట్టిని తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను తనిఖీ చేశారు. తనిఖీలో సంబంధిత వ్యక్తుల వద్ద ఎలాంటి అనుమతులు లేదా సంబంధిత పత్రాలు లేవని గుర్తించడంతో ఆ ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎవరైనా అక్రమంగా మట్టి లేదా ఇసుకను తరలించినట్లయితే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. మట్టి లేదా ఇసుక రవాణా చేపట్టే ముందు సంబంధిత శాఖల నుండి అవసరమైన అనుమతులు పొందిన తరువాత మాత్రమే తరలించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాగజనగర్ మండల తహసీల్దార్ మధుకర్, రెవెన్యూ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## పంట మార్పిడితోనే అధిక దిగుబడులు

- రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి
- వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద



**వరంగల్ బ్యూరో, జూన్ 04 (జనం సాక్షి) :** పంట మార్పిడి విధానాలను అనుసరించడం ద్వారా రైతులు అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయం పొందవచ్చని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సంగెం మండలం చింతలపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు.సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా గురువారం 11 మండలాలలో గ్రామ సభలు నిర్వహించడం జరిగిందని, గ్రామ సభల్లో మన గ్రామం మన బాధ్యత చెత్తను వేరు చెయ్యండి ప్రకృతిని కాపాడండి అనే కాన్సెప్ట్‌తో మనం ముందుకు వెళ్ళాలని ప్రతి గ్రామం అభివృద్ధి చెందినట్లు అయితే మండలాలు జిల్లా వ్యాప్తంగా అభివృద్ధి చెందుతుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.గత ఏడాది జిల్లాలో వరి, మొక్కజొన్న ధాన్యం అధిక దిగుబడి సాధించడం సంతోషకరమన్నారు. ఈసారి రుతుపవనాల రాక ఆలస్యమయ్యే అవకాశాలు ఉన్న నేపథ్యంలో రైతులు పంట మార్పిడికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. తక్కువ నీటితో సాగు చేయగల మొక్కజొన్న, పత్తి వంటి పంటలను సాగు చేయాలని కోరారు. అధిక రసాయన ఎరువుల వినియోగం ఆరోగ్యానికి, పర్యావరణానికి హానికరమని పేర్కొన్నారు. గ్రామాల్లో వ్యవసాయ అధికారుల సూచనలతో పాటు సంప్రదాయ సాగు పద్ధతులను కూడా అనుసరించాలని రైతులకు సూచించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, ప్రతి గ్రామంలో స్టీల్ బ్యాంకులు ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. మహిళల ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత సమాజ అభివృద్ధికి కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ గ్రామసభలో గ్రామ సర్పంచ్ బొమ్మ పావని జడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, ఎంపీడీవో రవీందర్ బీఎండబ్ల్యూ రమేష్, అధికారులు పాల్గొన్నారు.

## పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే జైలుకే..

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్
- గోడ పత్రికల ఆవిష్కరణ




**వరంగల్ బ్యూరో, జూన్ 04 (జనం సాక్షి) :** వ్యాపారస్తులు ఎవరైనా పాఠశాల, కళాశాల, ఇతర విద్యా సంస్థల పరిసరాల్లో పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే జైలు జీవితం తప్పదని వరంగల్ పోలీస్ కమిషనర్ హెచ్చరించారు. మరి కొన్ని రోజుల్లో కొత్త విద్యాసంవత్సరం ప్రారంభం కానుంది. ఇప్పటికే ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు రీఓపెనింగ్కు సిద్ధమవుతున్నాయి. అయితే, స్కూళ్లు, కాలేజీల పరిసరాల్లోని పాన్ షాపులు, ఇతర దుకాణాలు స్టూడెంట్లను చెడు అలవాట్ల వైపు మళ్లిస్తున్నాయనే ఆందోళనలు వ్యక్తమవు తున్నాయి. గుట్కా, సిగరెట్లు తదితర పొగాకు ఉత్పత్తులను విక్రయించడం ద్వారా విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడే ప్రమాదం ఉందని పోలీసులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వరంగల్ కమిషనరేట్ పరిధిలో 'ఆపరేషన్ సేఫ్ స్కూల్' పేరుతో విస్తృత తనిఖీలు నిర్వహి స్తున్నారు. మైనర్లు, స్కూల్ స్టూడెంట్లకు గుట్కా, సిగరెట్లు వంటి పొగాకు ఉత్పత్తులు అమ్మకుండా విద్యాసంస్థల సమీపంలోని పాన్ షాపులు, ఇతర దుకాణాలను తనిఖీ చేస్తున్నారు. కొత్త విద్యాసంవత్సరం ప్రారంభమయ్యే నాటికి స్కూళ్లు, కాలేజీల పరిసరాలను టొబాకో ఫ్రీ జోన్లుగా మార్చేందుకు వరంగల్ పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో పోలీసులు చర్యలు తీసుకొనేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగం విద్యా సంస్థ పరిసరాల్లో పొగాకు ఉత్పత్తులను నిషేధమని తెలియజేస్తూ రూపొందించిన గోడ పత్రికను వరంగల్ పోలీస్ కమిషనర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ విద్యార్థుల భవిష్యత్తును కాపాడాల్సిన బాధ్యత మనందరిపై వుందని. ముఖ్యంగా విద్యార్థులు చెడు అలవాట్లకు అలవాట్లకు బానిసలుగా మారకుండా చేపడుతున్న చర్యల్లో భాగంగా విద్యా సంస్థ పరిసరాల్లో పొగాకు విక్రయాలు నిషేదించబడ్డాయని. ఎవరైనా విద్యా సంస్థల వద్ద విక్రయాలపాల్పడితే సిగరెట్ అండ్ ఆదర్ టొబాకో ప్రొడక్ట్స్ – 2003 యాక్ట్ క్రింద చర్యలు తీసుకోబడుతాయని, అలాగే మైనర్లకు కూడా పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే జస్టిస్ జువైనల్ యాక్ట్ 2015 యాక్ట్ 77 ప్రకారం చట్ట పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని. ఎవరైన విద్యా సంస్థల వద్ద పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100 ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గొప్యంగా ఉంచబడుతాయని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ జితేందర్ రెడ్డి, సి సి ఆర్ బి ఏసీపీ డేవిడ్ రాజు, వరంగల్ ట్రాఫిక్ ఇన్స్ స్పెక్టర్ సుజాత, ఏ. ఎస్. ఐ రాజేందర్ ప్రసాద్ పాల్గొన్నారు.



## నాలుగు రోజుల్లో కొనుగోళ్లు పూర్తి చేయాలి

- ట్రక్ షీట్, రిజిస్టర్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి
- హమాలీలను మూడు బ్యాచ్‌లుగా విభజించి పనులు వేగవంతం
- అదనపు ట్రాక్టర్ల వినియోగంతో రవాణా ప్రక్రియ వేగవంతం
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

జనగామ ప్రతినిధి, జూన్ 4(జనంసాక్షి): గురువారం, జిల్లాలోని నర్మెట్ట మండలంలోని వెల్దండ గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు, లోడింగ్ ప్రక్రియ, ట్రక్ షీట్ నిర్వహణ, రిజిస్టర్ల నమోదును పర్యవేక్షించారు. కొనుగోలు కేంద్రంలో లోడింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ట్రక్ షీట్, సంబంధిత రికార్డులు తప్పనిసరిగా సక్రమంగా నిర్వహించాలన్నారు. లోడింగ్ పనులను నాలుగు రోజుల్లోగా పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అలాగే పనుల సమర్థవంతమైన నిర్వహణ కోసం హమాలీలను మూడు బ్యాచ్‌లుగా విభజించి పని చేయాలని సూచించారు. అదే విధంగా అదనపు ట్రాక్టర్లను వినియోగిస్తూ, ధాన్యం రవాణా ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు.

# భావితరాలకు నష్టం వాటిల్లకుండా బాధ్యతగా వ్యవహరించాలి

- **గ్రామ సభలో కలెక్టర్ ఇలా త్రిపాఠి హితవు**



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 4 (జనం సాక్షి) :** మన భావితరాలకు నష్టం జరుగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి హితవు పలికారు. సమాజం కోసం మనం ఏం చేస్తున్నాం అన్నది ప్రతి ఒక్కరు గుర్తెరిగి బాధ్యతతో మెలగాలని సూచించారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాలో గురువారం గ్రామ, వార్డు సభలకు శ్రీకారం చుట్టారు. మోపాల్ మండలం న్యాల్ కల్ లో గ్రామ సచివాలయం ప్రాంగణంలో సర్పంచ్ చంద్రకళ అధ్యక్షతన జరిగిన గ్రామ సభకు కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి సంబంధిత శాఖల అధికారులు గ్రామస్థులకు వివరించడంతో పాటు, ప్రత్యేక ఓటరు సవరణ ప్రక్రియకు సహకరించడం, పంటల మార్పిడి, పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించాల్సిన ఆవశ్యకత, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండడం, వర్షపు నీటిని ఒడిసిపట్టడం, భూగర్భజలాల పెంపుదల, తడి–పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం, ఘన వ్యర్థాల నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, ఎల్ నినో ప్రభావంతో ఈసారి వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ సూచనలు చేసినందున, తదనుగుణంగా అనుకూలమైన పంటలను ఎంచుకోవాలని రైతులకు హితవు పలికారు. పంట మార్పిడి విధానాలను అవలంభించాలని, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలను పాటిస్తూ నాణ్యమైన ఎరువులు, విత్తనాలను వినియోగించాలని సూచించారు. ఎక్కడైనా నాసిరకం, నకిలీ ఎరువులు, విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అలాంటి డీలర్ల లైసెన్సులు రద్దు చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు. తనిఖీల కోసం పోలీస్, రెవెన్యూ, వ్యవసాయ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశామని అన్నారు. కాగా, మోతాదుకు మించి ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడవద్దని, పర్యావరణానికి హాని చేకూర్చే విధంగా వరి కొయ్యలకు నిప్పు పెట్టవద్దని రైతులకు సూచించారు. దీనివల్ల కాలుష్యం వ్యాపిస్తూ భావి తరాలకు కూడా నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలా చేయడం చట్టరీత్యా నేరమని, బాధ్యులకు రూ. 5వేలు మొదలుకుని రూ. 25వేల వరకు జరిమానా విధించే అవకాశాలు ఉంటాయని సూచించారు. పర్యావరణ సమతుల్యత, పచ్చదనాన్ని పెంపొందించేందుకు గాను విరివిగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. పారదర్శకమైన ఓటరు జాబితా కోసం కేంద్ర ఎన్నికల సంఘం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రత్యేక ఓటరు సవరణ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియకు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఇంటికి వచ్చే బీ.ఎల్.ఓలకు తగిన వివరాలు అందించాలని సూచించారు. చెరువుల శిఖం భూములు ఆక్రమణకు గురి కాకుండా చూడాలని, కబ్జాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. పన్నులను సకాలంలో చెల్లిస్తూ, గ్రామాల అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేయాలని హితవు పలికారు. పోలీస్ కమిషనర్ సాయి చైతన్య మాట్లాడుతూ, శాంతి భద్రతల పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని గుర్తు చేశారు. శాంతియుత వాతావరణం నెలకొని ఉన్న ప్రాంతాలు సత్వర అభివృద్ధి సాధిస్తాయని అన్నారు. నేరాల నియంత్రణకు ఉపకరిస్తూ, నేరాలు జరిగిన సందర్భాలలో నిందితుల ఆచూకి తెలుసుకునేందుకు ఉపకరించే సీ.సీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మత్తు పదార్థాలు, దురలవాట్లకు యువత దూరంగా ఉండాలని హితవు పలికారు. రోడ్ సేఫ్టీ కమిటీని ఏర్పాటు చేసుకుని రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం కృషి చేయాలన్నారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, ప్రజలకు భద్రతా కల్పించడానికి పోలీసు శాఖ ఎల్లవేళలా సమాయత్తంగా ఉంటుందని తెలిపారు. గ్రామ సభలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, మండల ప్రత్యేక అధికారి తిరుమల ప్రసాద్, నిజామాబాద్ ఏ.సీ.పీ ప్రకాష్, డీ.ఎల్.పీ.ఓ శ్రీనివాస్, ఎంపీడీఓ రాములు నాయక్, తహసిల్దార్ రేఖ, మండల వ్యవసాయ అధికారి జాదవ్ హీరా, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వార్డు సభలతో ప్రజల వద్దకే పాలన



**భువనగిరి, జూన్ 4 (జనం సాక్షి) :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ముగింపు కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న వార్డు సభలు ప్రజల భాగస్వామ్యంతో పట్టణాభివృద్ధికి బాటలు వేయాలని భువనగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని 12, 13 వార్డుల్లో నిర్వహించిన వార్డు సభలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆమె, మున్సిపల్ కమిషనర్ కె. చంద్రప్రకాశ్ రెడ్డి ఆధ్వర్యంలో, స్థానిక వార్డు సభ్యులు తోటకూర విజయలక్ష్మి వెంకటేష్, గుర్రాల సంతోష శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రజలకు వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించడం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్–2026 అమలు, జల్ సంచయ్––జల్ భగీరథ పథకం కింద ఇంకుడు గుంతల నిర్మాణం, మురుగు కాలువల శుభ్రత, పూడికతీత పనులు, వర్షాకాల సంసిద్ధత, తాగునీటి సరఫరా, నీరు నిల్వ ప్రాంతాల నివారణ, పారిశుద్ధ్య నిర్వహణ, రహదారుల అభివృద్ధి, వీధిదీపాల నిర్వహణ, మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలపై ప్రజల్లో చైతన్యం పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల సహకారం లేకుండా పట్టణాభివృద్ధి సాధ్యం కాదని, ప్రతి పౌరుడు తమ వార్డు అభివృద్ధిలో భాగస్వామి కావాలని ఆమె పిలుపునిచ్చారు. షెడ్యూల్ ప్రకారం నాలుగు రోజుల పాటు ప్రతి రోజు 10 వార్డుల్లో, చివరి రోజు 5 వార్డుల్లో వార్డు సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, వార్డు అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, వార్డు ప్రజలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బీఎస్ఎన్ఎల్ సేవలను మెరుగుపరచాలి

**ఖమ్మం కార్పొరేషన్, జూన్ 4 (జనం సాక్షి) :** ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, జిల్లాల్లో బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ సేవలను అత్యున్నత ప్రమాణాలతో అందించాలని, మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో సిగ్నల్ సమస్యలు లేకుండా నిరంతరాయంగా సేవలు అందేలా చూడాలని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ లోని తన నివాసంలో టెలికాం విభాగం (ఇఈ), ఏపీఎల్ఎస్ఏ హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డి. భాస్కరరావు, అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ జి. గణేష్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ కె.లక్ష్మణ కుమార్ మరియు బిఎస్ఎన్ఎల్ హైదరాబాద్ డిప్యూటీ జనరల్ మేనేజర్ సి. రమణలతో ఆయన సమీక్ష నిర్వహించారు.

**25 కొత్త టవర్ల ఏర్పాటు ఆవశ్యకత వివరించిన ఎంపీ**

ఈ సందర్భంగా ఎంపీ రఘురాంరెడ్డి మాట్లాడుతూ, ఇటీవల కేంద్ర టెలికాం కార్యదర్శిని కలిసి ఉభయ జిల్లాల్లో ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లో కనెక్టివిటీ సమస్యను అధిగమించడానికి 25 నూతన టవర్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినట్లు గుర్తు చేశారు. ఈ సమావేశంలో అధికారులు టవర్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రస్తుత స్థితిగతులు, సాంకేతిక అంశాలను ఎంపీకి వివరించారు.

## స్వామివారి హుండీ లెక్కింపు



**యాదగిరిగుట్ట, జూన్ 4 (జనంసాక్షి) :** యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం హుండీ ఆదాయం లెక్కించారు ఆలయ అధికారులు. 30 రోజుల హుండీ ఆదాయం లెక్కించగా 3 కోట్ల 18 లక్షల 37 వేల 261రూపాయల నగదు ఆలయానికి చేకూరినట్టు ఆలయ ఈఓ భవాని శంకర్ వెల్లడించారు. అలాగే 179 గ్రాముల మిశ్రమ బంగారం, 3 కిలోల వెండి సైతం లభించినట్టు తెలియజేశారు. అలాగే పలు దేశాల నగదు సైతం హుండీ లెక్కింపులో ఆలయానికి వచ్చిందని తెలిపారు. హుండీ లెక్కింపు లో ఆలయ ఈఓ భవాని శంకర్, ఆలయ అనువంశిక ధర్మకర నరసింహ మూర్తి, ఆలయ అధికారులు, ఆలయ సిబ్బంది, ఎస్పీఎఫ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు. కొండక్రింద సత్యనారాయణ స్వామి వ్రత మండపంలో హుండీ లెక్కింపు చేపట్టారు.

## అకాల వర్షానికి తడిసిన వరి ధాన్యం



**సదాశివనగర్, జూన్ 4 (జనంసాక్షి) :** సదాశివనగర్ మండలం అడ్లూరు ఎల్లారెడ్డిలో గురువారం సాయంత్రం కురిసిన అకాల వర్షం రైతుల కష్టార్జితాన్ని నీటిపాలు చేసింది. కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి పేరుకుపోయిన వరి ధాన్యం వర్షపు నీటిలో తడిసి ముద్ద కావడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట పండించేందుకు నెలల తరబడి శ్రమించిన రైతుకు చివరి దశలో ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా భారీ నష్టం వాటిల్లిందని రైతులు మండిపడుతున్నారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి రోజుల తరబడి ఎదురుచూస్తున్నప్పటికీ అధికారులు సకాలంలో కొనుగోళ్లు చేపట్టకపోవడం, తగిన టార్పాలిన్లు, గోదాముల సదుపాయాలు కల్పించకపోవడంతో వర్షానికి ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. వర్షం వస్తుందనే వాతావరణ హెచ్చరికలు ఉన్నప్పటికీ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడం రైతుల ఆగ్రహానికి కారణమైంది. పంట పండించడానికి అప్పులు చేసి పెట్టుబడులు పెట్టాం. చివరకు కొనుగోలు కేంద్రంలోనే ధాన్యం తడిసిపోవడం దురదృష్టకరం. దీనికి పూర్తిగా ప్రభుత్వమే బాధ్యత వహించాలని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఏడాది ఇదే పరిస్థితి పునరావృతమవుతున్నప్పటికీ ప్రభుత్వం శాశ్వత చర్యలు చేపట్టడంలో విఫలమవుతోందని రైతు సంఘాల నాయకులు విమర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో సరైన ఏర్పాట్లు చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేదే కాదని, రైతు నష్టానికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామ రైతులు కోరుతున్నారు.

# భవిష్యత్తు తరాల కోసం పర్యావరణాన్ని కాపాడుకుందాం



**ఖమ్మం రూరల్, జూన్ 4 (జనం సాక్షి) :** భవిష్యత్తు తరాల కోసం మనమందరం పర్యావరణాన్ని కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. ఖమ్మం రూరల్ మండలం గోళ్లపాడు గ్రామంలోనీ రైతు వేదికలో నిర్వహించిన గ్రామ సభలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రజలతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ గ్రామ, వార్డు సభలు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే ముఖ్య వేదికలని అన్నారు. ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంపై సమగ్ర వివరాలు తెలియజేసి, ప్రజలు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. ఇరిగేషన్ శాఖకు సంబంధించిన కాలువల అభివృద్ధి, సాగునీటి పనుల పురోగతిపై గ్రామస్తులతో చర్చించారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఎరువుల కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు. నానో యూరియా వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. పంటల మార్పిడి విధానంపై రైతులకు అవగాహన కల్పిస్తూ, వాతావరణ శాఖ అంచనాలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ పంటలైన ఆయిల్‌పామ్, కూరగాయలు, పండ్ల తోటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులు తక్కువగా ఉన్న నేపథ్యంలో బోర్‌వెల్ సౌకర్యం కలిగిన రైతులు షార్ట్ డ్యూరేషన్ వరి సాగు చేపట్టవచ్చని తెలిపారు. పంటలకు రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి సేంద్రీయ వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామాలలో చెత్తను సమర్థవంతంగా నిర్వహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న జనాభా నేపథ్యంలో పర్యావరణ కాలుష్యం పెరుగుతోందని, ప్రస్తుతం స్వచ్ఛమైన తాగునీటి కోసం డబ్బులు చెల్లిస్తున్నామని, భవిష్యత్తులో స్వచ్ఛమైన గాలి కోసం కూడా డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి రాకుండా పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని సూచించారు. భవిష్యత్ తరాలు మెరుగైన జీవనం సాగించాలంటే పర్యావరణ పరిరక్షణ అత్యంత ముఖ్యమని అన్నారు. వాతావరణ మార్పుల ప్రభావంతో ఒకేరోజు కుంభవృష్టి తరహా వర్షాలు కురిసి వరదలు సంభవిస్తున్నాయని, అడవుల నరికివేత కారణంగా కోతులు జనావాసాల్లోకి వస్తున్నాయని తెలిపారు. కోతుల సమస్యకు తక్షణ పరిష్కారం లేదని, గ్రామస్థులు తమ జీవన విధానంలో మార్పులు చేసుకుంటేనే శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. జిల్లాకు సమగ్ర విపత్తు నిర్వహణ ప్రణాళిక సిద్ధం చేయాల్సిన అవసరాన్ని వివరించిన కలెక్టర్, రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో మురుగు కాల్వల శుభ్రత, పరిసరాల పరిశుభ్రత, నీటి సంరక్షణ చర్యలు, కమ్యూనిటీ సోక్‌పిట్ల నిర్మాణం వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ బి జ్యోతి, ఆత్మ పిడి బి.సరిత, ఏవో ఉమా నగేష్, పశు వైద్యులు జగ్గులాల్ సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## డ్వాక్రా మహిళలకు ఆరోగ్య పరీక్షలు ప్రారంభించిన కలెక్టర్



**భిక్కనూరు, జూన్ 4 (జనం సాక్షి) :** భిక్కనూరు మండలంలో డి.ఆర్.డి.ఏ మరియు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వయం సహాయక సంఘాల మహిళల సభ్యులకు ఉచిత రక్తపరీక్షల కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ స్వంగ్వాన్ గురువారం ప్రారంభించారు,అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రక్త పరీక్షలతో పాటు ప్రభుత్వం సూచించిన అన్ని రకాలఆరోగ్య పరీక్షలను నిర్వహిస్తారు అని పేర్కొన్నారు, భిక్కనూరు మండలంలో స్వయం సహాయక సంఘాల్లో మహిళా సభ్యుల సంఖ్య 12,776 మంది సభ్యులు ఉండగా, ప్రతి సభ్యురాలికి అవసరమైన ఆరోగ్య పరీక్షలు నిర్వహించి,ఆరోగ్య సమస్యలు గుర్తించిన వారికి తగిన వైద్య చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు,ప్రతిరోజు ఒక గ్రామ సంఘం పరిధిలోని 50 మంది మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించారు,మొదటి రోజు 30 మంది మహిళలకు ఆరోగ్యపరీక్షలు నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు కుటుంబ బాధ్యతతో పాటు స్వయం సహాయక సంఘాల్లో మహిళా పాత్రకీలకం కావున ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించి ప్రభుత్వము అందిస్తున్నటువంటి వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు,ఈక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ రవీందర్ గౌడ్,డాక్టర్ ప్రదీప్,ప్రాథమిక వైద్యాధికారి యేమిమా,డి. ఆర్.డి.ఏ పిడి,దామోదర్ రెడ్డి, అదనపు డి.ఆర్.డి.ఏ అధికారి విజయలక్ష్మి,ఐడి డిపిఎం శ్రీనివాస్, తాసిల్దార్ సునీత,డిప్యూటీ తాసిల్దార్ పి,వీ శ్రీనివాస్,ఎంపీడీవో రాజ్ కిరణ్ రెడ్డి,జి.పి.ఓ రమేష్.గ్రామ సర్పంచ్ బల్యాల రేఖ సుదర్శన్, ఉపసర్పంచ్ దుంపల మోహన్ రెడ్డి,మండల సమైక్య అధ్యక్షురాలు రాజమణి,డి,ఎల్,పి.ఓ శ్రీనివాస్,పంచాయతీ సెక్రెటరీ మహేష్ గౌడ్, ఏపిఎం,సాయిలు.సీసీలు గంగల జయశ్రీ,తోడేంగల వెంకటేశం,ప్రజా ప్రతినిధులు మండల వైద్య విస్తీర్ణ అధికారి వెంకటరమణ సిబ్బంది సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదంలో జమాయిల్ తోట దగ్ధం



**కల్లూరు, జూన్ 4 (జనం సాక్షి) :** కల్లూరు మున్సిపాలిటీ పరిధి ఎల్లంకి ఎస్టేట్ నివాస గృహాలు, రైస్ మిల్లుల సమీపానగల జామాయిల్ తోటలో ఆకస్మికంగా ఒక్కసారిగా మంటలు చెలరేగి గురువారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ సంఘటనలో జామాయిల్ తోట దగ్ధం అయ్యింది.మండుతున్న ఎండలు వడగాలి వాటానికి పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి.ఎగిసి పడుతున్న మంటలను ఆర్పేందుకు స్థానిక నివాస గృహాల ప్రజలు స్వచ్ఛందంగా స్పందించి ఇండ్లల్లోని నీటిని బకెట్లతో తీసుకెళ్లి మంటలను అదుపులోకి తెచ్చేందుకు కృషి చేశారు.సమీపాన ఉన్న రైస్ మిల్లులకు నివాస గృహాలకు పెను ప్రమాదం వాటిల్లకుండా చర్యలు చేపట్టారు. సంబంధిత అధికారులకు ప్రజాప్రతినిధులకు స్థానిక ఎమ్మెల్యేకి ప్రమాద సమాచారం అందించడం జరిగింది. జామాయిల్ తోట దగ్ధం అగ్ని ప్రమాద సంఘటన సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ తక్షణమే స్పందించి అధికారులను ప్రజాప్రతినిధులను పార్టీ శ్రేణులను అప్రమత్తం చేసి ఎలాంటి ఆస్తి ప్రాణ నష్టం జరగకుండా మంటలను అదుపులోకి తీసుకురావాలని ఆదేశించారు. దీంతో స్పందించిన మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, సత్తుపల్లి ఫైర్ స్టేషన్ సిబ్బంది, పోలీస్, విద్యుత్ శాఖ అధికారులు సంఘటన స్థలం చేరుకొని ఎగిసిపడుతున్న మంటలు ఆర్పేందుకు ఫైర్ సిబ్బంది మున్సిపాలిటీ సిబ్బంది చేత చర్యలు చేపట్టారు. సత్తుపల్లి అగ్నిమాపక కేంద్రం నుంచి కల్లూరు చేరుకున్న ఫైర్ ఇంజన్ తోపాటు, మున్సిపాలిటీ నుంచి మూడు వాటర్ ట్యాంకులు ద్వారా ఫైర్ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది కలిసి మంటలను అదుపులోకి తెచ్చారు. సంఘటనా ప్రదేశాన్ని మున్సిపల్ చైర్మన్ మోహన్ నాయక్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు పసుమర్తి చంద్రరావు, బొల్లం రామారావు, ధరావత్ రవికుమార్ కౌన్సిలర్లు. ఉబ్బన రాంబాబు, ఎండి ఇస్మాయిల్, గుండ్ల పుల్లారావు, స్థానిక నివాసులు బెల్లంకొండ శ్రీకాంత్, బొల్లం శంకర్ గౌడ్, బజ్జూరి గోపాలకృష్ణ, షేక్ రంజాన్, షేక్ నజీర్, నోముల రాటాలు, అమ్మిక కృష్ణ, మిద్దెపుల్లారావు, పానగళ్ల సత్యనారాయణ, షేక్ షరీఫ్, రేసు వెంకన్న, షేక్ సన్నీ, తదితరులతోకలిసి పరిశీలించారు.

# విద్యా, వైద్య రంగాలను పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావాలి

- **ప్రజా సమస్యలపై నగరంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తాం...**
- **సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ**



**ముషీరాబాద్, జూన్ 4 (జనం సాక్షి) :** విద్యా వైద్య రంగాలను పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. విద్యారంగంలో ప్రైవేటు కార్పోరేట్ సంస్థల్లో ఫీజు నియంత్రణ చట్టం పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం బాగ్ లింగం పల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్య వైద్య రంగాలు, కార్పొరేట్ సంస్థలను నియంత్రించలేకపోతున్నారని పేద మధ్యతరగతి ప్రజల నుండి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తూ ఆర్థిక ఇబ్బందులను సృష్టిస్తున్నారని తెలిపారు. రేషన్ కార్డుల ద్వారా ఒక్కొక్కరికి ఆరు కిలోల బియ్యం కాకుండా పది కిలోలు ఇవ్వాలని అదేవిధంగా గతంలో ఇచ్చిన మాదిరిగా 14 రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ఇల్లులేని నిరుపేదలకు 120 గజాల స్థలం కేటాయించాలన్నారు. స్థలమున్నవారికి ఇందిరమ్మ ఇండ్లు కట్టించి ఇవ్వాలని కోరారు. జర్నలిస్టులకు స్థలాలు ఇచ్చి ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటివరకు భర్తీ చేయకపోవడం విచారకరమన్నారు. వెంటనే ఖాళీలన్నీ భర్తీ చేసి నిరుద్యోగాన్ని నిర్మూలించాలన్నారు అర్హులందరికీ పింఛన్లను పెంచాలన్నారు. ఈ డిమాండ్ల అన్నింటిని జూన్, జూలై, ఆగస్టు మూడు నెలలపాటు రాష్ట్రవ్యాప్తంగా క్యాంపెనునిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులు విద్యాలయాలు, రేషన్ దుకాణాలుసందర్శించిఅట్టి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తామన్నారు. మూడు నెలల అనంతరం ప్రజా సమస్యల పై తమ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్ నగరంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలి

- **జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**



**ఖమ్మం కార్పొరేషన్, జూన్ 4 (జనం సాక్షి) :** ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి అర్హుడైన వ్యక్తికి ఓటు హక్కు కల్పించే లక్ష్యంతో అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. ఎస్ఐఆర్ కార్యక్రమంపై కేంద్ర ఎన్నికల సంఘం ప్రతినిధులు విలాస్ దుబే, అమృత గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ శిక్షణ కార్యక్రమంలో ఖమ్మం కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం ప్రతినిధులు ఎన్యుమరేషన్ ఫారాల ముద్రణ, పంపిణీ, ఓటర్ల నుంచి స్వీకరించిన ఎన్యుమరేషన్ ఫారాలను డిజిటలైజేషన్ చేయడం, డేటా నమోదు, ధృవీకరణ ప్రక్రియలు,తదితర అంశాలపై అధికారులకు శిక్షణ అందించారు. ఎన్యుమరేషన్ ఫారాల్లో నమోదయ్యే ఎపిక్ నంబర్‌తో పాటు ఇతర వివరాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించి ధృవీకరించాలని సూచించారు. మాస్టర్ ట్రైనర్ల ద్వారా బీఎల్‌వోలకు పూర్తి స్థాయి శిక్షణ అందేలా సూపర్వైజర్లు పర్యవేక్షించాలని, ప్రతి పోలింగ్ కేంద్రంలో అవసరమైన ఫారాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, డీఆర్ఓ, ఆర్డీఓ శ్రీనివాస్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాజు, డిటి అన్సారీ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# మారుతీ సుజుకీ నుంచి తొలి ఫ్లెక్స్ ఫ్యూయల్ కారు

**న్యూఢిల్లీ:**చమురు దిగుమతులు తగ్గించి, ఇథనాల్ వినియోగాన్ని పెంచాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఆటోమొబైల్ కంపెనీలు ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాలను రూపొందిస్తున్నాయి. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని (జూన్ 5) పురస్కరించుకుని హీరో మోటోకార్ప్ రెండు ఫ్లెక్స్ ఫ్యూయల్ మోటార్ సైకిళ్లను బుధవారం లాంచ్ చేయగా.. తాజాగా ప్రముఖ కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ తొలి ఫ్లెక్స్‌ఫ్యూయల్ కారు వ్యాగనార్‌ను పరిచయం చేసింది. కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, హర్‌దీప్ సింగ్ పురి ఈ కారును గురువారం ఆవిష్కరించారు.భారతదేశ ఇంధనరంగంలో సరికొత్త అధ్యాయం మొదలైందని మారుతీ సుజుకీ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ హిసాషీ టకేయుచి ఈసందర్భంగా పేర్కొన్నారు. క్రూడాయిల్ దిగుమతులు తగ్గించుకోవడం, కర్బన ఉద్గారాలు తగ్గించుకోవడం భారత్ ముందున్న రెండు ప్రధాన లక్ష్యాలని వివరించారు. ఈ రెండూ ఫ్లెక్స్ ఫ్యూయల్‌తో సాకారం అవుతాయన్నారు. బయో ఫ్యూయల్, ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వైపు మళ్లేలా ఆటోమొబైల్ కంపెనీలకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మార్గనిర్దేశం చేశారని చెప్పారు. ఫ్లెక్స్‌ఫ్యూయల్ టెక్నాలజీ వల్ల ఆటోమొబైల్‌కు మాత్రమే కాకుండా రైతులకు, ఇథనాల్ ఉత్పత్తిదారులకూ మేలు చేకూరుతుందన్నారు. ఇందులోభాగంగా మారుతీ సుజుకీ ఆ దిశగా కీలక ముందడుగు వేసిందన్నారు.ఇక ఈ కారు విషయానికొస్తే.. 1.2 లీటర్ పెట్రోల్ ఇంజిన్ కలిగిన ఈ కారు సాధారణ పెట్రోల్‌తో పాటు 85 శాతం వరకు ఇథనాల్ బ్లెండ్ చేసిన ఇ85 ఫ్యూయల్‌తోనూ నడుస్తుంది. డిజైన్ పరంగా ఇ20 మోడల్‌ను పోలి ఉంది. ధర, ఇతర వివరాలు వెల్లడించలేదు. అయితే, రూ.8.50 లక్షల వరకు ఉండొచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఫ్లెక్స్ ఫ్యూయల్ కారు లాంచ్ చేసిన నేపథ్యంలో మారుతీ సుజుకీ కంపెనీ షేర్లు రాణించాయి. ఓ దశలో 1.5 శాతం లాభంతో షేరు విలువ రూ.13,250కి పెరిగాయి. మధ్యాహ్నం 12.50 గంటల సమయానికి దాదాపు ఒక శాతం లాభంతో రూ.13,152 వద్ద ట్రేడవుతోంది.




# ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు

**ముంబయి:**
దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి. రోజంతా మోస్తరు శ్రేణిలో కదలాడిన సూచీలు.. స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వైమాసిక పరపతి విధాన సమీక్ష నిర్ణయాలు శుక్రవారం వెలువడనున్న వేళ మదుపర్లు అప్రమత్తత పాటించారు. డాలరుతో రూపాయి మారకం విలువ 95.84గా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 96.61 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4,469 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. సెన్సెక్స్ ఉదయం 73,935.83 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,346.17) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభనష్టాల మధ్య కదలాడింది. ఇంట్రాడేలో 73,807.30 - 74,544.24 మధ్య కదలాడిన సూచీ.. చివరికి 13.84 పాయింట్ల లాభంతో 74,360.01 వద్ద ముగిసింది. నిఫ్టీ 10.95 పాయింట్ల లాభంతో 23,416.55 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో



టైటాన్, ఎటర్నల్, ఐటీసీ, టెక్ మహీంద్రా, ఎస్‌బీఐ షేర్లు లాభపడ్డాయి. ఇన్ఫోసిస్, బజాజ్ ఫిన్‌సర్వ్, అల్ట్రాటెక్ సిమెంట్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, అదానీ పోర్ట్స్ షేర్లు నష్టాలు చవిచూశాయి.

# మోటోరొలా ఎడ్జ్ 70 ప్రోప్లస్

**న్యూఢిల్లీ:**ప్రముఖ మొబైల్ తయారీ కంపెనీ మోటోరొలా తన ఎడ్జ్ సిరీస్‌లో కొత్త స్మార్ట్‌ఫోన్‌ను లాంచ్ చేసింది. ఎడ్జ్ 70 ప్రో+ పేరిట ప్రీమియం సెగ్మెంట్‌లో కొత్త ఫోన్‌ను విడుదల చేసింది. 6500ఎంఏహెచ్ బ్యాటరీ, 50 ఎంపీ కెమెరా, మీడియాటెక్ డైమెన్సిటీ ప్రాసెసర్‌తో ఈ ఫోన్‌ను తీసుకొచ్చింది. ధర, ఇతర వివరాలు ఇవీ..మోటో ఎడ్జ్ 70 ప్రో+ ప్రత్యేకతలు: 6.8 అంగుళాల 1.5ని సూపర్ ఊఆ+ ఎక్స్‌ట్రీమ్ అమోలెడ్ క్వాడ్- కర్వ్‌డ్ డిస్‌ప్లే.144ఊళి రిఫ్రెష్ రేటు, 5,200 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్.కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 7ఐ ప్రొటెక్షన్.6500 ఎంఏహెచ్ సిలికాన్ కార్బన్ బ్యాటరీ.90చి వైర్డ్ టర్బో ఛార్జింగ్ + 15చి వైర్‌లెస్ ఛార్జింగ్ సదుపాయం.ముందువైపు 50ఎంపీ సెల్ఫీ కెమెరా.



# రాజేష్ ఎక్స్‌పోర్ట్స్ అవకతవకలు

- రూ.15.15 లక్షల కోట్ల ఆదాయమంటూ మోసం
- చర్యలు చేపట్టిన సెబీ

**న్యూఢిల్లీ:**బెంగళూరుకు చెందిన ప్రముఖ జ్యువెలరీ రిటైల్ సంస్థ రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్‌పై సెబీ చర్యలు చేపట్టింది. ఈ సంస్థ ఆర్థిక అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో కంపెనీ, దాని ప్రమోటర్ అయిన రాజేశ్ మెహతాను సెక్యూరిటీస్ మార్కెట్ల నుంచి తాత్కాలికంగా నిషేధించింది. దీంతో నేటి స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ సెషన్‌లో ఈ కంపెనీ షేర్లు పతనమయ్యాయి. దీని షేరు విలువ 5శాతం నష్టంతో లోయర్ సర్క్యూట్‌ను తాకి రూ.103.92కు పడిపోయింది.ఈ పరిణామాల నేపథ్యంలో నేటి ట్రేడింగ్‌లో ఎల్ఐసీ షేర్లు కూడా కుంగిపోయాయి. ఒక దశలో షేరు విలువ 1శాతానికి పైగా పడిపోయింది. ఉదయం 11 గంటల సమయంలో నిఫ్టీలో ఎల్ఐసీ షేరు విలువ 0.77శాతం నష్టంతో రూ.399.80 వద్ద ట్రేడ్ అవుతోంది. రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్ కంపెనీలో ఎల్ఐసీ కి 10.80శాతం వాటాలు ఉండటమే ఈ



నష్టాలకు కారణం.రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్ ఏకీకృత ఆదాయంలో 97-99శాతం దాని విదేశీ అనుబంధ సంస్థల నుంచే సమకూరుతోంది. ముఖ్యంగా స్విట్జర్లాండ్ కేంద్రంగా పనిచేసే సంస్థ నుంచి ఈ ఆదాయం వచ్చినట్లు కంపెనీ పేర్కొంది. అయితే, ఆ అనుబంధ సంస్థల ఆర్థిక లావాదేవీలను మాత్రం కంపెనీ బహిర్గతం చేయలేదు. దీంతో సెబీ తనిఖీలు చేపట్టగా.. కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. స్విట్జర్లాండ్ సంస్థ స్టాండ్‌ఎలోన్ ఆదాయం చాలా తక్కువగా ఉండగా.. రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్ మాత్రం దాన్ని పెంచి చూపించినట్లు సెబీ దర్యాప్తులో గుర్తించింది. అలా 2021-2025 ఆర్థిక సంవత్సరాల మధ్య దాదాపు రూ.15.15లక్షల కోట్ల ఆదాయం సమకూరినట్లు కంపెనీ తప్పుడు ప్రచారం చేసుకుందని సెబీ వెల్లడించింది.

## విప్రో సీఈఓ పల్లియాకు రూ.49.64 కోట్ల పారితోషికం

దిల్లీ: గత ఆర్థిక సంవత్సరం (2025-26)లో విప్రో ముఖ్య కార్యనిర్వాహక అధికారి (సీఈఓ), మేనేజింగ్ డైరెక్టర్(ఎండీ) శ్రీనివాస్ పల్లియా మొత్తంగా రూ.49.64 కోట్ల (5.29 మిలియన్ డాలర్లు) పారితోషికాన్ని అందుకున్నారు. ఇందులో వేతనాలు, ఇతర భత్యాలు 1.65 మిలియన్ డాలర్లు కాగా.. కమిషన్, వేరియబుల్ పే రూపేణా 1.05 మిలియన్ డాలర్లు, ఇతర ప్రయోజనాల కింద 2.47 మిలియన్ డాలర్లు, దీర్ఘకాలిక కంపెన్సేషన్ కింద 1,08,464 డాలర్లను ఆయన పొందినట్లు విప్రో వార్షిక నివేదిక తెలిపింది. విప్రో సీఈఓ, ఎండీగా ఏప్రిల్ 2024లో పల్లియా బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. 2025-26లో విప్రో ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ రిషద్ ప్రేమ్‌జీకి 7,73,231 డాలర్ల (సుమారు రూ.7.25 కోట్లు) పారితోషికం లభించింది. ఎటువంటి స్టాక్ ఆప్షన్స్ ఆయనకు ఇవ్వలేదు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో నమోదైన ఏకీకృత నికర లాభం వృద్ధిపై 0.35 శాతం కమిషన్‌ను ప్రేమ్‌జీ, పల్లియా పొందారు. కంపెనీ ముఖ్య ఆర్థిక అధికారి అపర్ణ సి అయ్యర్ 7,17,749 డాలర్ల (రూ.6.73 కోట్లు) పారితోషికం అందుకున్నారు.విప్రోకు పోటీ సంస్థలైన ఇన్ఫోసిస్, టీసీఎస్ సీఈఓల వేతనాలను గమనిస్తే.. ఇన్ఫోసిస్ సీఈఓ, ఎండీ సలీల్ పరేఖ్ 2025-26లో మొత్తంగా రూ.82.60 కోట్ల పారితోషికం పొందారు. ఈ మూడు సంస్థలో సారథుల్లో పరేఖ్‌కే అత్యధిక పారితోషికం లభించింది. టీసీఎస్ సీఈఓ, ఎండీ కృతివాసన్ రూ.28 కోట్ల పారితోషికాన్ని అందుకున్నారు. ఇన్ఫోసిస్, టీసీఎస్ సీఈఓల పారితోషికాల మధ్యలో విప్రో సీఈఓ పారితోషికం ఉంది.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

## బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,45,800 (22 క్యారెట్లు) | ₹ 1,59,060 (24 క్యారెట్లు) |
|---|---|

## వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్ ₹ 2,95,000

# డేటా సెంటర్ల హబ్‌గా హైదరాబాద్

## 151 మెగావాట్లకు చేరిన సామర్థ్యం

## నైట్ ఫ్రాంక్ నివేదికలో వెల్లడి

**హైదరాబాద్:** భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న డేటా సెంటర్ల మార్కెట్లలో ఒకటిగా హైదరాబాద్ అవతరించింది. ఐటీ రంగానికే పరిమితం కాకుండా మౌలిక సదుపాయాల కేంద్రంగానూ హైదరాబాద్ రూపాంతరం చెందుతోంది. 2022లో 60.9 మెగావాట్ల (ఎండబ్ల్యూ) వద్ద ఉన్న డేటా సెంటర్ల సామర్థ్యం 2025 నాటికి 151.4 మెగావాట్లకు చేరుకుంది. మరో 1.9 గిగావాట్ల సామర్థ్యం గల ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని, ఈ విషయంలో ముంబయి తర్వాత స్థానం హైదరాబాద్‌దేనని స్థిరాస్తి సేవల సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా తన తాజా నివేదిక 'ఇండియా డేటా సెంటర్ మార్కెట్ అప్‌డేట్-2025'లో వెల్లడించింది.ఖరీదైన నగరాలతో పోలిస్తే హైదరాబాద్ డేటా సెంటర్లకు అనుకూలమైన ప్రత్యామ్నాయంగా మారింది. విపత్తులు తలెత్తని భౌగోళిక అనుకూలత ఉండటం ప్రధాన బలంగా నిలుస్తోందని నివేదిక పేర్కొంది. దీనికి తోడు హై-డెన్సిటీ గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్లు (జీపీయూ), లిక్విడ్ కూలింగ్ వంటి వాటికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలూ కలిసొస్తున్నాయని తెలిపింది. ఎన్‌టీటీ, అదానీకనెక్స్ వంటి సంస్థలు ఇక్కడ తమ కార్యకలాపాలను వేగంగా విస్తరిస్తున్నట్లు నైట్ ఫ్రాంక్ పేర్కొంది.ప్రముఖ అంతర్జాతీయ సంస్థలు తమ డేటా



సెంటర్ల కోసం హైదరాబాద్‌ను ఎంచుకుంటున్నాయి. మైక్రోసాఫ్ట్ తన ఇండియా సౌత్ సెంట్రల్ డేటా సెంటర్‌ను ఈ ఏడాదిలో ప్రారంభించనుంది. అమెజాన్ వెబ్ సర్వీసెస్ ఇప్పటికే నగరంలో మూడు జోన్‌లను నిర్వహిస్తోంది. దీని మార్కెట్ వాటా 46 శాతం ఉంది. మరోవైపు ఒరాకిల్ సైతం దేశీయంగా తన సామర్థ్యాన్ని విస్తరించుకునేందుకు హైదరాబాద్‌లో కొత్త డేటా సెంటర్‌ను ప్రకటించింది.భారతదేశ డేటా సెంటర్ మార్కెట్ కీలక దశకు చేరుకుందని నైట్ ఫ్రాంక్ వెల్లడించింది. దేశంలోని ఏడు ప్రధాన నగరాల మార్కెట్లలో (ముంబయి, చెన్నై, దిల్లీ, బెంగళూరు, పుణె, హైదరాబాద్, కోల్‌కతా) లైవ్ ఐటీ సామర్థ్యం 2025 చివరి నాటికి 1.6 గిగావాట్లను దాటింది. ఏఐ, క్లౌడ్, డేటా స్థానికీకరణ నిబంధనల కారణంగా డేటా సెంటర్ల రంగంలో అనూహ్యమైన వృద్ధి కనిపిస్తోంది. 2024లో దేశంలో కొత్తగా 361.6 మెగావాట్ల సామర్థ్యం అందుబాటులోకి రాగా, 2025లో ఇది మరింత పెరిగి 371.5 మెగావాట్లకు చేరింది. ఈ సందర్భంగా నైట్ ఫ్రాంక్ ఇండియా సీఎండీ శిశిర్ బైజల్ మాట్లాడుతూ.. భారతీయ డేటా సెంటర్ల రంగం సంప్రదాయ ఐటీ హబ్‌లకే పరిమితం కాకుండా, కొత్త ప్రాంతాలకూ ఇవి విస్తరిస్తుండటం ప్రత్యేకత అని పేర్కొన్నారు.

# వస్తోంది అణు చెత్త బుట్ట!

**న్యూఢిల్లీ:**విద్యుత్ అవసరాల కోసం అణు కేంద్రాలను నిర్మించుకుంటున్న దేశాల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. కానీ వాటి రేడియోధార్మిక వ్యర్థాల తొలగింపు మాత్రం ఇప్పటికీ చిక్కు ప్రశ్నే! దానికి శాశ్వత పరిష్కార మార్గంగా.. ప్రపంచంలోనే తొలిసారిగా ఓ వినూత్న 'అణు చెత్తబుట్ట'ను రూపొందించింది ఫిన్లాండ్. త్వరలోనే అక్కడ కార్యకలాపాల ప్రారంభానికి అనుమతులు మంజూరయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అణు కేంద్రాల్లో వెలువడే వ్యర్థాలు చాలా ప్రమాదకరం. అవి రేడియోధార్మికత పరంగా కొన్ని వేల ఏళ్ల పాటు క్రియాశీలకంగా ఉంటాయి. 1950ల నుంచే ప్రపంచంలో అణు కేంద్రాల కార్యకలాపాలు మొదలైనా.. వాటి వ్యర్థాల తొలగింపు సమస్యకు మాత్రం సరైన పరిష్కారం దొరకలేదు. ఎక్కువ వ్యర్థాలను నీటి కొలనుల్లో శీతలీకరిస్తూ తాత్కాలికంగా ఇబ్బందిని అధిగమిస్తున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కార మార్గంగా అణు వ్యర్థాల కోసం అంకాలో అనే 'చెత్తబుట్ట'ను నిర్మించింది ఫిన్లాండ్.

**ఎలా నిర్మించారు?**

ఆగ్నేయ ఫిన్లాండ్‌లోని యూరజోకీ ప్రాంతంలో అంకాలో ఉంది. దీని నిర్మాణం కోసం 190 కోట్ల ఏళ్ల నాటి భారీ శిలను పేల్చి సొరంగాలు తవ్వారు. భూ ఉపరితలం నుంచి 433 మీటర్ల దిగువ వరకూ రంధ్రాలు చేశారు. వాటిలోనే అణు వ్యర్థాలను నిల్వ ఉంచుతారు. అంకాలోకు ఫిన్లాండ్ అణు భద్రత ప్రాధికార సంస్థ నుంచి ఈ నెలలోనే తుది అనుమతులు మంజూరయ్యే అవకాశముంది.

**లక్ష ఏళ్ల పాటు సీల్**

అణు ధార్మిక పదార్థం ప్రమాదకర స్థాయి నుంచి సహజసిద్ధ యురేనియం ధాతువు స్థితికి తిరిగి చేరుకోవడానికి దాదాపు లక్ష



ఏళ్లు పడుతుంది. అందుకే.. అణు వ్యర్థాలను నింపిన తర్వాత అంకాలోను లక్ష ఏళ్ల పాటు సీల్ వేసి ఉంచుతారు. కాపర్ క్యానిస్టర్లు తుప్పు పట్టడం, భూకంపం వంటి పరిణామాలతో ఈ రకమైన నిల్వ విధానానికి కొన్ని ముప్పులు పొంచి ఉన్నప్పటికీ.. వాటివల్ల నష్టం జరిగే అవకాశాలు తక్కువేనని తమ పరిశీలనలో తేలినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

**ఎలా నిల్వ చేస్తారు?**

తొలుత- అణు కేంద్రాల్లో ఉపయోగించిన ఇంధన రాడ్ల చుట్టూ తుప్పు పట్టని, మందమైన కాపర్ క్యానిస్టర్లను ఏర్పాటుచేస్తారు. ఆ రాడ్లను 433 మీటర్ల లోతున్న రంధ్రాల్లోకి దించి.. బెంటోనైట్ క్లేను నింపుతారు. ఈ క్లే తడిచినప్పుడు ఉబ్బి.. సీల్‌లా పనిచేస్తుంది. అంకాలోలో 6,500 టన్నుల వరకూ యురేనియంను ఉంచవచ్చు. అంటే- ఫిన్లాండ్‌లోని మొత్తం 5 అణు రియాక్టర్ల నుంచి వెలువడే వ్యర్థాలను ఇక్కడ నిల్వ చేయవచ్చు. వందేళ్ల పాటు ఈ 'చెత్తబుట్ట'లో అణు వ్యర్థాలను వేసి, ఆ తర్వాత సీల్ చేస్తారు.

## విదేశీ మదుపర్లకు దన్ను

విధించే దీర్ఘకాల మూలధన లాభాల పన్నును పూర్తిగా తొలగించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఆదాయపు పన్ను చట్టంలో సవరణలు చేస్తూ తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌కు ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపినట్లు జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. ఆర్డినెన్స్‌పై రాష్ట్రపతి సమ్మతి తర్వాత ఈ మార్పులు అమల్లోకి వస్తాయని సదరు వర్గాలు పేర్కొన్నాయి.ప్రస్తుతం విదేశీ మదుపర్లు 12 నెలల కంటే ఎక్కువకాలం పాటు హోల్డ్ చేసుకునే బాండ్లు, లిస్టెడ్ షేర్లపై 12.5శాతం లాంగ్-టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ పన్నును చెల్లిస్తున్నారు. తాజా ఆర్డినెన్స్‌తో భారత ప్రభుత్వ సెక్యూరిటీస్‌లో విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లు చేసే పెట్టుబడులకు ఈ పన్నును పూర్తిగా రద్దు చేయనున్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు ప్రభుత్వ బాండ్ల నుంచి పొందే వడ్డీ ఆదాయం పైనా వీరికి పన్ను భారాన్ని తగ్గించే అవకాశాలు కన్పిస్తున్నాయి. ప్రస్తుతం ఈ వడ్డీ ఆదాయంపై విదేశీ మదుపర్లు 20శాతం విత్‌హోల్డింగ్ ట్యాక్స్‌ను చెల్లిస్తున్నారు. ఈ పన్నుపై గతంలో 5శాతం రాయితీ ఉండగా.. 2023లో కేంద్రం దాన్ని తొలగించింది.పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ఇటీవల దేశీయ కరెన్సీ విలువ దారుణంగా పతనమైంది. దీనికితోడు ఈ ఏడాది దాదాపు రూ.2.5లక్షల కోట్ల విలువైన పెట్టుబడులను విదేశీ మదుపర్లు భారత స్టాక్ మార్కెట్ల నుంచి తరలించారు. దీంతో పన్ను మినహాయింపులు కల్పించాలని పెద్దఎత్తున డిమాండ్లు వినిపించాయి. ఎల్‌టీసీజీ పన్నును రద్దు చేస్తే దీర్ఘకాలిక పెట్టుబడిదారులకు గొప్ప ప్రోత్సాహం ఇచ్చినట్లు పలువురు ప్రముఖ మదుపర్లు అభిప్రాయాలు వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో కేంద్రం తాజాగా దీనిపై నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. భవిష్యత్తులో ప్రపంచస్థాయి పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు మరిన్ని కీలక చర్యలు చేపట్టాలని కేంద్రం నిర్ణయించినట్లు సమాచారం

## వైభవ్ సూర్యవంశీ ఆదాయపు పన్ను ఎవరు చెల్లించాలి?

**న్యూఢిల్లీ:**తన అసాధారణ బ్యాటింగ్ ప్రతిభతో ఈసారి ఐపీఎల్‌లో అందరి దృష్టినీ ఆకర్షించాడు వైభవ్ సూర్యవంశీ. 15 ఏళ్ల వయసులోనే ఐపీఎల్ కాంట్రాక్టులు, స్పాన్సర్‌షిప్ డీల్స్, ఎండార్స్‌మెంట్లతో రూ.7 కోట్ల వరకు ఆర్జించాడు ఈ బిహారీ బుడతడు. మరి వైభవ్ సంపాదించిన దానికి ట్యాక్స్ ఎవరు కట్టాలి? ఆదాయపు పన్ను చట్టంలో మైనర్లకు సంబంధించి ఉన్న నిబంధనలేం చెబుతున్నాయి?భారతీయ ఆదాయపు పన్ను చట్టాల ప్రకారం.. 18 ఏళ్లలోపు వారిని మైనర్లుగా పరిగణిస్తారు. వారు ఆర్జించిన ఆదాయం తల్లిదండ్రుల ఆదాయంగానే పరిగణిస్తారు. సాధారణంగా పిల్లల పేర్ల మీద చేసే ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పెట్టుబడులు ఈ కోవలోకి వస్తాయి. మైనర్ పేరు మీద వచ్చిన ఆదాయాన్ని ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 64 ప్రకారం.. మైనర్ల ఆదాయాన్ని వారి తల్లిదండ్రులలో ఎవరికైతే ఎక్కువ పన్ను ఆదాయం ఉంటుందో వారి ఆదాయంతో కలిపి పన్ను విధిస్తారు.

**వైభవ్ కేసు భిన్నం**

ఐపీఎల్ స్టార్ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ విషయంలో ఒక మినహాయింపు ఉంది. ఒక మైనర్ తన సొంత ప్రతిభ, ప్రత్యేక నైపుణ్యాలు, శారీరక శ్రమ, వృత్తిపరమైన కృషి ద్వారా సంపాదించే ఆదాయాన్ని తల్లిదండ్రుల ఆదాయంతో కలపకూడదు. వైభవ్ సంపాదనంతా అతడి క్రికెట్ కాంట్రాక్టులు, మ్యాచ్ ఫీజులు, స్పాన్సర్‌షిప్‌లు, ఎండార్స్‌మెంట్ల ద్వారా వచ్చింది కాబట్టి.. అతడి క్రీడా నైపుణ్యానికి దక్కిన ప్రతిఫలంగా భావిస్తారు. ఈ ఆదాయాన్ని వైభవ్ సొంత ఆదాయంగానే పరిగణిస్తారు.

ఒక్క క్రికెటర్ అనే కాదు.. బాల నటులు, గాయకులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు, రియాలిటీ షోలలో పాల్గొనే ప్రతిభావంతులైన మైనర్లందరికీ




ఇదే నిబంధన వర్తిస్తుంది. ఇలా వచ్చిన ఆదాయానికి మైనర్లు వారి పేరుమీదే ఆదాయపు పన్ను రిటర్నులను దాఖలు చేయాల్సి ఉంటుంది. మైనర్ తరఫున వారి తల్లిదండ్రులు లేదా చట్టబద్ధమైన సంరక్షకులు ప్రతినిధిగా వ్యవహరిస్తూ రిటర్నుల దాఖలు ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది.

వైభవ్ సూర్యవంశీ ఆదాయాన్ని వృత్తి లేదా వ్యాపారం ద్వారా ఆదాయంగా పరిగణిస్తారు. కాబట్టి, వీరు ఐటీఆర్-3 లేదా ఐటీఆర్-4 దాఖలు చేయాల్సి ఉంటుంది. పన్ను ఆదాయం వ్యక్తిగత ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు వర్తించే శ్లాబులే సూర్యవంశీకి వర్తిస్తాయి. సూర్యవంశీ ఆదాయం రూ.కోట్లలో ఉంది కాబట్టి దాదాపు 30 శాతం వరకు పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

## ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు ఒకే..

ఫోర్స్ స్టేషన్, ఎయిర్ పోర్టు నిర్మాణానికి సానుకూలంగా ఉన్నట్లు కేంద్రం తెలిపింది. కేంద్రం నిర్ణయంపై సంతోషం వ్యక్తం చేశారు ఎమ్మెల్యే పాయల్ శంకర్. ఎయిర్ పోర్ట్ నిర్మాణంపై సానుకూలంగా ఉన్న ప్రధాని మోడీ, సీఎం రేవంత్ కు ఎమ్మెల్యే పాయల్ శంకర్ కృతజ్ఞతలు తెలిపారు.

## కువైట్ ఎయిర్‌పోర్టుపై దాడి అమెరికా పనే

అభివర్ణించింది. ఇదిలాఉండగా.. విమానాశ్రయంపై దాడికి సంబంధించి సీసీటీవీలో రికార్డయిన దృశ్యాలను కువైట్ జనరల్ డైరెక్టరేట్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ విడుదల చేసింది. దీనిలో డ్రోన్ ఎయిర్‌పోర్టును ఢీకొంటున్న దృశ్యాలున్నాయి. ఈ ఘటనలో ఒక భారతీయుడు ప్రాణాలు కోల్పోగా.. 63 మంది గాయపడ్డారు. దీంతో కార్యకలాపాలు నిలిచి పోయాయి.



జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
5 జూన్ 2026

# ఆశయమూ లేదు.. అభివృద్ధీ లేదు


- రాష్ట్ర ప్రభుత్వంపై డీకే అరుణ విమర్శలు
- పెండింగ్ ప్రాజెక్టులపై ప్రభుత్వం నిర్లక్ష్యం
- పబ్లిసిటీ రాజకీయాలకే సీఎం పరిమితం అన్న ఎంపీ
- గద్వాల జిల్లాలో అవినీతి పెరిగిందని ఆరోపణ
- హామీల అమలుకు ప్రజాపోరాటాలు అవసరమని పిలుపు



**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి మే 4 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టమైన అభివృద్ధి దృక్పథం లేదని, ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ విమర్శించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ అభియాన్ కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడారు. రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు నిరాశ చెందారని, ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచి ముఖ్యమంత్రి ఉన్నప్పటికీ అభివృద్ధి కనిపించడం లేదన్నారు. జూరాల ప్రాజెక్టు సేఫ్టీ బ్రిడ్జి, ర్యాలంపాడు ప్రాజెక్టు మరమ్మతులు, గట్టు లిఫ్ట్, తుమ్మిళ్ల లిఫ్ట్ వంటి కీలక ప్రాజెక్టులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని పేర్కొన్నారు. కొత్త ప్రాజెక్టుల ప్రతిపాదనల కంటే ముందుగా పెండింగ్ పనులు పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రచారం, ప్రజాదరణ కోసమే ఎక్కువగా శ్రద్ధ చూపుతున్నారని, రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టడం లేదని ఆరోపించారు. హెలికాప్టర్లలో కాకుండా రోడ్లపై ప్రయాణిస్తే ప్రజల సమస్యలు, రోడ్ల దుస్థితి తెలుస్తుందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో మౌలిక వసతుల అభివృద్ధి నిలిచిపోయిందని, రోడ్లపై గుంతలు కూడా పూడ్చడం లేదన్నారు. గద్వాల జిల్లాలో భూకబ్జాలు, ఇసుక, మట్టి, బియ్యం అక్రమ వ్యాపారాలు పెరిగాయని ఆరోపించిన ఆమె, ఇంతటి అవినీతి గతంలో ఎప్పుడూ చూడలేదన్నారు. ప్రజలు ప్రశ్నిస్తేనే అవినీతికి అడ్డుకట్ట పడుతుందని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో అర్హులకు కాకుండా పార్టీ కార్యకర్తలకు ప్రాధాన్యం ఇస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్నారు. రైతు భరోసా, మహిళలకు ఇచ్చిన హామీలు, నిరుద్యోగ సమస్యల విషయంలో ప్రభుత్వం వెనుకంజ వేసిందని విమర్శించారు. రైతులకు పూర్తి స్థాయిలో మద్దతు అందడం లేదని, ధాన్యం కొనుగోళ్లలో తరుగు పేరిట నష్టం జరుగుతోందన్నారు. ప్రభుత్వం హామీలు అమలు చేసేలా ప్రజలతో కలిసి ఉద్యమాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

కేంద్ర ప్రభుత్వం అవినీతి ఆరోపణలు లేకుండా పాలన సాగిస్తోందని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని అన్నారు. తెలంగాణలో బీజేపీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేపట్టే ప్రతి పోరాటంలో తాను భాగస్వామ్యం అవుతానని డీకే అరుణ స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ పార్లమెంటరీ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి స్నిగ్ధారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్లు, జిల్లా నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.




ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని చెబుతూ భారీ జీతాలు పొందుతున్న కొందరు ఉపాధ్యాయులు తమ సొంత పిల్లలను మాత్రం కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించడం చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ విద్యపై ప్రజల్లో నమ్మకం పెంచాల్సిన బాధ్యత ఉన్న ఉపాధ్యాయులే తమ పిల్లల విషయంలో ప్రభుత్వ పాఠశాలలను దూరం పెడుతుండటంపై పలువురు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు.

# ప్రభుత్వ స్కూళ్లలో బోధన.. పిల్లలు మాత్రం ప్రైవేట్ స్కూళ్లలో..!

- "మీ బోధనపై మీకే నమ్మకం లేకుంటే.. ప్రజలు ఎలా నమ్మాలి సార్?"

**భూదాన్ పోచంపల్లి, జూన్ 3 (జనం సాక్షి):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠాలు చెబుతూ భారీ జీతాలు పొందుతున్న కొందరు ఉపాధ్యాయులు తమ సొంత పిల్లలను మాత్రం కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో చదివించడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ప్రభుత్వ విద్య గొప్పదని వేదికలపై చెప్పే ఉపాధ్యాయులు, అధికారులు తమ పిల్లల విషయంలో మాత్రం ప్రభుత్వ పాఠశాలలను ఎందుకు పక్కన పెడుతున్నారు అనే ప్రశ్న ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఆంగ్ల మాధ్యమం, డిజిటల్ తరగతులు, మెరుగైన వసతులు ఉన్నాయని ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుంటే.. అదే వ్యవస్థపై ఉపాధ్యాయులకే నమ్మకం లేకపోవడం విడ్డూరంగా మారింది. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించలేని వారు ఇతరుల పిల్లలకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని ఎలా చెప్పగలరని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ విద్యపై ప్రజల్లో విశ్వాసం పెరగాలంటే ముందు ఉపాధ్యాయులు, అధికారులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ఆదర్శంగా నిలవాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. మాటల్లో ప్రభుత్వ విద్య గొప్పదని చెప్పడం కాదు.. చేతల్లో చూపించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. "ప్రభుత్వ స్కూల్ బాగుందని చెప్పే వారు తమ పిల్లలను అక్కడే చదివిస్తేనే ప్రజలు నమ్ముతారు.. లేదంటే ఇవన్నీ కేవలం ప్రచారాలుగానే మిగిలిపోతాయి" అని స్థానికులు మండిపడుతున్నారు.



## ఆగిపోయిన భవనానికి నిధులు మంజూరు

**మంత్రి వడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**ముస్తాబాద్ జూన్ 4( జనం సాక్షి) :** ముస్తాబాద్ మండల కేంద్రంలోని ఎస్సీలు 15వేల జనాభా గల సంఘానికి మండలంలో సంఘ భవనం లేక పేద విద్యార్థులు విద్య అందక మధ్యలోనే ఆపడం జరుగుతుంది దాన్ని దృష్టిలో పెట్టుకొని గత ప్రభుత్వంలో భవనాన్ని మొదలుపెట్టి మధ్యలోనే ఆపడం జరిగింది. కాంగ్రెస్ మంత్రి వర్యులు లక్ష్మణ్ కుమార్ దృష్టికి పోతుగల్ సర్పంచ్, పెద్ది గారి యాదమ్మ శ్రీనివాస్, తుర్కపల్లి సర్పంచ్, రోడ్డ భాగ్యమ్మ భాను మంత్రి దృష్టికి తీసుకు వెళ్లడంతో మంత్రికి సమస్యను వివరించడంతో వెంటనే స్పందించి నిధులు మంజూరు చేయించి నూతన భవనాన్ని నా చేతుల మీదికి ప్రారంభిస్తా అని సర్పంచులకు హామీ ఇచ్చినట్లు సర్పంచులు తెలిపారు. మంత్రి గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన కాంపెల్లి శ్రీనివాస్, చుంచు మల్లన్న, కొమ్మెట రాజు, సాకలి రమేష్, కొమ్ము బాలయ్య, చుంచు బాబు తెలిపారు

# అభివృద్ధితో గ్రామాలు ఆదర్శంగా నిలవాలి

- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి
- రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలి.
- ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక గ్రామసభలో కలెక్టర్ పిలుపు



రంగారెడ్డి జిల్లా ప్రతినిధి: (జనంసాక్షి) : ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం ఇబ్రహీంపట్నం మండలం కర్ణంగూడ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని గ్రామస్థులతో నేరుగా మమేకమయ్యారు. గ్రామాభివృద్ధి, వ్యవసాయం, పారిశుద్ధ్యం, విద్య, మౌలిక సదుపాయాలు, ఓటరు జాబితా పునర్విమర్శ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. వర్షాలు ఆలస్యంగా ప్రారంభమయ్యే పరిస్థితులు ఉన్నందున రైతులు వ్యవసాయ శాఖ సూచనల మేరకు పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. అధిక నీటి అవసరమున్న వరి సాగుపై జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవాలని పేర్కొన్నారు. వర్షాకాలంలో నీటి కాలుష్యం, దోమల వ్యాప్తి, అంటువ్యాధుల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు.

వర్షాలు ప్రారంభమైన వెంటనే గ్రామంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని, ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను సంరక్షించే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. యూరియా, డీఏపీ తదితర ఎరువులను ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా మాత్రమే అందజేయనున్నట్లు తెలిపారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్‌కు యాప్‌ను అనుసంధానం చేసినందున రైతులు తప్పనిసరిగా నమోదు పూర్తి చేసుకోవాలని సూచించారు. భూమి విస్తీర్ణం, సాగు చేస్తున్న పంటల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని, తప్పుడు వివరాలు నమోదు చేస్తే ఎరువుల కేటాయింపులో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. కర్ణంగూడ ప్రభుత్వ పాఠశాల పునఃప్రారంభానికి గ్రామస్థులు ముందుకు రావాలి. గ్రామంలో మూతపడిన ప్రాథమిక పాఠశాలను తిరిగి ప్రారంభించేందుకు గ్రామస్థులు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

డీసీపీ నారాయణ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో పెరుగుతున్న వాహనాల సంఖ్యకు అనుగుణంగా ప్రజలు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. గ్రామాల్లో గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల వినియోగం గమనిస్తే వెంటనే డయల్-100 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తిరుమలరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ మోహన్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సురేష్, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ పెద్దలు, మహిళలు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అంతర్‌రాష్ట్ర వాహన దొంగ అరెస్ట్


- పార్క్ చేసిన బైక్‌లనే లక్ష్యంగా చోరీలు
- రూ.8 లక్షల విలువైన నాలుగు బైక్‌లు స్వాధీనం
- నిందితుడికి జ్యుడీషియల్ రిమాండ్




**శంషాబాద్, జూన్ 4 (జనంసాక్షి):** అంతర్‌రాష్ట్ర స్థాయిలో ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న ఓ నిందితుడిని శంషాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి సుమారు రూ.8 లక్షల విలువైన నాలుగు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో నమోదైన నాలుగు వాహన చోరీ కేసులను ఛేదించారు.

పోలీసుల వివరాల ప్రకారం మహబూబ్‌నగర్ జిల్లా భగీరథ కాలనీకి చెందిన విశ్వకర్మ మోహన్‌కుమార్ అలియాస్ ఉండెకోడె మోహన్ (32) వివిధ ప్రాంతాల్లో పార్క్ చేసిన ఖరీదైన ద్విచక్ర వాహనాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నాడు. నిందితుడి కదలికలపై నిఘా పెట్టిన పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా రాయచూర్, కర్నూలు, ఆర్‌జీఐఏ, ఆదోని పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన నాలుగు వాహన చోరీలకు పాల్పడినట్లు అంగీకరించినట్లు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి రాయచూర్ పరిధికి చెందిన రాయల్ ఎన్‌ఫీల్డ్, కర్నూలు పరిధికి చెందిన పల్సర్, ఆర్‌జీఐఏ పరిధికి చెందిన రాయల్ ఎన్‌ఫీల్డ్ హంటర్-350, ఆదోని పరిధికి చెందిన మరో రాయల్ ఎన్‌ఫీల్డ్ హంటర్-350 మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాల మొత్తం విలువ సుమారు రూ.8 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. శంషాబాద్ ఇన్‌స్పెక్టర్ సంజీవ్ పర్యవేక్షణలో డీఐ పవన్‌కుమార్ నేతృత్వంలో ఈ కేసును ఛేదించినట్లు వెల్లడించారు. అనంతరం నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరచగా కోర్టు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. కేసుకు సంబంధించిన మరిన్ని వివరాలపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు

# సిఎంసి పరిధిలో పౌరాభివృద్ధి కార్యక్రమాలపై సమగ్ర సమీక్ష





**శేరిలింగంపల్లి, జూన్ 04 (జనంసాక్షి) :** సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం (న్యాక్ భవన్)లో గురువారం కార్పొరేషన్ కమిషనర్ సృజన అధ్యక్షతన వివిధ విభాగాల అధికారులతో కలిసి సమీక్ష సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేషన్ పరిధిలో అమలవుతున్న వివిధ పట్టణాభివృద్ధి మరియు పౌరసేవల కార్యక్రమాల పురోగతిని అధికారులు అంతా కలిసి చర్చించారు. సమీక్షించారు. లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ దరఖాస్తుల పరిష్కారం, బిల్డ్‌నౌ ద్వారా అందుతున్న భవన నిర్మాణ అనుమతి దరఖాస్తులపై ప్రత్యేక దృష్టిని సారించినట్లు సియంసి కమిషనర్ తెలియజేశారు. అంతేగాకుండా ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ దరఖాస్తులు, పెండింగ్ కోర్టు కేసులు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, ఆక్రమణల తొలగింపు, రహదారుల విస్తరణకు సంబంధించిన భూసేకరణ అంశాల పురోగతిని సంబంధిత ఆయా శాఖల అధిపతులను అడిగి తెలుసుకోవడం జరిగిందని ఆమె వివరించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మాన్సూన్ సన్నద్ధత చర్యలపై ప్రత్యేక దృష్టి సాధించాలని, శిథిలావస్థలో ఉన్న భవనాలు, సెల్లార్ తవ్వకాలు మరియు అనధికారిక హోర్డింగ్‌లను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని, ప్రజల భద్రతకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు.

పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను నిర్ణీత గడువుల్లో పరిష్కరించాలని, ప్రాధాన్యతా పనులను వేగవంతం చేయాలని, ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన సేవలు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సమావేశంలో కమిషనర్ సూచించారు. రహదారుల విస్తరణ, ఆక్రమణల తొలగింపు కార్యక్రమాల పురోగతిని సమీక్షిస్తూ సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి అడ్డంకులను అధిగమించి మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఈ సందర్భంగా కమిషనర్ సూచించారు.

సమర్థవంతమైన పట్టణ పాలనకు సమగ్ర ప్రణాళిక, నిరంతర పర్యవేక్షణ మరియు శాఖల మధ్య సమన్వయం ఎంతో అవసరమని కమిషనర్ పునరుద్ఘాటించారు. పారదర్శకమైన, ప్రజా కేంద్రిత పాలన ద్వారా మెరుగైన పౌర సేవలు అందించడం, పట్టణ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం మరియు సైబరాబాద్ ప్రజల జీవన ప్రమాణాలను మరింత మెరుగుపరచడం పట్ల కార్పొరేషన్ కట్టుబడి ఉందని ఆమె మీడియాకు వివరించారు.

# రైతు రిజిస్ట్రీ నమోదు తప్పనిసరి

**ప్రతి రైతు ఫార్మర్ ఐడీ పొందాలని సూచన**

- సంక్షేమ పథకాల లబ్ధికి రిజిస్ట్రేషన్ కీలకం
- జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపాలని అధికారులకు ఆదేశం
- చిన్నకుంట పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని హామీ



**మొయినాబాద్, జూన్ 4 (జనంసాక్షి):** రైతులు తప్పనిసరిగా రైతు రిజిస్ట్రీలో నమోదు చేసుకుని ఫార్మర్ ఐడీ పొందాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి సూచించారు. గురువారం మొయినాబాద్ మండలం చిన్నమంగళారం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో రైతు రిజిస్ట్రీపై అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ తలారి లక్ష్మీబాలయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ పథకాలు, సబ్సిడీలు, పెట్టుబడి సాయం తదితర ప్రయోజనాలు రైతు రిజిస్ట్రీ ఫార్మర్ ఐడీ ఉన్నవారికే అందుతాయని తెలిపారు. ఒక గుంట భూమి ఉన్న రైతు కూడా రైతు రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ సంబంధిత ప్రయోజనాలు సకాలంలో అందాలంటే ప్రతి రైతు నమోదు కావడం తప్పనిసరని పేర్కొన్నారు.

గ్రామాల్లో ఇంకా నమోదు చేసుకోని రైతులను గుర్తించి ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతు రిజిస్ట్రీ ద్వారా ప్రభుత్వ పథకాల లబ్ధి పారదర్శకంగా, త్వరితగతిన రైతులకు చేరుతుందని చెప్పారు. అర్హులైన ప్రతి రైతు ఫార్మర్ ఐడీ పొందేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని సమీక్షించిన ఆయన, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ శాఖ సూచనల మేరకు పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని రైతులకు సూచించారు.

రాష్ట్రంలో రైతు రిజిస్ట్రీ నమోదులో రంగారెడ్డి జిల్లా మొదటి స్థానంలో నిలిచేలా అధికారులు కృషి చేయాలని కోరారు. చిన్నమంగళారం గ్రామంలోని చిన్నకుంట ఆక్రమణలకు గురికాకుండా, నీరు నిల్వ ఉండేలా రెవెన్యూ అధికారులతో కలిసి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతులకు ఉపయోగపడేలా చెరువులు, కుంటలను పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కిషన్‌రావు, తహసీల్దార్ గౌతమ్‌కుమార్, ఎంపీడీవో హిమబిందు, మండల వ్యవసాయ అధికారి అనురాధారెడ్డి, ఎంపీవో వెంకటేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ తలారి లక్ష్మీబాలయ్య, ఉపసర్పంచ్ అంజనేయులు గౌడ్, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణంలో కోట్ల రూపాయలు అవకతవకలు

**బీఆర్ఎస్ ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి**

**రాజేంద్రనగర్, జూన్ 4 (జనంసాక్షి) :** కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణంలో కోట్ల రూపాయల ప్రజాధనం ఖర్చు చేసినప్పటికీ ఇప్పటికీ ప్రజలకు అందుబాటులోకి రాకపోవడం పట్ల రంగారెడ్డి జిల్లా టీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. 2007లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయగా, మొదట రూ.5 కోట్లతో ప్రారంభమైన పనులకు అనంతరం పలుమార్లు అదనపు నిధులు మంజూరైనా స్పోర్ట్స్ కాంప్లెక్స్ పూర్తి కాలేదని ఆరోపించారు. దాదాపు రూ.20 నుంచి రూ.30 కోట్ల వరకు ఖర్చు చేసినట్లు చెబుతున్నప్పటికీ నిర్మాణం పూర్తికాకపోవడం వెనుక భారీ అవకతవకలు జరిగాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని కార్తీక్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే అనుచరుడైన కాంట్రాక్టర్‌కు అనుకూలంగా వ్యవహరించి పనులు పూర్తికాకముందే బిల్లులు మంజూరు చేశారా అనే అంశంపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో మాత్రమే ప్రారంభోత్సవాలు, హామీలతో ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించిన ఆయన, కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను వెంటనే పూర్తి చేసి యువతకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అలాగే ఈ ప్రాజెక్టుపై ఇప్పటివరకు ఖర్చు చేసిన నిధుల వివరాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు.

# నీరు పారుదలపై సీఎం పర్యటన విజయవంతం





- ముఖ్యమంత్రి జిల్లా పర్యటన విజయవంతం.
- గుడ్డెం దొడ్డి పంపుహౌస్ ను పరిశీలించిన ముఖ్యమంత్రి.
- జిల్లా ప్రాజెక్టులపై ఫోటో ఎగ్జిబిషన్, పీపిటి ప్రజెంటేషన్.
- సీఎం పర్యటనకు భారీ బందోబస్తు.

**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి జూన్ 4 (జనం సాక్షి) :** జూరాల ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ద్వారా చేపట్టిన జవహర్ నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన గుడ్డెం దొడ్డి జలాశయం సామర్థ్యాన్ని 11 లేదా15 టీఎంసీలకు పెంచాలని స్థానిక ప్రజా ప్రతినిధులు, ఇరిగేషన్ శాఖ అధికారుల ప్రతిపాదనల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం పంపు హౌస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ అధికారులు ముఖ్యమంత్రికి జిల్లాకు అవసరమైన నీటి వనరుల సామర్థ్యం పెంపునకు అవసరమైన ప్రతిపాదనలను వివరించారు. ముఖ్యంగా గూడెం దొడ్డి ప్రాజెక్టు 15 టిఎంసిలకు పెంచడం, ర్యాలంపాడు సీపేజీ సమస్యను పరిష్కరించి నాలుగు టీఎంసీల నీటి స్టోరేజ్ నిలువ చేసే విధంగా చర్యలు చేపట్టాల్సి ఉందని అలాగే మల్లమ్మ కుంట భూసేకరణ పనులను చేపట్టాల్సిందని తెలియజేశారు.

ఈ సందర్భంగా ధరూర్ మండలంలోని గుడ్డెం దొడ్డి రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్ద గురువారం సాయంత్రం 4:30 ప్రాంతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, తదితరులు బొకేలు, మొక్కలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి సీఎం రోడ్డు మార్గంలో జవహర్ నెట్టెంపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన స్టేజ్1 గుడ్డెం దొడ్డి పంపు హౌస్ వద్దకు చేరుకొని మంత్రులతో కలిసి జోగులాంబ గద్వాల జిల్లాలోని నీటి పారుదల ప్రాజెక్టులపై పిపిటి ద్వారా సమీక్ష నిర్వహించారు. అంతకుముందు జిల్లా ప్రాజెక్టుల గురించి ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను తిలకించారు. అనంతరం తిరిగి వెళ్లే సమయంలో సీఎం కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులకు, మీడియా ప్రతినిధులకు అభివాదం చేస్తూ కరచాలనం చేశారు. ఈ సందర్భంగా అభిమానులు సీఎంకు పుష్పగుచ్ఛాలు, శాలువాలు, జ్ఞాపికలు అందజేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట భద్రత చర్యలతో పాటు, పకడ్బందీ ఏర్పాట్లు చేసి స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారుల సహకారం, సమన్వయంతో ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసినట్లు గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, పశు సంవర్ధక, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, కర్నాటక మంత్రి బోసురాజు, గద్వాల, అలంపూర్ శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, విజయుడు, రాష్ట్ర వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, గొర్రెలు, మేకలు అభివృద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్ సరిత, అదనపు కలెక్టర్ మధుమోహన్, ఆర్డీవో శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, డీసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ సీఈ రహీముద్దీన్, ఇతర ప్రజాప్రతినిదులు.

# ప్రత్యేక గ్రామసభలతో ప్రజా సమస్యలకు పరిష్కారం

- జిల్లాలో 532 గ్రామపంచాయతీల్లో విడతల వారీగా నిర్వహణ
- తొలి విడతలో 136 గ్రామాల్లో ప్రత్యేక సమావేశాలు
- పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణపై కలెక్టర్ సూచనలు
- అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు.. పంటల మార్పిడిపై అవగాహన



**కామారెడ్డి ప్రతినిధి, జూన్ 04 (జనంసాక్షి) :** ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాలోని 532 గ్రామపంచాయతీల్లో ప్రత్యేక గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. జూన్ 4, 6, 8, 10 తేదీల్లో విడతల వారీగా గ్రామసభలు నిర్వహించేందుకు మండల స్థాయి అధికారులను పర్యవేక్షణ అధికారులుగా నియమించినట్లు పేర్కొన్నారు. తొలి విడతలో భాగంగా గురువారం 136 గ్రామపంచాయతీల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. దోమకొండ మండలంలోని గొట్టుముక్కుల గ్రామపంచాయతీలో జరిగిన గ్రామసభలో పాల్గొన్న కలెక్టర్, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. మురుగు కాలువల శుభ్రత, తాగునీటి వనరుల పరిరక్షణ, వీధి దీపాల నిర్వహణ, పిచ్చిమొక్కల తొలగింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. పరిశుభ్రతతోనే వ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చని అన్నారు. ఘన వ్యర్థాల నిర్వహణ రూల్స్-2026ను తప్పనిసరిగా అమలు చేయాలని పేర్కొంటూ తడి, పొడి, శానిటరీ, ప్రత్యేక వ్యర్థాలను వేర్వేరుగా సేకరించాలని సూచించారు. గ్రామసభలో తాగునీటి నిర్వహణ, వర్షపు నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ, బడిబాట, విపత్తు నిర్వహణ, ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపునకు సహకరించాలని, ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. రైతులు సంప్రదాయ పంటలతో పాటు ఆయిల్‌పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులను గ్రామసభల ద్వారా గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులకు ఆదేశించారు. గ్రామాభివృద్ధి, ప్రజాభాగస్వామ్యం, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలతో నిర్వహిస్తున్న ప్రత్యేక గ్రామసభలను విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. గ్రామసభను 'జయ జయహే తెలంగాణ' గీతంతో ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రజల చెంతకే పాలన

- కరీంనగర్‌లో ప్రత్యేక వార్డుల సభలకు శ్రీకారం
- ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా వార్డుల వారీ సమావేశాలు
- ప్రజల సమస్యల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటు
- రూ.15 కోట్లతో అభివృద్ధి.. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి
- స్వచ్ఛ నగర లక్ష్యానికి ప్రజల భాగస్వామ్యం అవసరం: కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్ బ్యూరో, జూన్ 04 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారాన్ని లక్ష్యంగా చేపట్టిన 'ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక వార్డుల సభలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జూన్ 4 నుంచి 10వ తేదీ వరకు వారం రోజులపాటు నిర్వహించనున్న ఈ సభల తొలి సమావేశం రేకుర్తి ప్రాంతంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

చింతకుంట, కొత్తపల్లి, రేకుర్తి, సీతారాంపూర్, మల్కాపూర్, విద్యానగర్, పద్మానగర్, రాంనగర్ ప్రాంతాల పరిధిలోని 14, 15, 16, 17, 18, 19, 20, 21, 22, 23, 24, 25, 46, 47, 48 డివిజన్ల ప్రజలు, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు. వార్డుల వారీగా ప్రజల సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించేందుకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు.

ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా నగరపాలక సంస్థ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అధికారులు ప్రజలకు వివరించారు. ఇంజినీరింగ్ విభాగం ద్వారా యూఐడీఎఫ్ పథకంలో రూ.15 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులు, సాధారణ నిధులతో కొనసాగుతున్న రూ.5 కోట్ల పనులు, వర్షాకాల సన్నద్ధత చర్యలు, డీసీ స్టేషన్ నిర్మాణం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా 15 డివిజన్లలో ఒక్కో డివిజన్‌కు రూ.10 లక్షల చొప్పున మొత్తం రూ.1.50 కోట్లతో అంతర్గత రహదారులు, మురుగు కాలువల అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు.

టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు భవన నిర్మాణ అనుమతులు, మాస్టర్ ప్లాన్ అమలు, లేఅవుట్ల పరిశీలన, అక్రమ నిర్మాణాల నియంత్రణ, రహదారుల విస్తరణ, ప్రజా సౌకర్యాల పరిరక్షణ, ఇంకుడు గుంతల నిర్మాణం, 2027 జనాభా గణన తదితర అంశాలపై ప్రజలకు వివరించారు. పారిశుధ్య విభాగం అధికారులు సీజనల్ వ్యాధుల నివారణ, దోమల నియంత్రణ, వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ నిషేధం, చెత్త వేరు చేసే విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ ప్రజల చెంతకే పాలనను తీసుకెళ్లడమే ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. డివిజన్ల వారీగా సమస్యలను గుర్తించి వార్డుల సభల్లో చర్చించడం ద్వారా పరిష్కార మార్గాలను వేగవంతం చేయవచ్చన్నారు. నగర పరిశుభ్రతకు ప్రజల సహకారం అత్యంత అవసరమని, కరీంనగర్‌ను స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ 99 రోజుల కార్యాచరణలో భాగంగా నగరవ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. డివిజన్ల వారీగా అభివృద్ధి పనులతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తున్నామని చెప్పారు.

డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు మాట్లాడుతూ ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా అనేక సమస్యలకు పరిష్కారాలు లభిస్తున్నాయ ని పేర్కొన్నారు. అనంతరం హరితోత్సవం కార్యక్రమంలో భాగంగా రేకుర్తి ప్రభుత్వ పాఠశాల ఆవరణలో కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు, కార్పొరేటర్లతో కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సుధగోని మాధవి, పర్వతం మల్లేశం, గంట శ్రీనివాస్, వాసాల రమేష్, వరాల నర్సింగ్, ఒంటెల సత్యనారాయణ, కాంతాల జగన్‌రెడ్డి, అదనపు కమిషనర్ ఆయాజ్, సువార్త, డిప్యూటీ కమిషనర్లు ఖాదర్ మొహియుద్దీన్, వేణు, వివిధ విభాగాల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

### కామారెడ్డి పట్టణ ప్రగతికి ప్రతి ఒక్కరూ

# భాగస్వాములు కావాలి

### మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్



**కామారెడ్డి ప్రతినిధి, జూన్ 04 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో ఈ రోజు నుండి ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన "వార్డు సభల"లలో ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ పిలుపునివ్వడం జరిగింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, స్థానిక సమస్యల పరిష్కారానికి, వార్డుల సమగ్ర అభివృద్ధికి వార్డు సభలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ఇప్పటికే పట్టణంలో మౌలిక వసతుల కల్పన, తాగునీటి పైప్‌లైన్ల విస్తరణ వంటి పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. మున్సిపల్ పాలనను మరింత పారదర్శకంగా, అవినీతి రహితంగా ప్రజలకు చేరువ చేయడమే తమ లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు.

-తడి-పొడి చెత్త వేరు చేయడంపై ప్రత్యేక అవగాహన పట్టణాన్ని స్వచ్ఛ కామారెడ్డిగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ బాధ్యతగా వ్యవహరించాలని చైర్‌పర్సన్ కోరారు. తడి చెత్త (ఆకుపచ్చ డబ్బా) కూరగాయల వ్యర్థాలు, పాడైపోయిన ఆహార పదార్థాలు, పండ్ల తొక్కలు మొదలైనవి. పొడి చెత్త (నీలిరంగు డబ్బా): ప్లాస్టిక్ కవర్లు, సీసాలు, పేపర్లు, కార్డ్‌బోర్డులు, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు మొదలైనవి. ఇలా ఇంట్లోనే చెత్తను వేరు చేసి మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు అప్పగించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని, వ్యాధులు ప్రబలకుండా నివారించవచ్చని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వార్డు సభల్లో ఈ అంశంపై ప్రజలకు మరింతగా అవగాహన కల్పిస్తామన్నారు.

వార్డు సభల్లో ప్రజలు తమ పరిధిలోని రోడ్లు, మురుగుకాలువలు, వీధి దీపాలు, పారిశుధ్యం తదితర సమస్యలపై కౌన్సిలర్లు, అధికారులతో చర్చించి అర్జీలు అందజేయవచ్చని తెలిపారు. ప్రజల నుండి వచ్చే సమస్యలను ప్రాధాన్యత క్రమంలో త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. కామారెడ్డి పట్టణాన్ని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని,వార్డు సభలలో ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, యువత అధిక సంఖ్యలో హాజరై తమ వార్డుల అభివృద్ధికి విలువైన సూచనలు అందించాలని చైర్‌పర్సన్ శ్రీమతి ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ కొత్తపల్లి లలిత చిట్టీబాబు,గ్యార అఖిల, నిట్టు గంగాధర్, కమిషనర్ పర్వతాలు, ఆర్వో గోపాల్ రెడ్డి, ఆర్ఐ రమేష్, మున్సిపల్ సిబ్బంది, సీనియర్ నాయకులు గ్యార సాయిలు, వార్డు ఆఫీసర్స్ ,అధికారులు వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## కొడిమ్యాల ఫారెస్ట్ కార్యాలయంలో ఏసీబీ దాడులు

**జగిత్యాల బ్యూరో జూన్ 4 (జనంసాక్షి) :** జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని ఫారెస్ట్ కార్యాలయంలో గురువారం ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.80 వేల లంచం తీసుకుంటుండగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్ఓ) మొయినొద్దీన్‌ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు సమాచారం. పక్కా సమాచారంతో వల పన్నిన ఏసీబీ అధికారులు, లంచం స్వీకరిస్తున్న సమయంలోనే అధికారిని అదుపులోకి తీసుకున్నారు. కార్యాలయంలో తనిఖీలు నిర్వహించి సంబంధిత పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనతో కొడిమ్యాల ఫారెస్ట్ శాఖలో కలకలం రేగింది. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

## బీపీ మందుల విషయంలో గొడవ.. చెరువులో వ్యక్తి మృతదేహం లభ్యం

**శంషాబాద్,జూన్4(జనం సాక్షి) :** బుద్వేల్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి మృతదేహం పోచమ్మగడ్డ సమీపంలోని చెరువులో లభ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై హర్షద్ అలీ తెలిపిన వివరాల ప్రకారం, పోచమ్మగడ్డకు చెందిన మత్స్యకారులు లోకానందం, శ్రవణ్‌లు గత నెల 31వ తేదీన చేపల వేట కోసం చెరువుకు వెళ్లగా నీటిలో ఓ మృతదేహం కనిపించింది. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎస్సై హర్షద్ అలీ సిబ్బంది, గజ ఈతగాళ్ల సహాయంతో మృతదేహాన్ని చెరువులో నుంచి వెలికి తీశారు. ఐదు రోజులుగా నీటిలో ఉండటంతో మృతదేహం పూర్తిగా కుళ్లిపోయింది. మృతుడి వద్ద లభించిన ఆధార్, ఓటర్ గుర్తింపు కార్డుల ఆధారంగా అతడు బుద్వేల్ ప్రాంతానికి చెందిన హజర(32) తండ్రి షంషీరుద్దీన్‌గా గుర్తించారు. మృతుడితో సహజీవనం చేస్తున్న ఆశా అనే మహిళ నాలుగు రోజుల తర్వాత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బీపీ టాబ్లెట్లు వేసుకోలేదని తనపై కోపంతో ఇంటి నుంచి వెళ్లిపోయాడని ఆమె పోలీసులకు తెలిపింది.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా, శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గ్లోబల్ సిటీగా కరీంనగర్

- ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ సమావేశంలో కరీంనగర్ అభివృద్ధి ప్రస్తావన
- స్మార్ట్ సిటీ అంటే ప్రజల జీవితాలను సులభతరం చేయడమేనని వ్యాఖ్య
- కరీంనగర్ తెలంగాణకు గర్వకారణమని మేయర్ కొలగాని శ్రీనివాస్
- ఉత్తరాఖండ్ మంత్రిచే సన్మానం.. జ్ఞాపిక అందజేత




**కరీంనగర్ బ్యూరో, జూన్ 04 (జనంసాక్షి) :** కరీంనగర్ నగరం వేగంగా గ్లోబల్ సిటీగా ఎదుగుతోందని, ఇది తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణమని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని ఋషికేశ్‌లో జూన్ 3, 4 తేదీల్లో నిర్వహించిన ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ 117వ సమావేశంలో పాల్గొన్న ఆయన పూర్తిగా హిందీలో ప్రసంగించి సభికుల ప్రశంసలు అందుకున్నారు. సమావేశంలో పాల్గొన్న ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, వివిధ రాష్ట్రాల మేయర్లు, అధికారులకు అభివాదం తెలిపిన అనంతరం కరీంనగర్ నగర అభివృద్ధి, స్మార్ట్ సిటీ ప్రాజెక్టులపై తన ప్రసంగాన్ని కొనసాగించారు. "కరీంనగర్ బహుత్ తేజీ సే ఏక్ గ్లోబల్ సిటీ బన్నే కీ ఓర్ బఢ్ రహా హై.. యే తెలంగాణ కా గౌరవ్ హై" అంటూ కరీంనగర్ అభివృద్ధి ప్రస్థానాన్ని వివరించారు.

స్మార్ట్ సిటీ అంటే కేవలం సాంకేతిక పరిజ్ఞానం మాత్రమే కాదని, ప్రజల జీవితాలను మరింత సులభతరం చేయడమే అసలు లక్ష్యమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ స్మార్ట్ సిటీ మిషన్ కింద ఎంపికైన కరీంనగర్‌లో ఆధునిక మౌలిక సదుపాయాల కల్పనకు విస్తృతంగా పనులు జరుగుతున్నాయని తెలిపారు. నగరంలో స్మార్ట్ రోడ్లు, నాణ్యమైన ఫుట్‌పాత్‌లు, సమర్థవంతమైన డ్రైనేజీ వ్యవస్థ, నగరవ్యాప్తంగా సీసీటీవీ నిఘా, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా భద్రతా వ్యవస్థ బలోపేతం చేస్తున్నట్లు వివరించారు. అదేవిధంగా స్వచ్ఛమైన తాగునీటి సరఫరా, మెరుగైన రహదారులు, సుందరమైన పార్కులు, ప్రజలకు అనుకూలమైన పట్టణ వాతావరణం కల్పించేందుకు నగరపాలక సంస్థ కృషి చేస్తోందని తెలిపారు. కరీంనగర్‌ను ఆధునిక, సుస్థిర, ప్రజా కేంద్రిత నగరంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

తన ప్రసంగం ముగింపు సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం తొలిసారిగా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో భారతీయ జనతా పార్టీ అధికారాన్ని సాధించి మేయర్ పదవిని దక్కించుకుందని గుర్తు చేశారు. ఇది తెలంగాణ బీజేపీకి చారిత్రాత్మక విజయంగా నిలిచిందని పేర్కొన్నారు. అనంతరం "ధన్యవాద్.. జైహింద్.. భారత్ మాతాకీ జై" అంటూ తన ప్రసంగాన్ని ముగించారు. గురువారం జరిగిన ముగింపు సమావేశానికి ఉత్తరాఖండ్ మంత్రి మదన్ కౌశిక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్‌ను సన్మానించి జ్ఞాపికను అందజేశారు. సమావేశంలో పాల్గొన్న పలువురు ప్రతినిధులు కరీంనగర్ అభివృద్ధి నమూనాపై ఆసక్తి వ్యక్తం చేసినట్లు సమాచారం.

## సింగరేణి అంశాలపై జూన్ 7న అవగాహన సదస్సు

- హరీశ్‌రావు నేతృత్వంలో గోదావరిఖనిలో నిర్వహణ
- కార్మికులు, కుటుంబాలు పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపు
- సింగరేణిలో అవినీతి, అక్రమాలపై చర్చిస్తామన్న కొప్పుల ఈశ్వర్
- 'సింగరేణి బచావో' నినాదంతో కార్యక్రమం



**గోదావరిఖని, జూన్ 4 (జనంసాక్షి):** సింగరేణి సంస్థలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై ప్రజలు, కార్మికుల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ నెల 7న సాయంత్రం 5 గంటలకు గోదావరిఖని శ్రీమహి ఫంక్షన్ హాల్‌లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు టీజీబీకేఎస్ గౌరవ అధ్యక్షుడు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. మాజీ మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో జరిగే ఈ సదస్సును కార్మికులు, కార్మిక కుటుంబాలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

గురువారం గోదావరిఖనిలోని టీజీబీకేఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణిలో అనేక అవినీతి ఆరోపణలు వెలుగుచూశాయని, సంస్థను బలహీనపరిచే చర్యలు జరుగుతున్నాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు విడుదల కాకపోవడంతో సంస్థ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు. నైని బొగ్గు బ్లాక్, సోలార్ పవర్ ప్రాజెక్టులు, డిటోనేటర్ కొనుగోళ్లు, పవర్ ప్రాజెక్టు టెండర్లలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, ఈ అంశాలన్నింటినీ సదస్సులో ప్రజల ముందుంచనున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సింగరేణి అభివృద్ధి, కార్మిక సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చారని పేర్కొన్నారు. సింగరేణి పరిరక్షణే లక్ష్యంగా 'కాంగ్రెస్ హటావో.. సింగరేణి బచావో' నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, సదస్సు ప్రభుత్వం, సంస్థ యాజమాన్యానికి కనువిప్పు కలిగించేలా ఉంటుందని అన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, మాదాసి రామ్మూర్తి, చెల్పూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒకరు పాటుపడాలి

**జగిత్యాల బ్యూరో జూన్ 4 (జనం సాక్షి) :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జగిత్యాల మున్సిపల్ కార్యాలయం లోగురువారం కమిషనర్ సత్య ప్రణవ్ గోడ పత్రిక ను ఆవిష్కరించారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు అందరి బాధ్యత అని, జగిత్యాల పట్టణం లో ప్లాస్టిక్ రహిత నగరంగా చేయడం లో ప్రతి ఒక్కరు సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకుండా సహకరించాలని , మీ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ,మొక్కలు నాటి చెట్లు పెంచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి కె రాము మాట్లాడుతూ అన్ని పాఠశాలలో ఎకో క్లబ్ లు ఎక్కువ మొక్కలు నాటి పర్యావరణం కాపాడటం లో భాగస్వాములు కావాలని ,ఉపాధ్యాయులు అందరూ ప్రతి రోజు విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ పై అవగాహన కల్పించాలని ,ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేలా విద్యార్థులకు తెలియజేయాలని ఉపాధ్యాయులకు సూచించారు,కార్యక్రమంలో జాతీయ హరిత దళం జిల్లా కోఆర్డినేటర్ మచ్చ రాజశేఖర్,పొల్యూషన్ కంట్రోల్ బోర్డు జిల్లా నోడల్ ఆఫీసర్ మహేష్ ,విద్యాశాఖ ఏ.ఎం.ఓ.చంద్రశేఖర్ గారు,సెన్సెస్ మాస్టర్ ట్రైనర్ ఆడేపు రాజశేఖర్ విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది వంశీ,సంతోష్ , ఆనంద్ ,మున్సిపల్ సిబ్బంది శ్రీకర్‌లు పాల్గొన్నారు

# అభివృద్ధి ఫలాలు ప్రజలకు చేరాలి.. పారదర్శక పాలనకే ప్రాధాన్యం

- 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో క్లస్టర్ వార్డు సభ
- ఉత్తర తెలంగాణలో ప్రధాన నగరంగా రామగుండం లక్ష్యం
- వర్షాకాలానికి ముందస్తు సన్నద్ధత.. కాలువల ప్రక్షాళన
- ప్రజల సహకారంతోనే స్వచ్ఛ నగరం సాధ్యం: ఎమ్మెల్యే



**గోదావరిఖని, జూన్ 2 (జనంసాక్షి):** ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల సమాచారం ప్రతి పౌరుడికి చేరేలా అధికారులు కృషి చేయాలని రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ సూచించారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా 5, 6, 7, 8, 9, 35, 36, 37, 38, 47, 48, 49, 50, 51, 59, 60 డివిజన్లకు సంబంధించిన క్లస్టర్ స్థాయి వార్డు సభను గురువారం సి.ఎస్.పీ కాలనీలోని ఆర్‌సీఓఏ క్లబ్‌లో నిర్వహించారు. నగర మేయర్ మహంకాళి స్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రామగుండం నగరంలో అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయని అన్నారు. కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం వంటి పథకాల ద్వారా వేలాది మంది లబ్ధి పొందుతున్నారని తెలిపారు. వరంగల్, కరీంనగర్ నగరాలకు దీటుగా ఉత్తర తెలంగాణలో ప్రధాన కేంద్రంగా, హైదరాబాద్ తర్వాత ప్రముఖ నగరంగా రామగుండాన్ని తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో పనులు చేపడుతున్నామని, లోతట్టు ప్రాంతాల్లో వరద ముప్పు తగ్గించేందుకు మూడు నెలల ముందుగానే కాలువల పూడికతీత కార్యక్రమాలు ప్రారంభించామని చెప్పారు. కాలువల్లో చెత్త, వ్యర్థాలు వేయడం వల్ల నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి ఇళ్లలోకి నీరు చేరే పరిస్థితులు వస్తున్నాయని, ప్రజలు ఈ విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.

అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ప్రజల్లో విశ్వాసం పెంపొందించాలని సూచించారు.

మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విభాగాల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక ప్రారంభానికి ముందే ఎమ్మెల్యే ఆదేశాల మేరకు నగరవ్యాప్తంగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమం లో ఏసీపీ ముడుత రమేష్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ సంపత్, టీపీఎస్ నవీన్, ఆర్వో ఆంజనేయులు, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, మెప్మా టీఎంసీ మౌనిక, కార్పొరేటర్లు, అధికారులు, స్వశక్తి మహిళలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# భూపాలపల్లి నియోజకవర్గ మాస్టర్ ట్రైనర్‌గా సిరాజ్ హుస్సేన్

- బీఎల్ఏల శిక్షణలో భూపాలపల్లిని ఆదర్శంగా నిలుపుతాం
- భూపాలపల్లి అసెంబ్లీ నియోజకవర్గ మాస్టర్ ట్రైనర్ సిరాజ్ హుస్సేన్



**కరీంనగర్ బ్యూరో జూన్ 4 (జనంసాక్షి) :** ఎన్నికల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలకు సంబంధించిన బూత్ లెవల్ ఏజెంట్ల శిక్షణ, సమన్వయ బాధ్యతల కోసం భూపాలపల్లి అసెంబ్లీ నియోజకవర్గ మాస్టర్ ట్రైనర్‌గా రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు సిరాజ్ హుస్సేన్‌ను పీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ నియమించారు.

ఈ సందర్భంగా సిరాజ్ హుస్సేన్ మాట్లాడుతూ... పార్టీ అధిష్టానం తన పై ఉంచిన నమ్మకానికి అనుగుణంగా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. ఎన్నికల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో బూత్ లెవల్ ఏజెంట్లకు సమగ్ర శిక్షణ అందించి, వారి సామర్థ్యాలను పెంపొందించే దిశగా ప్రత్యేక కార్యాచరణ చేపడతామని చెప్పారు. బీఎల్ఏల శిక్షణ కార్యక్రమంలో భూపాలపల్లి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా నిలబెట్టేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఎన్నికల జాబితాల సవరణ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అవగాహన, శిక్షణ కార్యక్రమాలను విస్తృతంగా చేపడతామని తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తించి, కాంగ్రెస్ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణతో పాటు పార్టీ నాయకత్వానికి, ఇతర నాయకులకు సిరాజ్ హుస్సేన్ కృతజ్ఞతలు తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

- డిచ్‌పల్లి హైవే రోడ్డు ప్రమాద ఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీస్ కమిషనర్



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి క్రైం జూన్ 04 జనంసాక్షి :** నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం ఎన్ హెచ్ 44 హైవే పైన గురువారం మధ్యాహ్నం సుమారు 3:20 గంటల సమయంలో రాయల్ ఎన్ఫీల్డ్ మోటార్ సైకిల్ (టిజి 16 ఏ 6637) పై ఇద్దరు యువకులు కామారెడ్డి వైపు నుంచి జక్రాన్ పల్లి వైపు ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో డిచ్పల్లి మండలం పరిధిలోని ఎన్హెచ్-44 నిజామాబాద్ వైపు ఉన్న మలుపు వద్ద వారి ముందుగా వెళ్తున్న ఫోర్డ్ కారు (ఏపి 28 బిడబ్ల్యు 8888)ను తప్పించబోయే ప్రయత్నంలో వెనుక వైపు నుండి వచ్చిన లారీ ఢీకొట్టడంతో, అట్టి లారీ ఈ ఇద్దరి మీద నుండి వెళ్లడం తో అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానిక ఎస్సై తెలిపారు. ఈ రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటనపై నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య సంఘటన స్థలాన్ని సందర్శించి క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన తీరును సంబంధిత పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్న కమిషనర్ , ప్రమాదానికి దారితీసిన పరిస్థితులను సమీక్షించారు. అనంతరం జాతీయ రహదారి అధికారులు, రవాణా శాఖ అధికారులు మరియు పోలీసు అధికారులతో మాట్లాడి, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, ప్రమాదకర మలుపుల వద్ద రిఫ్లెక్టర్లు, సైన్‌బోర్డులు,స్పీడ్ నియంత్రణ సూచికలు ఏర్పాటు చేయడం,రాత్రి సమయంలో వాహనదారులకు స్పష్టంగా కనిపించే విధంగా వెలుతురు సదుపాయాలు కల్పించడం,అతివేగాన్ని నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, నిర్లక్ష్యంగా, అతివేగంగా వాహనాలు నడపరాదని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, సురక్షిత ప్రయాణానికి అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నిజామాబాదు ఏసిపి ప్రకాష్, డిచ్పల్లి సిఐ వినోద్ ,డిచిపల్లి ఎస్.ఐ ఆరిఫ్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు అరికట్టాలి

### మండల స్పెషల్ ఆఫీసర్ జిల్లా వెల్ఫేర్ అధికారి సరస్వతి

**గన్నేరువరం, జూన్ 04 (జనంసాక్షి):** ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక - 99 రోజుల ఆక్షన్ ప్లాన్‌లో భాగంగా గురువారం గన్నేరువరం మండలంలోని గుండ్లపల్లి ఎక్స్ రోడ్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మండల స్పెషల్ ఆఫీసర్ జిల్లా వెల్ఫేర్ అధికారి సరస్వతి మాట్లాడారు.. బాల్యవివాహాలను అరికట్టడంతో పాటు బాలికల అభివృద్ధికి సమాజంలోని ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. బాల్యవివాహాల నిషేధ చట్టం - 2006 పై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఏ. శ్రీనివాస్ రెడ్డి, ఎంపీఓ సురేందర్, సర్పంచ్ చింతల ఉమారాణి అనిల్, పంచాయతీ కార్యదర్శి రాకేష్, గ్రామ పాలకవర్గం తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
5 జూన్ 2026

# భవిష్యత్‌ అవసరాలకు పెట్టుబడి

## గూగుల్‌ తీరును అభినందించిన ఉదయ్‌ కోటక్‌



**ముంబై, జూన్‌4 (జనంసాక్షి) :** కోటక్‌ మహీంద్రా బ్యాంక్‌ వ్యవస్థాపకుడు ఉదయ్‌ కోటక్‌ తాజాగా భారతీయ వ్యాపార సంస్థలను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ దిగ్గజ కార్పొరేట్‌ సంస్థలు వేల కోట్లను ఆర్జిస్తున్నప్పటికీ సంతృప్తి చెందకుండా భవిష్యత్తుపై పెట్టుబడులు పెడుతున్న వైనాన్ని ప్రస్తావించారు. ఈ సందర్భంగా గూగుల్‌ గురించి ప్రత్యేకంగా పేర్కొన్నారు. ఈ సంస్థ ఆర్థిక సామర్థ్యం చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతోందని అన్నారు. 'గూగుల్‌ వార్షిక లాభం 160 బిలియన్‌ డాలర్లు. గత త్రైమాసికంలో 62 బిలియన్‌లను ఆర్జించింది. సంస్థ మార్కెట్‌ విలువ 4.5 ట్రిలియన్‌లు. భారతీయ కంపెనీల మొత్తం మార్కెట్‌ క్యాపిటలైజేషన్‌, లాభాల కంటే ఇది ఎక్కువ. ఇది భారతీయ కంపెనీలకు మేలు కొలుపు కావాలి. ప్రస్తుత పరిస్థితి ఎంత మెరుగ్గా ఉన్నప్పటికీ భవిష్యత్తుపై పెట్టుబడి పెట్టాలి' అని ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఈ పోస్టు నెట్టింట తెగ వైరల్‌ అవుతోంది. కృత్రిమ మేధపై పెట్టుబడుల కోసం ఇటీవల గూగుల్‌ ఏకంగా 80 బిలియన్‌ డాలర్లను సేకరించేందుకు ప్రణాళిక ఆవిష్కరించింది. ఇది ప్రపంచవ్యాప్తంగా సంచలనాన్ని సృష్టించింది. ప్రభుత్వాలు నిధుల సేకరణ జరిపే స్థాయిలో ఒక కార్పొరేట్‌ కంపెనీ దీర్ఘకాలిక వ్యూహంతో నిధులు సేకరించడంతో పెద్ద చర్చకు దారి తీసింది.

# పవన్‌ కళ్యాణ్‌పై మరోమారు ప్రకాష్‌ రాజ్‌ సెటైర్లు

## ఘాటుగా తిప్పికొట్టిన నిర్మాత బండ్ల గణేశ్‌



**హైదరాబాద్‌, జూన్‌4 (జనంసాక్షి) :** ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్‌ కల్యాణ్‌ అంశంలో నటుడు ప్రకాశ్‌ రాజ్‌, నిర్మాత బండ్ల గణెళిశ్‌ మధ్య సోషల్‌ మీడియా ఎక్స్‌లో వార్‌ నడుస్తోంది. తెలంగాణలో జనసేన పోటీ చేస్తుందంటూ పవన్‌ చేసిన వ్యాఖ్యలపై ప్రకాశ్‌ రాజ్‌ సెటైర్‌ వేస్తే.. ప్రకాశ్‌ రాజ్‌కు బండ్ల గణెళిశ్‌ కౌంటర్‌ ఇచ్చారు. తెలంగాణలో జనసేన పోటీపై ఎక్స్‌లో పోస్ట్‌ చేసిన ప్రకాశ్‌ రాజ్‌.. పవన్‌ను ఉద్దేశించి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'మీరొస్తామంటే మేమొద్దంటామా.. రండి దొర. సింగిల్‌గా వస్తున్నారా.. పొత్తుతో వస్తున్నారా చెప్పి రండి' అని ప్రకాశ్‌ రాజ్‌ పోస్ట్‌ చేశారు. ప్రకాశ్‌రాజ్‌ పోస్ట్‌కు బండ్ల గణెళిశ్‌ స్ట్రాంగ్‌ కౌంటర్‌ ఇచ్చారు. ప్రతి దాంట్లో ఎందుకు వేలు పెడతావంటూ ప్రశ్నిం చారు. 'అసలు నువ్వెవరు.. తమిళోడివా? తెలు గోడివా? కన్నడి గుడివా? ప్రతి విషయంలో జడ్జిమెంట్‌ ఇవ్వడానికి నువ్వేమైనా ప్రధానివా. అందరి విషయాల్లో దూరి హీరోలా ఫీలవ్వకు. ముందు నీ అడ్రస్‌ నువ్వు తెలుసుకో. తర్వాత ప్రపంచాన్ని మార్చే ప్రయత్నం చేయ్‌' అంటూ ప్రకాశ్‌ రాజ్‌ను ఉద్దేశించి బండ్ల గణెళిశ్‌ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ప్రకాశ్‌ రాజ్‌, బండ్ల గణేశ్‌ మధ్య సోషల్‌ మీడియా ఎక్స్‌ వేదికగా జరుగుతున్న వార్‌.. చర్చనీయాంశంగా మారింది.

# 5, 6, 7 తేదీల్లో హైటెక్స్‌లో చేనేత వస్త్ర ప్రదర్శన

**హైదరాబాద్‌, జూన్‌4 (జనంసాక్షి) :** అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి పొందిన పోచంపల్లి 'ఇక్కత్‌' వస్త్ర ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు ఈనెల 5,6,7 తేదీల్లో ప్రత్యేక వస్త్ర ప్రదర్శనను నిర్వహిస్తున్నారు. పోచంపల్లి చేనేత కళాకారుల జీవన ప్రమాణాల మెరుగుపరిచే లక్ష్యంతో జూన్‌ 5, 6, 7 తేదీల్లో హైదరాబాద్‌ హైటెక్స్‌ లో 'త్రెడ్‌ పోచంపల్లి' పేరిట వస్త్ర ప్రదర్శనను నిర్వహిస్తున్నారు. చేనేత వస్త్రాలకు మార్కెటింగ్‌ సదుపాయాలను మెరుగుపరచేందుకు ఏర్పాటు చేసే ఈ ఎగ్జిబిషన్‌ లో దాదాపు 100 పైగా స్టాల్స్‌, మహిళా శక్తి స్వయం సహాయక సంఘాల ద్వారా కూడా స్టాల్స్‌ ఏర్పాటు చేయడం జరుగుతుందని ఒక అధికారిక ప్రకటనలో తెలిపారు.

# సాలార్‌ జంగ్‌ మ్యూజియం ఆధునీకరణ, విస్తరణకు ప్రభుత్వ రంగ సంస్థలు సహకరించాలి

## ప్రభుత్వ రంగ సంస్థల ప్రతినిధులను కోరిన గవర్నర్‌ శివ ప్రతాప్‌ శుక్లా



**హైదరాబాద్‌, జూన్‌ 4 (జనంసాక్షి) :** ప్లాటినం జూబ్లీ ఉత్సవాల నేపథ్యంలో సాలార్‌ జంగ్‌ మ్యూజియం ఆధునీకరణ, విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్న దృష్ట్యా, ప్రభుత్వ రంగ సంస్థలు తమవంతు సహకారం అందించాలని గవర్నర్‌ శివ ప్రతాప్‌ శుక్లా అధికారులను కోరారు. ఈ నెల 14 నుంచి వారం రోజుల పాటు సాలార్‌ జంగ్‌ మ్యూజియం ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో సాలార్‌ జంగ్‌ మ్యూజియం చైర్మన్‌గా ఉన్న గవర్నర్‌ శివ ప్రతాప్‌ శుక్లా, గవర్నర్‌ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్‌, సంయుక్త కార్యదర్శి శశికిరణ్‌ చారితో కలిసి గురువారం సాయంత్రం లోక్‌భవన్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్‌ మాట్లాడుతూ, నవాబ్‌ మీర్‌ యూసుఫ్‌ అలీ ఖాన్‌ సాలార్‌ జంగ్‌-3 జయంతి సందర్భంగా జూన్‌ 14 నుంచి 21 వరకు వారం రోజులపాటు ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాల్లో ప్రత్యేక ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యా కార్యక్రమాలు, ప్రచురణలు, అవగాహన కార్యక్రమాలు, ప్రజా భాగస్వామ్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మ్యూజియం 75 సంవత్సరాల ప్రస్థానాన్ని పురస్కరించుకుని రానున్న ఐదేళ్లలో దాన్ని మరింత ఆధునికంగా, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. మ్యూజియం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరిస్తుందని అన్నారు. ఈ క్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు కూడా తమ కార్పొరేట్‌ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్‌) నిధుల ద్వారా మ్యూజియం ఆధునీకరణ, విస్తరణ కార్యక్రమాలకు సహకరించాలని గవర్నర్‌ కోరారు.

గవర్నర్‌ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.దాన కిషోర్‌ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మూసి అభివృద్ధి సుందరికరణకు చర్యలు చేపడుతుందన్నారు. ప్రస్తుత హైకోర్టు, సాలార్జంగ్‌ మ్యూజియం, ఉస్మానియా హాస్పిటల్‌ అనుకోని హెరిటేజ్‌ కారిడారిగా తీర్చే తిదేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తుందన్నారు. ఈ నేపథ్యంలో సాలార్జంగ్‌ మ్యూజియం అభివృద్ధికి తమవంతుగా ప్రభుత్వ రంగ సంస్థల సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

గవర్నర్‌ విజ్ఞప్తికి ప్రభుత్వ రంగ సంస్థల ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. సాలార్‌ జంగ్‌ మ్యూజియం ఆధునీకరణ, విస్తరణ కార్యక్రమాలలో తాము కూడా భాగస్వామ్యం అవుతామని తెలిపారు. సమావేశంలో సాలార్‌ జంగ్‌ మ్యూజియం అధికారులు పవర్‌పాయింట్‌ ప్రజెంటేషన్‌ ద్వారా భవిష్యత్‌ అభివృద్ధి కార్యాచరణను వివరించారు. రాబోయే ఐదేళ్లలో రూ.25 కోట్ల నుంచి రూ.35 కోట్ల వ్యయంతో మ్యూజియంలోని గ్యాలరీలు, నిల్వ సదుపాయాలు, పరిరక్షణ వ్యవస్థలను మెరుగుపరచనున్నట్లు తెలిపారు. గ్యాలరీల అభివృద్ధితో పాటు విద్యా కార్యక్రమాల విస్తరణ, కన్జర్వేషన్‌ ల్యాబొరేటరీల ఆధునీకరణ, సందర్శకుల సేవల మెరుగుదల, ఆధునిక సౌకర్యాల కల్పన వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో భారత్‌ డైనమిక్స్‌ లిమిటెడ్‌ (బీడీఎల్‌) ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ వినోద్‌ కుమార్‌, ఎన్‌ఎండీసీ జెనరల్‌ మేనేజర్‌ పి జయ ప్రకాశ్‌, హడ్కో రీజినల్‌ చీఫ్‌ పి సుభాష్‌ రెడ్డి, ఎన్‌టీపీసీ ఏజీఎం అఖిల్‌, పవర్‌గ్రిడ్‌ సిజిఎం దోమ్మన్‌ యాదవ్‌ , హిందుస్థాన్‌ ఏరోనాటిక్స్‌ లిమిటెడ్‌ (హాల్‌) ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ రామ్‌ మోహన్‌ రావు, గెయిల్‌ జోనల్‌ సీజీఎం దేవ్‌ కాంత్‌, ఇండియన్‌ ఆయిల్‌ కార్పొరేషన్‌ సి జి ఎం ఆపరేషన్‌ సూరజ్‌ పట్నాయక్‌, భారత్‌ పెట్రోలియం కార్పొరేషన్‌ ప్రతినిధి టోనెస్‌ చతుర్వేది, హిందుస్థాన్‌ పెట్రోలియం కార్పొరేషన్‌ సీజీఎం సుశీల్‌ కుమార్‌ రాయ్‌ తదితర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## దివ్యాంగ క్రీడాకారులు స్ఫూర్తిదాయకం: గవర్నర్‌



సవాళ్లను అవకాశాలుగా, కష్టాలను తమ బలంగా మార్చుకుని విజయాలు సాధిస్తున్న దివ్యాంగ క్రీడాకారులు సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని తెలంగాణ గవర్నర్‌ శివ ప్రతాప్‌ శుక్లా అన్నారు. హైదరాబాద్‌లోని రసూల్‌పురాలో గురువారం నిర్వహించిన ఆదిత్య మెహతా ఫౌండేషన్‌ 14వ ప్రెజెంటేషన్‌ అండ్‌ ఫెలిసిటేషన్‌ కార్యక్రమంకు గవర్నర్‌ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దివ్యాంగ క్రీడాకారులతో స్వయంగా కలిసి మాట్లాడారు. వారికి ఇస్తున్న తర్ఫీదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు, శిక్షణ, పునరావాసం ద్వారా దివ్యాంగుల సాధికారత కోసం ఆదిత్య మెహతా ఫౌండేషన్‌ చేస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, జయేశ్‌ రంజన్‌,ఆదిత్య మెహతా ఫౌండేషన్‌ వ్యవస్థాపకులు ఆదిత్య మెహతా, ఆదిత్య మెహతా ఫౌండేషన్‌ ట్రస్ట్‌ అంజన సిన్హా ,సినీనటి లక్ష్మీ మంచు, తదితరులు పాల్గొన్నారు.

# తృణమూల్‌కు వరుస ఎదురుదెబ్బలు

**అసెంబ్లీ తరహాలో పార్లమెంటులోనూ తిరుగబాటు**

**తాజా రాజకీయాలపై జాతీయ మీడియాలో కథనాలు**

**కోల్‌కతా, జూన్‌4 (జనంసాక్షి) :** పశ్చిమ బెంగాల్‌లో అధికారం కోల్పోయిన మమతా బెనర్జీకి వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. అసెంబ్లీ తరలహాలోనే టీఎంసీ ఎంపీలు కూడా తిరుగుబాటు బావుటా ఎగరవేయనున్నారనే వార్తలు ప్రచారం అవుతున్నాయి. టీఎంసీకి చెందిన సుమారు 20 మంది ఎంపీలు తిరుగుబాటుకు సిద్ధంగా ఉన్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇప్పటికే ఈ ఎంపీలు బీజేపీతో టచ్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. ఈ విషయమై ఉన్నతస్థాయిలో చర్చలు కూడా జరుగుతున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. తృణ మూల్‌కు లోక్‌సభలో 28 మంది ఎంపీలు, రాజ్యసభలో 13 మంది ఎంపీలు ఉన్నారు. పార్లమెంటులో ఎంపీల సంఖ్యాపరంగా టీఎంసీ రెండో అతిపెద్ద ప్రతిపక్ష పార్టీగా ఉంది. ఈ నేపథ్యంలో పార్లమెంటు వేదికగా టీఎంసీ చీలిపోతే పార్లమెంటులో ప్రతిపక్షం ప్రభావం గణీయంగా తగ్గ తుందన్న వ్యాఖ్యలు వినిపి స్తున్నాయి. ఇటీవల పశ్చిమ బెంగాల్‌ అసెంబ్లీలో కనిపించిన సీన్‌ రాబోయే కొన్ని రోజుల్లో పార్లమెంటులో కూడా కనిపిస్తుందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. టీఎంసీ రెబల్‌ వర్గం బలం మరింత పెరుగుతుందని అంటున్నారు. ప్రస్తుతం తృణమూల్‌ అధినేత్రి మమతా బెనర్జీ తమ పార్టీ ఎన్నికల గుర్తు, పార్టీ పేరును కాపాడుకునే పనిలో నిమగ్నమైనట్టు మీడియాలో వార్తలు వెలువడ్డాయి. టీఎంసీకి రాష్ట్రంలో 80 ఎమ్మెల్యేలు ఉండగా రుతువ్రత బెనర్జీ నేతృత్వంలో 58 మంది ఎమ్మెల్యేలు తిరుగు బాటు బావుటా ఎగరేసిన విషయం తెలిసిందే. అసెంబ్లీలో తామే అసలైన టీఎంసీ అని రుతువ్రత స్పష్టం చేయడంతో ఆయనకు ప్రతిపక్ష నేత హోదా దక్కింది. పశ్చిమ బెంగాల్‌లో ఓటమి తరువాత టీఎంసీలో విభేదాలు పెరిగాయి.

# పర్యావరణ పరిరక్షణకు సైకిల్‌ వినియోగం

- ప్రజలకు చంద్రబాబు విజ్ఞప్తి

**అమరావతి, జూన్‌ 4 (జనంసాక్షి) :** జూన్‌ 5వ తేదీ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరు సైకిల్‌ వినియోగించాలని సీఎం చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం విశాఖపట్నంలో జరిగే ఒక కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. ఆ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు నాయుడు సైకిల్‌పై వెళ్లనున్నారు. పర్యావరణ హితమైన సైకిల్‌ వాడకాన్ని ప్రోత్సహించేందుకు సీఎం చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రజలు, పార్టీ నేతలతోపాటు ప్రభుత్వంలో పని చేసే వారంతా శు క్రవారం సైకిల్‌పై ప్రయాణించి పర్యావరణ పరిరక్షణకు సంకల్పం తీసుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. జూన్‌ 5వ తేదీ పర్యావరణ దినోత్సవం ఈ సందర్భంగా గురువారం ఆయన తన ఎక్స్‌ ఖాతా వేదికగా స్పందించారు. ఆయన ఏమన్నారంటే.. 'రేపు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అందరం కలిసి ఒక సంకల్పం చేద్దాం. భూమి మన ఇల్లు? ప్రకృతి మన జీవనాధారం. పర్యావరణాన్ని రక్షించుకోవడం మన బాధ్యత. సహజ వనరులను కాపాడుకుంటూ, గాలి, నీరు, నేలను కలుషితం కాకుండా అందరూ కృషి చేద్దాం. పచ్చదనం పెంపు, ఇంధన వనరులు పొదుపుగా వినియోగించడం అవసరం. అందులో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్‌ 5న సైకిళ్లు, ఈ -సైకిళ్లపై ప్రయాణిద్దాం. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటుదాం. రేపటి నా విశాఖ పర్యటనలో నేను సైకిల్‌పై ప్రయాణించి పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తాను. అంతా సహకరించాలని, మంచి కార్యక్రమానికి కలిసి రావాలని కోరుతున్నాను' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# దేశానికి యువతే ప్రాణం

- యువతను తీర్చిదిద్దే బాధ్యత తీసుకుంటా
- ఎక్స్‌ వేదికగా పవన్‌ కళ్యాణ్‌ వెల్లడి

**అమరావతి, జూన్‌4 (జనంసాక్షి) :** తన రాజకీయ ప్రయాణంలో యువత పాత్రను ప్రత్యేకంగా స్మరించుకుంటూ జనసేన అధినేత పవన్‌ కల్యాణ్‌.. సామాజిక మాధ్యమం ఎక్స్‌ వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. 2008లో ప్రజారాజ్యం పార్టీ(పీఆర్‌పీ) యువజన విభాగం 'యువరాజ్యం' కోసం పటిష్ఠమైన యువజన విభాగం నిర్మించాలని ప్రణాళిక చేశానని తెలిపారు. జనసేన పార్టీని స్థాపించి 12 ఏళ్లలో ఎన్నో కష్టాలు, పోరాటాలను అధిగమించిన తర్వాత.. పార్టీ కార్యకర్తలు ఇప్పుడు అనుభవం, పరిణితితో నిండి, సంస్థాగత బాధ్యతలు చేపట్టడానికి, రాజకీయాలు నిర్వహించడానికి, ప్రజా సమస్యలు పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ యువరాజ్యం యువజన విభాగానికి పవన్‌ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. 2005 నుంచి ఇప్పటి వరకు తనను విశ్వసించి అండగా నిలిచిన యువతకు పవన్‌ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నిజాయితీ, నిబద్ధత, దేశభక్తి కలిగిన యువతను, చైతన్యవంతమైన నాయకులను తీర్చిదిద్దేందుకు తాను కృషి చేస్తానని పవన్‌ ప్రతిజ్ఞ చేశారు.

# ఉపాధి హామీ పనుల్లో వేగం పెంచాలి

## రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌ శాఖ మంత్రి డాక్టర్‌ ధనసరి అనసూయ సీతక్క



**హైదరాబాద్‌, జూన్‌ 4 (జనంసాక్షి) :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్‌ఆర్‌ఈజీఎస్‌) కింద చేపడుతున్న అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేసి, కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయంలో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు, పనుల పురోగతి, నిధుల వినియోగంపై మంత్రి సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్‌, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్‌ దివ్య దేవరాజన్‌తో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, రాష్ట్రానికి ప్రస్తుతం మెటీరియల్‌ కాంపోనెంట్‌ కింద రూ.589 కోట్ల నిధులు అందుబాటులో ఉన్నాయని, ఈ నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు చేయడం ద్వారా రాష్ట్రానికి అదనంగా మరో రూ.600 కోట్ల వరకు నిధులు వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. అందువల్ల జిల్లాల వారీగా స్పష్టమైన కార్యాచరణ రూపొందించి, ఒక్క రూపాయి కూడా వెనక్కి వెళ్లకుండా అన్ని నిధులను సద్వినియోగం చేసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ఉపాధి హామీ పథకం కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్న మంత్రి, ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. ముఖ్యంగా రైతులకు ఎంతో ఉపయోగపడే పొలం బాటల నిర్మాణం, మరమ్మతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. గ్రామీణ రవాణా సౌకర్యాలు మెరుగుపడితే వ్యవసాయ ఉత్పత్తుల రవాణా సులభతరం అవుతుందని, రైతులకు అదనపు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్న మంత్రి, రాష్ట్ర వ్యాప్తంగా నిర్మిస్తున్న మహిళా సమాఖ్య భవనాల పనులను వేగవంతం చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి ఇటీవల వర్చువల్‌ విధానంలో శంకుస్థాపన చేసిన 8000 మహిళా గ్రామ సమాఖ్య భవనాల నిర్మాణ పనుల్లో ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని, నిర్ణీత గడువులోపు కనీసం 50 శాతం పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.




# పవన్‌ కళ్యాణ్‌ తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడారా?

- మీటింగ్‌కు అనుమతి ఎందుకు ఇవ్వలేదో చెప్పాలి
- ఇంకా సెంటిమెంట్‌ రాజకీయాలతో మోసం చేస్తే ఊరుకోరు
- బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌ల తీరుపై మండిపడ్డ బిజెపి అధ్యక్షుడు




**హైదరాబాద్‌, జూన్‌4 (జనంసాక్షి) :** ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌ కల్యాణ్‌ తెలంగాణకు వ్యతిరేకంగా ఎప్పుడు మాట్లాడలేదని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌ రావు అన్నారు. ఆయన మిటింగ్‌కి అనుమతి ఇస్తే ఏమవుతుందని రాంచందర్‌ రావు ప్రశ్నించారు. గురువారం హైదరాబాద్‌లో రాంచందర్‌ రావు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ సెంటిమెంట్‌ని మరోసారి రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. తెలంగాణను వ్యతిరేకించిన ఎంఐఎంని ఎందుకు దగ్గరకు తీసుకున్నారని ప్రశ్నించారు. తెలంగాణ సెంటిమెంట్‌ పేరుతో మళ్లీ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని రాంచందర్‌ రావు ఆగ్రహించారు. తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడిన వారితో చేతులు కలిపింది ఎవరో..? బీఆర్‌ఎస్‌ నేతలు చెప్పాలని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని శక్తులతో అధికార రాజకీయాలు చేసింది ఎవరు..? అని నిలదీశారు. తెలంగాణను తిట్టిన వారిని, ఉద్యమకారులను అవమానించిన వారిని బీఆర్‌ఎస్‌లో చేర్చి పదవులు ఇచ్చింది ఎవరు..? అని ప్రశ్నించారు. తెలంగాణ పేరుతో రాజకీయాలు చేసే ముందు మీ రాజకీయ చరిత్రను ఒకసారి ప్రజలకు గుర్తు చేయాలని అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవం మీద ప్రేమ ఉంటే డ్రామాలు కాదని... నిజాలు మాట్లాడాలని సవాల్‌ విసిరారు. ప్రజలు ఇప్పుడు భావోద్వేగాలకు కాదని, మీ గతానికి కూడా లెక్క అడిగే స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. పవన్‌ కల్యాణ్‌.. జనసేన సభ కోసం అనుమతి అడిగారని... ఇచ్చి ఉంటే కథ అక్కడే ముగిసేదని.. సభకు అనుమతి ఎందుకు ఇవ్వలేదో కాంగ్రెస్‌ సర్కార్‌ చెప్పాలని రాంచందర్‌ రావు ప్రశ్నించారు.




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370